అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 22-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 81

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

39 మందితో సీపీఐ(ఎం) తొలి జాబితా

కేరళలో 15, బెంగాల్‌లో 13 స్థానాలకు అభ్యర్థులు ఖరారు 3లో..



కేజ్రీవాల్ అరెస్ట్



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ అదుపులోకి..

ఢిల్లీ అంతటా నిషేధాజ్ఞలు

- ఆప్ నేతల నిరసనలు..పారా మిలటరీ మధ్య ఉద్రిక్తత
- అరెస్టు నుంచి విముక్తి చేయలేమన్న ఢిల్లీ హైకోర్టు.. మారిన సీను
- లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ సర్కార్ చర్యపై ప్రతిపక్షాల ఆగ్రహం
- అరెస్టును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు తలుపుతట్టిన కేజ్రీవాల్
- ఆయనే సీఎం.. జైలు నుంచే పరిపాలన: మంత్రి అతిషీ

ప్రతిపక్ష నాయకులను వేటాడడమే పనిగా పెట్టుకున్న మోడీ ప్రభుత్వం తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌పై పడింది. నాటకీయ పరిణామాల మధ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను అయన నివాసంలో అరెస్టు చేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నిటిని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన రోజునే ఈడీ ఈ చర్యకు పాల్పడడం గమనార్హం . కేజ్రీవాల్ అరెస్టును ఇండియా బ్లాక్‌లోని భాగస్వామ్య పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈడీ బలవంతపు చర్యల నుంచి రక్షణ కల్పించేందుకు ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో దీనిపై కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇంతలోనే ఈడీ అధికారుల బృందం అయిదు బస్సుల నిండా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్)ను వెంటేసుకుని ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి, ఆయన నివాసంలో విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఆ వెంటనే ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామం పట్ల దిగ్భ్రాంతికి గురైన ఆప్ శ్రేణులు ఈడీ చర్యపై ఆగ్రహిస్తూ భారీ నిరసనలకు దిగారు. దీంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఢిల్లీ పోలీసులు నగరమంతటా నిషేధాజ్ఞలు జారీ చేశారు. కేజ్రీవాల్ అరెస్టు కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రగా ఆమాద్మీ పార్టీ నేతలు విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగితే ఓటమి తప్పదన్న భయంతోనే రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి వేధించే చర్యలకు అది తెగబడుతోందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసింది. ఆయనను అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు తన నివాసం నుంచి ఈడీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆప్ కార్యకర్తలు అడ్డుకోబోగా.. పోలీసులు వారిని చెదరగొట్టారు. గురువారం ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్‌కు అరెస్ట్ నుంచి మినహాయింపు నిరాకరించిన కొద్ది సేపటికే సెర్చ్ వారెంట్‌తో ఢిల్లీలోని కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్న 12 మంది ఈడీ అధికారుల బృందం సోదాలు ప్రారంభించింది. విచారణ అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుంది. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తారనే ప్రచారం మొదటి నుంచీ జరిగింది. అందరూ అనుకున్నట్టుగానే ఆయన్ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అంతకంటే ముందు.. శాంతిభద్రత ల సమస్య తలెత్తకుండా ఉండేందుకు కేజ్రీవాల్ ఇంటి వద్ద, ఈడీ కార్యాలయం వద్ద కేంద్ర భద్రతా బలగాలను భారీగా మోహరించారు. ఆప్ నేతలు, కార్యకర్తలు కేజ్రీవాల్ ఇంటి వద్దకు వచ్చినా.. వారందరినీ భద్రతా సిబ్బంది నిలువరించింది. లిక్కర్ స్కాం మనీలాండరింగ్ వ్యవహారంలో ...5లో

21 MARCH

రాత్రి 8:01: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇంటి బయట పటిష్ట భద్రతా ఏర్పాట్లు ..ఆర్‌ఏఎఫ్ బలగాల మోహరింపు.
8:10: సీఎం కేజ్రీవాల్ ఫోన్లు ఈడీ జప్తు
8:32: ఈడీ కార్యాలయం వెలుపల భద్రత పెంపు.. సెక్షన్ 144 విధింపు
8:35: ఈడీ కార్యాలయానికి వెళ్లే రహదారిపై బారికేడింగ్, సెక్షన్ 144 బోర్డుల ఏర్పాటు
8:47: కేజ్రీవాల్ నివాసం ఎదుట ఆప్ నేతల నినాదాలు..అరెస్టులు
రాత్రి 8:57: ఢిల్లీ సీఎం ఇంటికి ఈడీ అధికారి కపిల్ రాజ్, ఈడీ జాయింట్ డైరెక్టర్
పీఎంఎల్‌ఏ సెక్షన్ 50 కింద కేజ్రీవాల్ వాంగ్మూలం నమోదు
9:08: కేజ్రీవాల్ నివాసం వెలుపల డ్రోన్లతో నిఘా
9:13: కేజ్రీవాల్ అరెస్ట్

భయాందోళనలో బీజేపీ




కేజ్రీవాల్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం . ఇది ఇండియా కూటమిలో రెండో సిట్టింగ్ సీఎం అరెస్టు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు తిరస్కరిస్తారని మోడీ ప్రభుత్వం, బీజేపీ భయాందోళనకు గురవుతున్నాయి. పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరిన ప్రతిపక్ష నేతలందరికీ రక్షణ, ఆదరణ కల్పిస్తూ, లొంగని వారిని అరెస్టులతో టార్గెట్ చేసి బీజేపీ లబ్ధి పొందాలనుకుంటుంది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ఇలాంటి చర్యలను ఖండించాలి. - సీతారాం ఏచూరి

భయపడ్డ నియంత ..



భయపడ్డ నియంతే కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. మీడియాతో సహా అన్ని సంస్థలను కబ్జా చేయడం, పార్టీలను చీల్చడం, కంపెనీల నుంచి డబ్బులు దండుకోవడం, ప్రధాన ప్రతిపక్షం ఖాతా స్తంభింపజేయడం వంటి పైశాచికాలు సరిపోకపోగా, ఇప్పుడు ఎన్నికైన ముఖ్యమంత్రులను కూడా అరెస్టు చేస్తున్నారు. ఇది పిరికి చర్య. - రాహుల్ గాంధీ



ఎట్టకేలకు ఈసీకి బాండ్ల వివరాలు

సుప్రీంకోర్టు ఆదేశాలతో అందజేసిన ఎస్‌బీఐ

ధ్రువీకరిస్తూ అఫిడవిట్ సమర్పణ

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను ఎస్‌బీఐ గురువారం ఎలక్షన్ కమిషన్‌కు అందజేసింది. అత్యంత కీలకమైన యూనిక్ నెంబర్ల సమాచారం కూడా అందులో ఉంది. పూర్తి వివరాలు అందజేశానని తెలియజేస్తూ ఎస్‌బీఐ చైర్మెన్ దినేశ్ కుమార్ ఖారా సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించారు. బాండ్లను ఎవరు కొనుగోలు చేశారు, వాటిని ఏయే పార్టీలు నగదుగా మార్చుకున్నాయి వంటి ముఖ్యమైన వివరాలను సరిపోల్చడానికి యూనిక్ నెంబర్లు ఉపకరిస్తాయి. ఎస్‌బీఐ అందించిన వివరాల్లో కొనుగోలుదారుని పేరు, బాండ్ సీరియల్ నెంబరు, యూఆర్‌ఎన్ నెంబరు, జర్నల్ తేదీ, కొనుగోలు చేసిన తేదీ, ఎక్స్‌పయిరీ తేదీ, బాండ్ విలువ, ...13లో



వాట్సాప్‌లో వికసిత్ భారత్ మెసేజ్‌లు ఆపండి

కేంద్రానికి ఈసీ ఆదేశం

- ఐదు రాష్ట్రాల్లో ఎస్పీ, మెజిస్ట్రేట్‌లు బదిలీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వాట్సాప్‌లో వికసిత్ భారత్ మెసేజ్‌లు ఆపాలని కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. మొబైల్ యూజర్లకు ఇప్పటికీ వికసిత్ భారత్ పేరుతో వాట్సాప్‌లో మెసేజ్‌లు వస్తుండటంతో ...6లో



కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలు సీజ్

- ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలు వాడుకోకుండా చేయడం దారుణం
- ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా అడ్డుకునేందుకే మోడీ సర్కార్ కుట్ర : సోనియా, రాహుల్ , ఖర్గే

వివరాలు 3లో

బీజేపీ ఓటమే సీపీఐ(ఎం) లక్ష్యం

పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

మేడిగడ్డపై న్యాయ విచారణ కమిటీలు వేయాలి

- కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సిద్ధమే..: రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

బీజేపీని కేంద్రంలోనే కాదు.. రాష్ట్రంలో ఆ పార్టీ ఆధీనంలో ఉన్న నాలుగు ఎంపీ స్థానాల్లోనూ ఓడించడమే తమ లక్ష్యమని ...13లో

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

రుణమాఫీ ప్రకటించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ 13లో

మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

ఈ స్థాయికి ఎదగడానికి మల్కాజిగిరి ప్రజలే కారణం ఎంపీ సీటే కాదు కంటోన్మెంట్‌లోనూ గెలవాలి

రాష్ట్రమంతా అనుసరించేలా ప్రచారముండాలి

- పనిచేసేటోళ్లకు పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తాం : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాను సీఎం స్థాయికి ఎదగడానికి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలే కారణమనీ, అలాంటి చోట ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేసేలా ప్రణాళికతో పనిచేయాలని ఆ పార్టీ నాయకులకు టీపీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హోలీ పండగలోగా అధిష్టానం మిగతా ఎంపీ అభ్యర్థులను ప్రకటిస్తుందని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అందులో సీఎంతో పాటు మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, పట్నం సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, ...13లో

57 మందితో కాంగ్రెస్ మూడో జాబితా

రాష్ట్రంలో ఐదు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

పెద్దపల్లి - గడ్డం వంశీకృష్ణ
మల్కాజిగిరి - సునీతా మహేందర్ రెడ్డి
సికింద్రాబాద్ - దానం నాగేందర్
చేవెళ్ల - గడ్డం రంజిత్ రెడ్డి
నాగర్ కర్నూల్ - మల్లు రవి

వివరాలు 3లో..

పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలి

లేకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం

- ఇచ్చేదాకా నల్లబ్యాడ్జీలతో పంచాయతీ కార్మికుల విధులు
- రూ.9,500 వేతనం కూడా ఇవ్వలేని స్థితిలో సర్కారుందా?
- సీఎం, ఆర్థిక మంత్రి సమస్యలు పరిష్కరించాలి వివరాలు 6లో..
- మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి : పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడిలో పాలడుగు భాస్కర్



పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

సీఎస్ శాంతి కుమారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలీస్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కరానటక, ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ...13లో

సీఎం రేసులో లేను

బీజేపీతో టచ్...అబద్ధం



- ధరణి భూ ఆక్రమణలపై ఉక్కు పాదం
- రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేస్తాం
- కేంద్ర పన్నుల వాటాపై శ్వేత పత్రం
- కాళేశ్వరం అవినీతిపై విచారణ కొనసాగుతోంది
- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు: మీడియాతో చిట్ చాట్‌లో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

" నేను ముఖ్యమంత్రి రేసులో లేను... సీఎం కావాలని అనుకోవట్లేదు.. ఆ ఆలోచన కూడా లేదు... అదంతా ప్రచారం... బీజేపీతో టచ్‌లో ఉన్నాననే వార్తలు అబద్ధం.... కాంగ్రెస్ పార్టీలో నెంబర్ టూ అంటూ ఎవరూ లేరు..... ధరణి భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతాం...రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసి అవినీతిని అరికడతాం .....కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాపై శ్వేతపత్రం తెస్తాం...కాళేశ్వరం అవినీతిపై విచారణ కొనసాగుతోంది.... వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

"కాంగ్రెస్ పార్టీలో నేను చాలా జూనియర్‌ని.. సీఎం పోస్టుకు సంబంధించి హైకమాండ్‌కు కూడా కొన్ని ఈక్వేషన్స్ ఉంటాయి. వాటి ప్రకారమే పార్టీ నిర్ణయముంటుంది.... అని" ఎన్నికల తర్వాత ...13లో





ఎర్రబెల్లికి బిగుస్తున్న ఉచ్చు..?

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు దయాకర్‌రావు సన్నిహితులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఉచ్చు బిగుస్తుందా? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఆ దిశగానే విచారణ జరగడాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అరెస్టు చేసి విచారణ చేస్తున్న నేపథ్యంలో 'ఎర్రబెల్లి'తో సన్నిహితంగా వున్న పలువురు పోలీసు అధికారులను కూడా జనగామ జిల్లా నుంచి విచారణ నిమిత్తం తీసుకువెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

- ఆందోళనలో బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నలుగురు పోలీసు అధికారులను విచారణ అధికారులు తీసుకువెళ్లినట్టు సమాచారం. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి ఎర్రబెల్లి పేరు కూడా ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారులు తీసుకుపోయిన వారిలో గతంలో పాలకుర్తి ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన అధికారులుండటం గమనార్హం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోలీసు అధికారుల పోస్టింగ్‌లు స్థానిక ఎమ్మెల్యే సిఫారసులతోనే జరిగాయని గతంలో వార్తలు వచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి పేరు వినిపిస్తోంది. దాంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు కావడంతో తెర వెనుక వున్న పెద్దల జాబితాను విచారణ అధికారులు వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రుల హస్తం వుండే అవకాశమున్నట్టు ప్రచారం జరుగుతోంది.

'ఎర్రబెల్లి' వర్గీయుల్లో ఆందోళన

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇటీవల తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేస్తూ తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. ఇదే సందర్భంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు 'ఎర్రబెల్లి' స్వగ్రామం పర్వతగిరితో బంధుత్వం ఉంది. ఎర్రబెల్లి వ్యాఖ్యలు ఆయన అనుచరుల్లో, బీఆర్ఎస్ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి విచారణకు హాజరైన ఆ నలుగురు పోలీసు అధికారులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అత్యంత సన్నిహితులని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ కేసులో ఇంకెవరి ...13లో

ఎన్ఐఏ కేసు నిందితులకు బెయిల్

నవతెలంగాణ -హైదరాబాద్

ఒక మతానికి చెందిన వారికి చట్ట వ్యతిరేక శిక్షణ ఇస్తున్నారంటూ ఎన్ఐఏ నమోదు చేసిన కేసులో ఎనిమిది మంది నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులు మహ్మద్ అబ్దుల్ మోబీన్ మొబిన్, షేక్ రహీం అలియాస్ అబ్దుల్ రహీం, షేక్ వహీద్ అలి అబ్దుల్ వహీద్, షేర్ ప్రలాబాన్, షేక్ ప్రొదుల్లా, మహ్మద్ ఉస్మాన్, ఫిరోజ్‌ఖాన్, షేక్ రియాజ్ అహ్మదుల్లాకు బెయిల్ మంజూరు చేసింది. ఈమేరకు జస్టిస్ కే లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు తదితర ప్రాంతాల్లో ఒక మతానికి చెందిన యువతకు శిక్షణ ఇచ్చారనే కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. వాళ్లకు బెయిల్ మంజూరు చేసేందుకు నాంపల్లి ఎన్ఐఏ కోర్టు నిరాకరించింది. దీంతో వారంతా వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేయడంతో హైకోర్టులో బెయిల్ లభించింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్లతో పాటు అంతే మొత్తానికి మరో ఇద్దరు పూచీకత్తులు సమర్పించాలని, తిరిగి ఉత్తర్వులు జారీ చేసేదాకా సంబంధిత పోలీసు స్టేషన్లలో ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోగా హాజరుకావాలని ఆదేశించింది. సాక్షులను ఏవిధంగానూ బెదిరించకూడదనీ, ప్రలోభాలకు గురిచేయొద్దని సూచించింది. పాస్‌పోర్టులను కింది కోర్టులో స్వాధీనం చేయాలనీ, కేసు విచారణకు సహకరించాలని కోరుతూ షరతులు విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

కలుషిత చెరువు నీటితో సాగును అడ్డుకోండి

- ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో కాలుష్యమైన చెరువుల నీటితో ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయడాన్ని అడ్డుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి కూరగాయల వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి అలాంటి వాటికి సంబంధించి మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు జిల్లాల పరిధిలోని 13 చెరువుల దుస్థితిపై అడ్వొకేట్ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ అనిల్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల పై విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని చెరువుల దుస్థితిపై 2007లో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని గతంలో విచారించిన ధర్మాసనం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు అడ్వొకేట్ కమిషన్‌ను నియమించింది. చెరువులు ఆక్రమణలు వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన నివేదిక ఇచ్చింది. రెండు జిల్లాల్లోని 13 చెరువుల వారీగా సమగ్ర నివేదికను అందజేసింది.

ఈ క్రమంలో చెరువుల ఆక్రమణలను తొలగించాలనీ, వాటిల్లోకి మురుగునీరు చేరకుండా చేయాలనీ, చెరువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువులకు పెన్సింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి పునరుద్ధరణ చర్యలు తీసుకుని వాటి ఫొటోలతో సహా ఏప్రిల్ 23లోగా కార్యాచరణ నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది

కన్నారావు పిటిషన్ డిస్మిస్

నవతెలంగాణ-హైదరాబాద్

భూకబ్జా, హత్యాయత్నంపై ఆదిభట్ల పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పిన్ని కొడుకు కల్వకుంట్ల కన్నారావు అలియాస్ తేజేశ్వర్‌రావు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది మన్నెగూడ వద్ద రెండెకరాల ప్రయివేటు భూమిని కన్నారావు మరో 30 మందితో కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై ఓఎస్‌ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బండోజు శ్రీనివాస్ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. బీఆర్ఎస్‌కు చెందిన తమపై రాజకీయ కక్షలతో వేధింపులకు దిగుతున్నారనీ, కేసును కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ కె.సుజన బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక ఆధారాలున్నందున ఈ దశలో కేసును కొట్టేయలేమని పేర్కొన్నారు. చట్టప్రకారం దర్యాప్తు నిర్వహించాలని పోలీసులను ఆదేశిస్తూ, కన్నారావు పిటిషన్‌ను కొట్టివేశారు.

ప్రణీత్‌రావు పిటిషన్ డిస్మిస్

నవతెలంగాణ-హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ కుమార్ అలియాస్ ప్రణీత్ రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం డిస్మిస్ చేసింది. పోలీసు కస్టడీని సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించలేమని జస్టిస్ జి రాధారాణి స్పష్టం చేశారు. కేసు విచారణ దశలో ఉండగా తాము జోక్యం చేసుకోబోమని తీర్పులో పేర్కొన్నారు. పోలీసుస్టేషన్‌లో సరైన సదుపాయాలు లేవనే కారణంతో విచారణ పూర్తయ్యాక జైలుకు పంపేలా ఆదేశాలు జారీ చేయలేమని తెలిపారు.

మరో రెండు రోజుల్లో పోలీసుల కస్టడీ ముగుస్తుందనీ, ఈ దశలో పోలీసుల విచారణకు అవరోధం కలిగించేలా కస్టడీ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇవ్వలేమని తెలిపారు.'ఉదయం 8 నుంచి రాత్రి 8 దాకా పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కేవలం కార్యాలయాల పనివేళల్లో మాత్రమే విచారించేలా ఆదేశాలు ఇవ్వాలి. ఏకంగా 12 గంటలపాటు విరామం లేకుండా విచారణ చేయడం చట్ట వ్యతిరేకం. పోలీసుల దర్యాప్తులోని అంశాలను మీడియాకు లీకులు చేస్తున్నారు. లీకుల ద్వారా నాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. మీడియాకు లీకులు లేకుండా చూడాలి. బంధువులను కలవనివ్వడంలేదు. రెండు రోజులకోసారి వైద్యపరీక్షలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలి'... అని ప్రణీత్ రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది

23న 'సేవ్ డెమోక్రసీ డే' నిర్వహిద్దాం

- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను స్మరిస్తూ అమరవీరుల దినోత్సవమైన ఈనెల 23ను 'సేవ్ డెమొక్రసీ డే'గా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది.ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, గ్రామ కేంద్రాల్లో కాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, అమరవీరులకు నివాళులర్పించడంతోపాటు సభలు, సమావేశాలు నిర్వహించాలని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, పశ్య పద్మ, వి. ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, కొండల్, పెద్దారపు రమేష్, జక్కుల వెంకటయ్య ప్రమీల, నాగిరెడ్డి, బాలమల్లేశ్, ఆర్. వెంకట్రాములు, రామకృష్ణ, గోనె కుమారస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎస్‌కేఎంతోపాటుతోపాటు, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, వృత్తి, ఆదివాసీ, గిరిజన, సామాజిక, మైనార్టీ సంఘాలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈదురుగాలులు, వడగండ్ల వానతో వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, నిర్మల్ తదితర జిల్లాల్లో 20 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొక్కజొన్న, వరి, జొన్న, మిరప, శనగ, మామిడి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కోత కోసిన పంటలేకాక, మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కూడా తడిసి ముద్దయిందని తెలిపారు.

తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.40వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపి అక్కడి నుంచి నిధులు రాబట్టుకోవాలని కోరారు.

ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు

- ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్న 60 కంపెనీలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు 145 కంపెనీల కేంద్ర బలగాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఇందులో 60 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను రాష్ట్రానికి పంపారు. కాగా, మిగతా 85 కంపెనీలను పోలింగ్ తేదీ నాటికి పంపించనున్నారని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల బందోబస్తు కోసం 345 కంపెనీల బలగాలను కేంద్రం పంపిందని చెప్పారు. అయితే, లోక్‌సభ ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతున్న దృష్ట్యా.. అన్ని రాష్ట్రాలకు శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం కేంద్ర బలగాలను ఎన్నికల కమిషన్ కేటాయించవల్సి ఉంటుందనీ, ఈ కారణంగా రాష్ట్రానికి కోరినన్ని బలగాలు పంపించటం సాధ్యం కాదని సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) పోలీసులు, స్పెషల్ పోలీస్ బెటాలియన్స్‌కు చెందిన బలగాలు, ఎస్పీఎఫ్ పోలీసు బలగాలు, హెూంగార్డులు కలిపి దాదాపు 60వేల మంది పోలీసులను కూడా ఎన్నికల బందోబస్తుకు వినియోగిస్తున్నట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం రాష్ట్రానికి చేరుకున్న బలగాలలో సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, సీఐఎస్ఎస్, ఐటీబీపీకి చెందిన బలగాలున్నాయని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న సున్నితమైన ప్రాంతాలకు ముందస్తు చర్యగా కేంద్ర బలగాలను కేటాయించినట్టు జైన్ చెప్పారు. మొత్తమ్మీద, రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించేలా పోలీసులకు తగిన దిశానిర్దేశం చేయటం జరిగిందనీ, ముఖ్యంగా, ఓటర్లను ప్రలోభపెట్టే క్రీడా సామాగ్రి, చీరల పంపిణీ, డబ్బుల పంపిణీని నిరోధించటానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి రంగంలోకి దించామని ఆయన తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలతో పాటు అటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఎన్నికలు ప్రశాంతంగా ముగియటానికి భద్రతాపరంగా అన్ని విధాలా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టినట్టు ఆయన వివరించారు.

రెండోరోజూ ఇంజినీర్లతో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ రెండో రోజూ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో సమావేశమైంది. హైదరాబాద్‌లోని జలసౌధలో చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ విడివిడిగా చర్చలు జరిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ డిజైన్ల వివరాలపై ఆరా తీసింది. వాటిని రూపొందించిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో ఇప్పటికే బుధవారం ఒకదఫా సమావేశమైన సంగతి తెలిసిందే. గురువారమూ ఈ భేటి కొనసాగింది. ప్రాజెక్టు నిర్మాణంలో బాధ్యులైన ఇంజినీర్లతో వ్యక్తిగతంగా మాట్లాడుతున్న చంద్రశేఖర్ అయ్యర్, ఇతర కమిటీ సభ్యులు డిజైన్లకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకుంటున్నారు. బ్యారేజీల నిర్వహణ బాధ్యతలు చూసే అపరేషన్, నిర్వహణ విభాగం నుంచి కమిటీ సభ్యులు సమగ్ర వివరాలు కోరారు. 2019లో సమస్యలు ఉత్పన్నమైనప్పటి నుంచి తీసుకున్న చర్యలు, చేపట్టిన తనిఖీల సమాచారాన్ని ఇవ్వాలని రాష్ట్ర సాగునీటిపారుదల అధికారులను నిపుణుల కమిటీ ఆదేశించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ పనులు చేసిన గుత్తేదార్ల ప్రతినిధులతోనూ సమావేశం కానుంది. మూడు బ్యారేజీల మోడళ్లను కమిటీ శుక్రవారం పరిశీలించనున్నట్టు సమాచారం. జలసౌధలో చేటీ అయిన అధికారులకు ఈఎన్సీ జనరల్ బి. అనిల్‌కుమార్ అన్నీ ఏర్పాట్లు చేశారు.

తొలిరోజు విచారణకు మాజీ ఈఎన్సీ జనరల్ సి.మరళీధర్, కాళేశ్వరం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల స్థలాలను ఎందుకు మార్చాల్సి వచ్చిందో అడిగి వివరణ తీసుకున్న సంగతి తెలిసిందే.

స్టే విధించేందుకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషనర్‌లను నియమించే చట్టంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. ఈ దశలో స్టే విధిస్తే గందరగోళానికి దారితీస్తుందని పేర్కొంది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టం ప్రకారం.. నియమితులైన ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులపై ఎటువంటి ఆరోపణలు లేవని కోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం కార్యనిర్వాహక అధికారి కింద ఉందని చెప్పలేమని జస్టిస్ సంజీవ్ ఖన్నా జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది కేంద్రం రూపొందించిన చట్టం తప్పు అని భావించలేమని, నియమితులైన వ్యక్తులపై కూడా ఎలాంటి ఆరోపణలు లేవని, ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ సమయంలో సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) బిల్లు 2023ని గతేడాది పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్రపతి ఆమోదం పొందింది. నూతన చట్టం ప్రకారం.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రితో ఎన్నికల కమిషనర్‌లను ఎన్నుకునేందుకు కమిటీని రూపొందించింది. దీంతో ఈ కమిటీ నిష్పాక్షితపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కమిటీ ఎంపిక అనంతరం లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిటీ ఎంపిక ముందు రోజు తనకు పరిశీలన కోసం 212 పేర్లను ఇచ్చారని, సమావేశానికి ముందు ఆరు పేర్లతో షార్ట్‌లిస్ట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కొత్త చట్టంతో కమిటీ ఎంపికను 'లాంఛనప్రాయం' చేసిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఫ్యాక్ట్ చెక్ యూనిట్ నోటిఫికేషన్‌పై స్టే విధించిన సుప్రీంకోర్టు

ఫ్యాక్ట్ చెక్ యూనిట్ నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. నకిలీ వార్తల సమస్యను పరిష్కరించేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో (పిఐబి) ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు బాంబే హైకోర్టు తీర్పుని పక్కన పెట్టింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశమని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసు అర్హత గురించి ప్రస్తావించలేదు. ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌పై కేంద్రం నోటిఫికేషన్‌ను అడ్డుకోవాలని కోరుతూ.. స్టాండ్ అప్ కమిడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా బాంబే హైకోర్టుని ఆశ్రయించారు. ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు బాంబే హైకోర్టు నిరాకరించింది. దీంతో ఈ తీర్పును సవాల్ చేస్తూ పిటీషనర్లు సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు.నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకుగాను ఫ్యాక్ట్‌చెక్ యూనిట్‌ను తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం గతే డాది ఏప్రిల్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు సవరణలు చేసింది. అయితే,

ఈ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని, భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.

ఎన్నికల తర్వాత జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు

- ఏడాదిలోగా ఇతర సమస్యల పరిష్కారం
- ఫెడరేషన్‌కు మంత్రి పొంగులేటి హామీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల తర్వాత జర్నలిస్టులకు ఇండ్లస్థలాల సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ పూర్తయిన నెలరోజుల్లోనే ఇండ్లస్థలాల విషయమై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన మీడియా చిట్‌చాట్ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పి.రాంచందర్, కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు మంత్రిని కలిశారు. జర్నలిస్టుల సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి మంత్రికి వివరించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ ఎన్నికలు పూర్తికాగానే ఇండ్లస్థలాలను ఇస్తామన్నారు. అలాగే హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్లు, ఇతర సమస్యలను ఏడాదిలోగా సెటిల్ చేస్తామన్నారు.

72.88 లీటర్ల మద్యం పట్టివేత

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ వెల్లడి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ హైదరాబాద్ నగరంలో ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, మాదకద్రవ్యాలతో పాటు విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. గురువారం 72.88 లీటర్ల లిక్కర్‌ను, రూ.38,150 విలువైన వస్తువులను జప్తు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. పోలీస్, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు క్షేత్ర స్థాయిలో 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం రూ.47,18,300 రూ.17,87,290 విలువ గల ఇతర వస్తువులను పట్టుకున్నారని తెలిపారు. మద్యం తరలింపు ఘటనలో 19 మందిపై ప్రోహిబిషన్ కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు వివరించారు.

రుతుక్రమ రుగ్మతకు మందు పేరుతో మోసం

- డ్రగ్ కంట్రోల్ అథారిటీ దాడుల్లో పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అక్రమార్కులు ధనార్జన కోసం ఏ మార్గాన్ని వదిలిపెట్టడం లేదు. మహిళలకు ఇబ్బంది కలిగిన రుతుక్రమ రుగ్మతలను తగ్గించే పేరుతో తప్పుడు ప్రకట నలిస్తూ కొలినల్ -స్పాస్ టాబ్లెట్స్‌ను అమ్ముతున్నట్టు కామారెడ్డిలో గుర్తించారు. వీటిని అక్కడి కోణార్క్ పంపిణీ దారులు వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో నిర్దేశించిన ధర కన్నా డెక్సామెథసోన్ ఉత్పత్తిని అమ్ముతున్నట్టు గుర్తించారు. దీని నిర్దేశిత ధర రూ.26.7 (30 ఎంఎల్)కు కాగా సీలింగ్ ప్రైజ్‌కు జీఎస్టీ కలిపినా రూ.29.904 కన్నా ఎక్కువకు అమ్మడానికి వీల్లేదు. కానీ దీన్ని రూ.39.90కు లేబుల్ పెట్టి అమ్ముతున్నారు. దీని తయారీ దారు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన లాబోరేట్ ఫార్మాస్యూటికల్స్ ఇండియా లిమిటెడ్ ఫుడ్ లైసెన్స్ పేరుతో థైంప్ - 100 టాబ్లెట్స్ (థైమైన్ హైడ్రో క్లోరైడ్ టాబ్లెట్స్ 100 ఎంజీ) మార్కెట్ లోకి పంపిణీ చేస్తున్నట్టు కుత్బుల్లాపూర్ జోన్‌లో గుర్తించారు. మల్కాజిగిరి వసంతపురి కాలనీ, శ్రీ అనుక్రిష్ణ ఫార్మసీలో దాడి చేయగా ఇవి బయటపడ్డాయి. ఇలాంటి నకిలీ మందులు వాడిన పక్షంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వి.బి.కమలాసన్ రెడ్డి సూచించారు.

అవినీతిపై ఆధారాలుంటే బయట పెట్టండి

- బీఆర్ఎస్ నేతలకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చిత్రపురి సొసైటీలో జరిగిన అవినీతికి, సీఎం రేవంత్‌కు సంబంధమేంటని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. సీఎం సోదరుల్లో మహేందర్‌రెడ్డి అనే పేరు ఎప్పుడైనా విన్నారా? అని నిలదీశారు. నిజంగా మీ దగ్గర ఆధారాలుంటే, ప్రభుత్వానికి ఇవ్వాలని సవాల్ విసిరారు. తప్పకుండా వారిపై తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కార్పొరేషన్ల చైర్మెన్లు ప్రీతమ్, మెట్టు సాయికుమార్, అధికార ప్రతినిధి డాక్టర్ లింగంయాదవ్, యూత్ కాంగ్రెస్ నేత రాజీవ్ రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి క్రిశాంక్ సీఎం రేవంత్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అనవసరంగా, ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తే చూస్తూ ఉరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో మీడియాను, సోషల్ మీడియాను బీఆర్ఎస్ కేసీఆర్ ఎలా అణిచివేశారో అందరికి తెలుసనని అన్నారు. హుజురాబాద్‌లో తన ఫోన్ తీసుకుని కేసు నమోదు చేశారని వాపోయారు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరిన మిర్చి రైతులకు బీఆర్ఎస్ సర్కారు సంకెళ్లు వేసిన సంఘటనను అప్పుడే మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపుతారనే భయంతో ధర్నాచౌక్ ఎత్తేసినప్పుడు మాట్లాడని నాయకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంట్లోకి వచ్చి అరెస్టులు చేసిన సంఘటనలు మర్చిపోయారా? 'నేను మాజీ సీఎం కేసీఆర్ గారి పుట్టిన రోజు సందర్భంగా గాడిదకు ఫోటో వేస్తే ఆ గాడిద యాజమానిని బెదిరించి దొంగతనం జరిగిందంటూ తనపై సుమోటోగా కేసులు పెట్టారు' అని గుర్తు చేశారు.క్రిశాంక్ కాంగ్రెస్‌లో ఉన్నపుడు ఇద్దరం కలిసి ఉద్యమాలు చేస్తే ఇద్దరిపై కేసులు పెట్టిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. అవాస్తవాలు చెప్పడం మానుకోవాలని హెచ్చరించారు.

సీఎంను కలిసిన ముత్తినేని

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్‌గా తనను నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ముత్తినేని వీరయ్య ధన్యవాదాలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి విజ్ఞప్తిమేరకు ప్రభుత్వం ఆ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలు సీజ్

ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలు వాడుకోకుండా చేయడం దారుణం

- ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా అడ్డుకునేందుకే మోడీ సర్కార్ కుట్ర
- పోస్టర్లు ప్రింట్ చేయలేకపోతున్నాం
- బీజేపీ తీరు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం
- కాంగ్రెస్ నేతల మండిపాటు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయడంపై కాంగ్రెస్ అగ్రనేతలు మండిపడ్డారు. గురువారంనాడిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో పాటు పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, అజయ్ మాకెన్ మాట్లాడారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తమ పార్టీకే కాదని మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలను వాడుకోకుండా చేయడం అప్రజాస్వామికమన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసిందని విమర్శించారు. బీజేపీ వేల కోట్లు విరాళాలుగా తీసుకుని, కేవలం తమ బ్యాంకు ఖాతాలను ఎందుకు స్తంభింపజేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు, ఆదర్శాలకు భారత్ పేరు గాంచిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన విషయం ప్రజలకు తెలిసిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిష్పక్షపాతమైన ఎన్నికలు తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరికీ సమానమైన అవకాశాలుండాలని ఖర్గే పేర్కొన్నారు. మోడీ పాలనలో దేశ ప్రతిష్ట దిగజారుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను సీజ్ చేయడంతో ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓ రాజకీయ పార్టీని ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డంకులు సృష్టించడం సరికాదని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఎక్కడ చూసినా బీజేపీ ప్రకటనలే కనిపిస్తున్నాయని, తమ బ్యాంకు ఖాతాలు స్తంభిపజేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు.

బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌తో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నాం: రాహుల్ గాంధీ

తమ బ్యాంక్ అకౌంట్లన్నింటినీ ఫ్రీజ్ చేశారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల కోసం తమ ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నట్టు ఆయన చెప్పారు. తమ పార్టీ మద్దతుదారులు, అభ్యర్థులకు మద్దతు ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. తమ నేతలు పర్యటనలు చేపట్టలేకపోతున్నారన్నారు. ఎన్నికల వేళ తమ పార్టీ యాడ్స్‌ను ఇవ్వలేకపోతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలమన్నారు. ఎవరిదైనా బ్యాక్ అకౌంట్ మూసివేసినా, ఏటీఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా? ప్రస్తుతం తాము ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండా బీజేపీ కుట్రకు పాల్పడిందన్నారు.

ఎన్నికల ప్రచారానికి రెండు నెలల ముందే తమ పార్టీని నిర్వీర్యం చేశారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా.. క్రిమినల్ చర్యకు పాల్పడినట్లు రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికలకు రెండు నెలల ముందు ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బీజేపీ ఉద్దేశంగా కనిపిస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉన్న కొన్ని సంస్థలు ఇప్పుడు ఆ పనిచేయలేకపోతున్నాయని వెల్లడించారు. ఒక్క కోర్టు కూడా ఎటువంటి విషయాన్ని చెప్పలేకపోతుందని, ఎన్నికల సంఘం మౌనంగా ఉండిపోయిందని విమర్శించారు.

మరే సంస్థ కూడా నోరు మెదపడం లేదని, మీడియా కూడా ఏమీ చెప్పడం లేదని విమర్శించారు. భారత్‌లో ఇప్పుడు ప్రజాస్వామ్యం లేదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రజల నుంచి దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

ప్రధాని మోడీ వ్యవస్థీకృత దాడి: సోనియా గాంధీ

కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయడంపై సోనియా గాంధీ తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఓ వ్యవస్థీకృత పద్ధతిలో ప్రధాని మోడీ కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల అంశం కేవలం కాంగ్రెస్ పార్టీపై మాత్రమే ప్రభావం చూపడంలేదని, ప్రాథమికంగా అది మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన నిధుల్ని ఫ్రీజ్ చేశారని, తమ అకౌంట్ల నుంచి డబ్బును లాగేసుకుంటున్నారని దుయ్యబట్టారు. చాలా విపత్కర పరిస్థితులు, సవాళ్ల మధ్య తమ ఎన్నికల ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు పేర్కొన్నద న్నారు. ఎలక్టోరల్ బాండ్ల వల్ల బీజేపీకి చాలా లాభం చేకూ రిందని, మరో వైపు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీపై మాత్రం తీవ్ర దాడి జరుగుతున్నట్లు సోనియా పేర్కొ న్నారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో జరుగుతున్న పరిణామాలు అసాధారణమైనవని, అప్రజాస్వామికమైనవని అన్నారు.

కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నాలు: అజయ్ మాకెన్

కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలపై నరేంద్ర మోడీ ప్రభుత్వ దాడి కాదని దేశ ప్రజాస్వామ్యంపై దాడని ఆయన అభివర్ణించారు. తాము రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసుకోవాల్సి ఉండగా, ఇప్పుడు తమ ఖాతాలను నిలిపివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము ప్రచారం చేసుకోలేకపోతున్నామన్నారు. పోస్టర్లు వేయించడానికి వీలులేని పరిస్థితులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. ఎన్నికల తేదీలు ప్రకటించినా తాము బ్యాంకులో ఉన్న రూ. 285 కోట్లను వినియోగించుకోలేక పోతున్నామని అన్నారు. ప్రచారం కోసం తాము వార్తాపత్రికల్లో, టీవీ ఛానెళ్లలో ప్రకటనల స్లాట్స్‌ను బుక్ చేసుకోవాలని, పోస్టర్లు ముద్రించాల్సి ఉందని చెప్పుకొచ్చారు. తాము ఈ పనులు చేసుకోలేకుంటే ఇక ప్రజాస్వామ్య మనుగడ ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని అన్నారు. ఏడేండ్ల నాటి కేసులో పార్టీకి నోటీసులు జారీ చేశారని అన్నారు. బీజేపీతో సహా ఏ రాజకీయ పార్టీ ఆదాయపు పన్ను చెల్లించనప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు ఫ్రీజ్ చేశారని ఆయన ప్రశ్నించారు. 2017-18 నాటి కేసుకు సంబంధించి ఆదాయ పన్ను శాఖ ఇప్పుడు తమ పార్టీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిందని అన్నారు. సీతారాం కేసరి హయాంలో 1994-95 అసెస్‌మెంట్ నోటీస్ ఇప్పుడు తమకు జారీ చేశారని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం భవిష్యత్‌లోనూ తమను వేధిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



భువనగిరిలో సీపీఐ(ఎం)ను గెలిపించండి

- నిబద్ధతతో పనిచేసే వ్యక్తి ఎండీ.జహంగీర్
- కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-భువనగిరి

రాజకీయాల్లో విలువలు దిగజారుతున్న కాలంలో వాటిని కాపాడటానికి భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఎండీ. జహంగీర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో చెరుపల్లి మాట్లాడారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీల నిర్ణయం మేరకు భువనగిరిలో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని చెప్పారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని భువనగిరి, జనగామ, ఇబ్రహీంపట్నం, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాలు కమ్యూనిస్టు ఉద్యమాలకు కేంద్రాలని తెలిపారు. గతంలో నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నంలో కమ్యూనిస్టులు గెలిచారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు ఎర్రజెండా ఉద్యమ పోరాట పటిమ, వాటి ఫలితాలు తెలుసని అన్నారు. నిబద్ధత, నిజాయితీగా పనిచేసే ఎండీ జహంగీర్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎండీ జహంగీర్ నిరుపేద కుటుంబం నుంచి వచ్చి 32 ఏండ్లుగా పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తున్నారని తెలిపారు. బూర్జువా పార్టీలలో ఉంటూ.. ఎటు అధికారం వస్తే అటువైపు వెళుతున్న నాయకులకు ఈ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. నమ్మిన సిద్ధాంతం.. ఆశయం కోసం పనిచేస్తున్న జహంగీర్‌ను ఆదరించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కులం, మతం, మత విద్వేషాలు రగిల్చడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పట్టడం లేదని విమర్శించారు.

ఎండీ.జహంగీర్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు రాజకీయ క్యాంపెయిన్ చేస్తామన్నారు. ప్రజా సమస్యను వెలికి తీసి వాటిపై యుద్ధం చేస్తామని, సబ్బండ వర్గాలను కదిలిస్తామని చెప్పారు. నేడు అన్ని ఎన్నికలూ డబ్బులతో కూడుకున్నవని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులకు డబ్బులు ఖర్చు పెట్టే శక్తితోపాటు.. ఆ అవసరం కూడా లేదని తెలిపారు. ప్రజలకు డబ్బులు అలవాటు చేసేది కార్పొరేట్ రాజకీయాలేనన్నారు. ఆ డబ్బులను ప్రజలు తిరస్కరించే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తన దగ్గర డబ్బులు లేవని.. ప్రజల అండదండలే తమకు బలమని అన్నారు. బస్వాపురం ప్రాజెక్టు భూనిర్వాసితులు, మూసీ సమస్య, పిలాయిపల్లి, ధర్మారెడ్డి, బునియాది కాలువ, భీమలింగం ఆసిఫ్‌నగర్ కాలువలు పూర్తి చేయాలని సీపీఐ(ఎం) కొట్లాడిందన్నారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని ఇబ్రహీంపట్నంపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలను పార్లమెంట్లో గత అభ్యర్థులు ప్రస్తావించలేక పోయారన్నారు. కమ్యూనిస్టులు మాత్రమే ప్రస్తావించి పరిష్కారానికి పాటుపడుతారని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతున్న కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దోనూరి నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, మంగ నరసింహులు పాల్గొన్నారు.

కోడ్ జానా్తా నై

- పూణే రైల్వే స్టేషన్‌లో ప్రధాని మోడీ పోస్టర్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ పథకాల ద్వారా ప్రచారాలను నిషేధించే ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలులోకి వచ్చిన 48 గంటల తర్వాత కూడా పూణే రైల్వే స్టేషన్‌లో ప్రధాని మోడీ చిత్రపటాన్ని తొలగించలేదు. ఈ నెల 16న భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ఎన్నికల తేదీలను ప్రకటించటంతో ఎంసీసీ అమలులోకి వచ్చిన విషయం విదితమే. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసిన ఫ్లెక్స్ బ్యానర్లు, పోస్టర్‌లను తొలగించాలని ఎంసీసీ నిర్దేశించిన 48 గంటల్లోగా వాటిని తొలగించకపోవటం గమనార్హం. పూణే స్టేషన్‌లోని పోస్టర్‌లలో గత సంవత్సరం జరిగిన జీ20 ఈవెంట్‌లో ఒకటి, మరొకటి మోడీ చిత్రంతో పాటు "సబ్కా సాథ్ సబ్‌కా వికాస్" అనే నినాదంతో ఉన్నాయి. దీంతో కోడ్ అమల్లోకి వచ్చినా మోడీ చిత్రాలను తొలగించకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

57 మందితో కాంగ్రెస్ మూడో జాబితా

రాష్ట్రంలో ఐదు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి కాంగ్రెస్ 57 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. గురువారం విడుదల చేసిన ఈ జాబితాలో తెలంగాణ నుంచి ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు. పెద్ద పల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, మల్కాజిగిరి సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్ దానం నాగేందర్, చేవెళ్ల గడ్డం రంజిత్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి మల్లు రవిలను ఖరారు చేసింది. కాగా, ఇప్పటికే నలుగురు ఎంపీ అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ ప్రకటించిన విషయం విదితమే. అయితే తాజాగా విడుదల చేసిన జాబితాలో ఐదుగురిలో ముగ్గురు ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారే కావడం గమనార్హం. కర్నాటక (17), గుజరాత్ (11), మహారాష్ట్ర (7), రాజస్థాన్ (6), పశ్చిమ బెంగాల్ (8), తెలం గాణ (5), అరుణాచల్ ప్రదేశ్ (2), పుదుచ్చేరి (1) చొప్పున రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 57 మంది అభ్యర్థు లతో కూడిన రెండో జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది.

అయితే రాజ స్థాన్‌లో ప్రకటించిన ఆరు స్థానాలకుగాను ఐదు చోట్ల కాంగ్రెస్, ఒక నియోజకవర్గంలో సీపీఐ(ఎం) పోటీ చేస్తుంది.

39 మందితో సీపీఐ(ఎం) తొలి జాబితా

- కేరళలో 15, బెంగాల్‌లో 13 స్థానాలకు అభ్యర్థులు ఖరారు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గురువారం విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా తొలి దశలో పోటీ చేసే స్థానాలను, అభ్యర్థుల వివరాలను వెల్లడించింది. తొలి జాబితాలో 39 మంది అభ్యర్థులను ప్రకటించారు. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళలో 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, పశ్చిమ బెంగాల్‌లో 13 స్థానాలకు, తమిళనాడు 2 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అలాగే ఢిల్లీలో అన్నదాతల పోరాటాలకు కేంద్ర బిందువులుగా నిలిచిన పంజాబ్‌లో జలంధర్ (ఎస్‌సీ) నుంచి, రాజస్థాన్‌లోని సికార్ నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థులను బరిలో నిలిపింది. జలంధర్ నుంచి పురుషోత్తం లాల్ బిల్గా పోటీ చేస్తుండగా, సికార్ నుంచి అమ్రారామ్ పోటీ చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తొలి జాబితాలో తెలంగాణలోని భువనగిరి స్థానం నుంచి మహ్మద్ జహంగీర్‌ను ప్రకటించారు. కోవిడ్ విపత్తులో వైద్య శాఖ మంత్రిగా విశేష సేవలందించి అంతర్జాతీయ సమాజ మన్ననలు పొందిన కెకె శైలజ టీచర్, ఆర్థిక వేత్త టిఎం థామస్ ఐజాక్, వ్యవసాయోద్యమ నాయకులు ఎ విజయరాఘవన్, ప్రముఖ పార్లమెంటేరియన్ ఎలమారం కరీం సహ జాతీయ స్థాయి కార్మిక, కర్షకోద్యమ నాయకులను సిపిఎం బరిలో నిలిపింది. తొలి జాబితాలో యువతకు కూడా ప్రాతినిధ్యం కల్పించారు. పశ్చిమ బెంగాల్‌లోని శ్రీరామ్‌పూర్ నుంచి విద్యార్థి ఉద్యమ నేత దిప్సితా ధర్‌ను బరిలో నిలిపారు.

సీపీఐ(ఎం) తొలి జాబితా

కేరళ	1.కాసరగోడ్	- ఎంవి బాలకృష్ణన్ మాస్టర్
	2 కన్నూరు	- ఎంవి జయరాజన్
	3. వడకర	- కెకె శైలజా టీచర్ (మహిళ)
	4. కొజికోడ్	- ఎలమారం కరీం
	5. పొన్నాని	- కెఎస్ హంస
	6. మలప్పురం	- వి వసీఫ్
	7. అల్తూర్ (ఎస్‌సి)	- కె రాధాకృష్ణన్
	8.పాలక్కడ్	- ఎ విజయరాఘవన్
	9. ఛలక్కుడి	- సి రవీంద్రనాథ్
	10. ఎర్నాకుళం	- కెజె షైనియాన్ టీచర్
	11. ఇడుక్కి	- జోయస్ జార్జ్
	12. అలప్పుజ	- ఎఎం ఆరిఫ్
	13. పతనాంతిట్ట	- టిఎం థామస్ ఐజాక్
	14. కొల్లాం	- ఎం ముకేష్
	15. అట్టింగల్	- వి జోయ్
ప.బెంగాల్	16.జల్పాయ్‌గురి	- దేవరాజ్ బర్మన్
	17. కృష్ణానగర్	- ఎస్‌ఎం సాది
	18. డమ్‌డమ్	- సుజన్ భట్టాచార్య
	19. జాదవ్‌పూర్	- సృజన్ భట్టాచార్య
	20. కొల్‌కతా దక్షిణ	- సైరా షా హలీమ్ (మహిళ)
	21. హౌరా	- సవ్యసాచి ఛటర్జీ
	22. శ్రీరామపూర్	- దిప్సితా ధర్ (మహిళ)
	23. హుగ్లీ	- మనోదీప్ సింగ్
	24. తుమ్లుక్	- సాయన్ బెనర్జీ
	25. బంకూర	- నీలాంజన్ దాస్‌గుప్తా
	26. విష్ణుపూర్	- సీతల్ కైబర్తా
	27. బర్ధ్వాన్ ఈడ్ పూర్వ	- నీరవ్ ఖాన్
	28. అసన్‌సోల్	- జహనర ఖాన్ (మహిళ)
త్రిపుర	29 త్రిపుర తూర్పు	- రాజేంద్ర రేయాంగ్
రాజస్థాన్	30.సికార్	- అమ్రా రామ్
తెలంగాణ	31.భువనగిరి	- మహ్మద్ జహంగీర్
పంజాబ్	32.జలంధర్	- పురుసోత్తం లాల్ బిల్గా
తమిళనాడు	33.మదురై	- సు వెంకటేశన్
	34. దిండిగల్	- ఆర్ సచిదానందం
అండమాన్ నికోబార్ దీవులు	35.అండమాన్ నికోబార్ దీవులు	- డి అయ్యప్పన్
అసోం	36. బార్పేట	- మనోరంజన్ తాలుక్దార్
బీహార్	37. ఖగారియా	- సంజయ్ కుమార్
జార్ఖండ్	38.రాజ్‌మహల్ (ఎస్‌టి)	- గోపెన్ సోరెన్
కర్నాటక	39.చిక్‌బల్లాపూర్	- ఎంపి మునివెంకటప్ప

ప్రచారానికి ప్రజాధనం

ఆరు నెలల్లో రూ.38 కోట్లు

- ఫిబ్రవరిలో అత్యధికంగా రూ.14 కోట్లకు పైగానే
- మోడీని ప్రమోట్ చేసే గూగుల్ యాడ్స్‌పై ప్రభుత్వం చేసిన ఖర్చు
- కేంద్ర సర్కారుపై సర్వత్రా విమర్శలు



న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఎన్నికల ప్రచారాల కోసం ప్రజాధనాన్ని వృథా చేస్తున్నది. మోడీని ప్రమోట్ చేసే గూగుల్ యాడ్స్‌పై ఆరు నెలల్లో రూ.38 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ నెల మార్చి 16 వరకు ఈ మొత్తాన్ని వెచ్చించింది. ఇందులో అత్యధికంగా ఒక్క ఫిబ్రరి నెలలోనే 260 ప్రకటనలపై రూ.14.06 కోట్లకు పైగా ఖర్చు చేయటం గమనార్హం. దీంతో కేంద్రం తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మోడీకి 'కుటుంబం లేదు' అని ఈనెల 4న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ వ్యాఖ్యలు చేసిన తర్వాత బీజేపీ నేతలు సోషల్ మీడియాలో 'మోడీ కా పరివార్' అని తమ పేర్లకు చేర్చుకున్నారు. 2019లో 'చౌకీదార్' సందర్భాన్ని ఇది గుర్తు చేసింది. ఒక వారం తర్వాత, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ (సీబీసీ) (ఇది సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ విభాగం) "మోడీ కా పరివార్" గూగుల్ ప్రకటనల కోసం కనీసం రూ. 65 లక్షలు వెచ్చించింది. గూగుల్ యాడ్స్ ట్రాన్స్‌పరేన్సీ సెంటర్ డేటా దీనిని వెల్లడించింది.

ఈ మొత్తం యూట్యూబ్ వంటి అనేక గూగుల్ ప్లాట్‌ఫారమ్‌లలో మార్చి 9 నుంచి 14 మధ్య కనీసం 2.75 కోట్ల సార్లు ప్రదర్శించబడిన రెండు వీడియో ప్రకటనల వైపునకు వెళ్లింది. ఒకటి 30 సెకన్ల నిడివి గల వీడియో. ఇందులో ఆర్మీ అధికారులు మోడీ "కుటుంబం" అని వివరిస్తారు. ఇంకో వీడియోలో, ఒక నిమిషం నిడివితో, మహిళలు మోడీ కుటుంబమని చెప్తారు.

మార్చి 1 నుంచి మార్చి 16 మధ్య, మోడీ, ఆయన విజయాలను ప్రచారం చేసే మూడు ఇతర ప్రచారాలైన "మోడీ కి గ్యారెంటీ", "మా మజ్‌బూత్‌తో భారత్ మాతా మజ్‌బూత్", "హమారా సంకల్ప్ వికసిత్ భారత్"లపై సీబీసీ 379 గూగుల్ ప్రకటనల కోసం రూ. 10 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అంటే, సగటున రోజుకు రూ. 63 లక్షల వరకు అన్నమాట. మార్చి 17 నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమల్లోకి వచ్చిన విషయం విదితమే. ఇందులో, వీడియో యాడ్‌ల కోసం రూ.8.84 కోట్లు ఖర్చు చేయగా, ఇమేజ్ ఫార్మాట్‌లో యాడ్స్ కోసం రూ.1.12 కోట్లు వెచ్చించారు.

చంద్రయాన్-3 "మహాక్విజ్" కోసం ప్రకటనను ప్రమోట్ చేయటానికి ఖర్చు చేసినప్పుడు.. అంటే గతేడాది సెప్టెంబర్ నుంచి సీబీసీకి గూగుల్ ప్రకటనలపై డేటా అందుబాటులో ఉన్నది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గూగుల్ యాడ్స్ కోసం ఆ శాఖ రూ.38 కోట్లకు పైగా ఖర్చు చేయటం గమనార్హం.ఇది ఈ ఏడాది ఫిబ్రవరిలో అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేసింది. మోడీ కి గ్యారెంటీపై రూ. 11.68 లక్షలు, మా మజ్‌బూత్ భారత్ మాతా మజ్‌బూత్‌పై రూ. 77.8 లక్షలు, హమారా సంకల్ప్ వికసిత్ భారత్‌పై రూ. 61 లక్షలు ఉన్నాయి.

యూపీలో ప్రకటలనపై అత్యధికంగా రూ.6 కోట్లు

అదే సమయంలో, నవంబర్, డిసెంబర్, జనవరిలో అన్ని గూగుల్ ప్రకటనల మొత్తం రూ. 12.8 కోట్లు 'మోడీ కి గ్యారెంటీ' ప్రకటన వైపు వెళ్లాయి. ఇక రాష్ట్రాల వారీగా చూస్తే యూపీ (రూ. 6 కోట్లు), ఆ తర్వాత మహారాష్ట్ర (రూ. 3.8 కోట్లు), గుజరాత్ (రూ. 3.2 కోట్లు), ఢిల్లీ (రూ. 2.8 కోట్లు), బీహార్ (రూ. 2.3 కోట్లు)లో ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని ప్రకటనల కోసం మోడీ సర్కారు అత్యధిక డబ్బు ఖర్చు చేసింది.

కవితను కలిసిన తల్లి, సోదరుడు

- ఐదో రోజు ఈడీ కస్టడీ
- నేడు సుప్రీంకోర్టులో పిటిషన్ విచారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీబీఐ స్పెషల్ కోర్టు ఆదేశాలతో ఐదో రోజు ఈడీ కస్టడీలో ఉన్న కవితను తొలిసారి ఆమె తల్లి శోభ గురువారం కలిశారు. ఆమె వెంట కేటీఆర్, ఆడపడుచు సౌమ్య(సంతోష్ సోదరి), లాయర్ మోహిత్ రావు వెళ్లారు. తొలిత 40 నిమిషాల పాటు కుటుంబ సభ్యులు కవితతో మాట్లాడారు. మిగిలిన 15 నిమిషాలు.. కేటీఆర్, అడ్వకేట్ మోహిత్ చర్చించారు. తొలుత తల్లి, కూతురు ఒకరినొకరు చూసుకోగానే... ఇద్దరు ఒకింత భావోద్వేగానికి లోనైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా కవిత, కేటీఆర్ తల్లి శోభకు ధైర్యం చెప్పారు. తానేమి తప్పు చేయలేదని, రాజకీయ కక్ష సాధింపులో తనపై అభియోగాలు మోపారని కవిత అన్నట్లు సమాచారం. త్వరలోనే బయటకు వస్తానని, అంతవరకు అమ్మ, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సౌమ్యకు కవిత చెప్పారు. అనంతరం రోజు వారి విచారణపై కేటీఆర్, న్యాయవాది మోహిత్ ఆరా తీశారు. నేడు (శుక్రవారం) సుప్రీంకోర్టు ముందుకు కవిత పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో... కవిత తరపు అంశాలను వాదించేందుకు న్యాయవాది మోహిత్ పలు వివరాలను నోట్ చేసుకున్నట్లు తెలిసింది.

నేడు సుప్రీం ముందుకు కవిత కేసు

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్, కస్టడీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన తాజా పిటిషన్ నేడు (శుక్రవారం) సుప్రీంకోర్టుకు ముందు రానుంది. తన అరెస్ట్ అక్రమమని, రిమాండ్ ఉత్తర్వులు రద్దు చేయాలని మొత్తం 537 పేజీలతో కూడిన క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేతిలో ఈడీ కీలు బొమ్మగా (పప్పెట్) మారిందని ఆరోపించారు. పొలిటికల్ ఎజెండాతో ఈడీ అధికారులు పని చేస్తున్నారని పిటిషన్‌లో ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో గత పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే సోదాల పేరుతో హైదరాబాద్‌లోని తన నివాసం లోకి వచ్చిన ఈడీ అధికారులు అక్రమంగా తనను అదుపులోకి తీసుకున్నారని ప్రస్తావించారు. ఈడీ కస్టడీ విధింపు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 21, 22(1), (2) ప్రకారం విరుద్ధమని పేర్కొన్నారు. తాజా పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు పలు షరతులు విధిస్తూ తక్షణమే కవితను విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించనుంది. ఈమేరకు సుప్రీం కోర్టు కవిత పిటిషన్‌ను విచారణ జాబితాలో చేర్చింది.

బాండ్లతో నిమిత్తం లేకుండా... | వీటిలోనూ బీజేపీయే టాప్

2013-23 మధ్య పార్టీలకు రూ.7,726 కోట్ల విరాళాలు



న్యూఢిల్లీ : 2013-2023 మధ్యకాలంలో ఎన్నికల బాండ్లతో నిమిత్తం లేకుండా దేశంలోని వివిధ రాజకీయ పార్టీలకు రూ.7,726 కోట్ల మేర విరాళాలు సమకూరాయి. ఎన్నికల కమిషన్ వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఈ విరాళాల్లో ఒక్క బీజేపీకే రూ.5,000 కోట్లు (63.7 శాతం) అందాయి. కాంగ్రెస్‌కు 10.7 శాతం, బీఆర్ఎస్‌కు 3.3 శాతం, ఆమ్‌ఆద్మీ పార్టీకి 3.1 శాతం విరాళాలు వచ్చాయి. 018లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందు రాజకీయ పార్టీలు తమకు రూ.20,000 కంటే ఎక్కువ మొత్తంలో అందిన విరాళాలను చట్ట ప్రకారం ప్రకటించాల్సి వచ్చేది. ఈ రకంగా అందిన విరాళాలకు పూర్తి పన్ను మినహాయింపు ఉంటుంది. పార్టీలకు అందిన విరాళాలు ప్రతి ఏటా పెరుగుతూ వచ్చాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.309 కోట్ల విరాళాలు రాగా అవి 2019-20 నాటికి రూ.1,247 కోట్లకు పెరిగాయి. అయితే 2022-23లో మాత్రం రూ.1,101 కోట్ల విరాళాలే వచ్చాయి.

కార్పొరేట్ సంస్థల వాటాయే అధికం

వ్యక్తుల కంటే కార్పొరేట్ సంస్థలే పార్టీలకు ఎక్కువ మొత్తంలో విరాళాలు అందజేశాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ (పీఈటీ) వంటి సంస్థలు భారీగా విరాళాలు ఇచ్చాయి. 2022-23లో ఈ సంస్థ బీజేపీకి రూ.256 కోట్లు, బీఆర్ఎస్‌కు రూ.90 కోట్ల మేర విరాళాలు సమకూర్చింది. మెస్సర్స్ ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కాంగ్రెస్ పార్టీకి రూ.45 కోట్లు ఇవ్వగా బీజీ షిర్కే కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బీజేపీకి రూ.35 కోట్లు అందించింది.

లోపించిన పారదర్శకత

రాజకీయ పార్టీలకు అందిన విరాళాలు మొదట్లో పారదర్శకంగానే ఉండేవని, రానురానూ అది లోపించిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ అధిపతి అనిల్ వర్మ చెప్పారు. 'దేశ రాజకీయాల్లో పోటీ బాగా పెరిగింది. ఫలితంగా పార్టీలకు ఎన్నికల వ్యయం కూడా పెరిగింది. పెరుగుతున్న ఈ వ్యయాన్ని భరించేందుకు పార్టీలు తరచుగా కార్పొరేట్ రంగంపై ఆధార పడాల్సి వచ్చేది. దీంతో విరాళాల్లో పారదర్శకత లోపించింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అది తన ప్రయోజనాల కోసం విరాళాలను ప్రోత్సహిస్తోంది' అని ఆయన తెలిపారు. ఆరు జాతీయ పార్టీలు అందుకున్న విరాళాల్లో 75 శాతం అజ్ఞాత వ్యక్తులు, సంస్థల నుండి వచ్చినవేనని ప్రముఖ రచయితలు ఈశ్వరన్ శ్రీధరన్, మిలన్ వైష్ణవ్ ఓ పుస్తకంలో వివరించారు. ఇవన్నీ రూ.20,000 పరిమితి కంటే తక్కువ మొత్తంలో సమకూరినవేనని, వాటికి లెక్కా పత్రం ఉండదని తెలిపారు.

పొన్నంకు మంత్రిగా కొనసాగే అర్హత లేదు : ప్రకాశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కరువుకు తాము కారణం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నాడనీ, అసమర్థులే అలాంటి సాకులు చెబుతారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. అసమర్థుడైన పొన్నం ప్రభాకర్‌కు మంత్రిగా కొనసాగే హక్కు లేదన్నారు. తమ పార్టీలో రాష్ట్రానికి అధ్యక్షులుగా ఉండి జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన ఘనత వెంకయ్య నాయుడు తర్వాత బండి సంజయ్‌దేనని తెలిపారు. అధికార ప్రతినిధి రాణి రుద్రమ మాట్లాడుతూ.. బండిని అధ్యక్ష పదవి నుంచి తొలగించలేదనీ, ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రమోట్ అయ్యారని చెప్పారు. పొన్నం ప్రభాకర్ మంత్రి అయ్యాక రవాణా శాఖలో చాలా బదిలీలు జరిగాయనీ, ఆయన అవినీతికి పాల్పడకుండా బదిలీల ప్రక్రియ చేయించారా? అనేది సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని సవాల్ విసిరారు. గంగుల, కేటీఆర్‌తో సన్నిహిత్యం పొన్నంకే ఉందన్నారు. మహిళలకు రూ.2500, రైతుబంధు, రుణమాఫీ ఏమయ్యాయని ప్రశ్నించారు. మరో నేత కుమార్ మాట్లాడుతూ..నేరెళ్ల ఘటనలో దళితుల పక్షాన పోరాడింది బండి సంజయ్‌నే అనీ, కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రప్పించారని గుర్తుచేశారు.

నవతెలంగాణ

తాను నమ్మిన సత్యాన్ని ఆచరించలేకపోవడమే
జీవిత వైఫల్యం - గౌతమ బుద్ధుడు

శుక్రవారం 22 మార్చి 2024
www.navatelangana.com

సంపాదకీయం

పుతిన్ ఎన్నిక పూర్వరంగం!

మార్చి నెల 15 నుంచి 17వరకు జరిగిన రష్యా ఎనిమిదవ అధ్యక్ష ఎన్నికలలో వ్లాదిమిర్ పుతిన్ ఏకపక్షంగా విజయం సాధించారు. ప్రధాని లేదా అధ్యక్ష పదవిలో వరుసగా ఐదవసారి అధికార పీఠమెక్కి రికార్డు సృష్టించారు. పుతిన్ విజయం ఎన్నికలకు ముందే ఖరారైందని అంతర్జాతీయ మీడియా రాసింది. ప్రస్తుతం యావత్ రష్యన్లను జాతీయ భావాలు ప్రభావితం చేస్తున్నాయి.

వ్లాదిమిర్ పుతిన్ పురోగామి వాద, ప్రజాస్వామ్య పరిరక్షకుడో అని కితాబు ఇవ్వాల్సిన అవసరం లేదు. పూర్వపు సోవియట్ యూనియన్ వ్యవస్థలో ప్రజల సంపదగా ఉన్నదానిని గత మూడు దశాబ్దాల కాలంలో కొందరు ఆశ్రితులు, ప్రయివేటుపరం చేసిన వ్యవస్థ ప్రతినిధి పుతిన్. అయితే చమురు, సహజవాయువు వంటి అపార సంపదలు ఇంకా ప్రభుత్వరంగం లోనే ఉన్నప్పటికీ పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థవైపే అడుగులు పడుతున్నాయి. రష్యాకు ఉన్న సహజ సంపదలు, మిలిటరీ, ఆయుధాల కారణంగా అది తమకు ఎక్కడ పోటీకి వస్తుందో అన్న భయంతో అమెరికా, ఐరోపాలోని ధనిక దేశాలు అడ్డుకొనేందుకు చూడటమే రష్యాతో వాటికి ఉన్న ప్రధాన వైరుధ్యం.

పుతిన్ అనుసరిస్తున్న ఆర్థిక, ఇతర విధానాల పట్ల దేశంలో జనమందరూ ఏకీభావంతో ఉన్నారని చెప్పలేము గాని నాటో కూటమి తమను దెబ్బతీసేం దుకు ఉచ్చు బిగిస్తున్నదనే అంశంలో మాత్రం తరతమ తేడాలతో ఒకే వైఖరితో ఉన్నారనేందుకు తాజా ఎన్నికలే నిదర్శనం. పశ్చిమ దేశాల ప్రసార బాకాలు ఉక్రెయిన్ మీద జరుపుతున్న సైనిక చర్యను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎంతగా ప్రచారం చేసినా అధ్యక్ష ఎన్నికల్లో 77.49శాతం మంది ఓటింగ్‌లో పాల్గొనటం ఒక రికార్డు. గత ఎన్నికల కంటే 9.95శాతం పెరిగింది. నిజంగా జనాలలో వ్యతిరేకత, ఆసక్తి లేకపోతే పోలింగ్ బూత్‌లకే రారు.


ఉక్రెయిన్‌పై సైనిక చర్యతో పశ్చిమ దేశాలు రష్యాను మరింతగా వంటరిపాటు చేసేందుకు చూడటం, ఆంక్షలు విధించటం తెలిసిందే.తాజా ఎన్నికల పూర్వరంగమిదే. రష్యాను ఒక బూచిగా చూపటమే కాదు, పద్దెనిమిదివేల ఆంక్షలు విధించారు. ఉక్రెయిన్‌కు దగ్గరగా ఉన్న ఎనిమిది ప్రాంతాలపై నాటో,అమెరికన్ మద్దతుతో దాడులు చేశారు. ఉక్రెయిన్‌లోని రష్యన్ జాతి వారిని అణచివేసేందుకు పూనుకున్నారు.రష్యాను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ కేంద్రంగా నాటో కూటమి దేశాలు జీవాయుధాలను తయారు




చేస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం ఉన్న తరువాత రష్యా గడ్డ మీద ఉన్న వారెవరైనా ఆ ముప్పును ఎదుర్కోవాల్సిందే. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కొన్ని జాతులను సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టి యుద్ధంలో ఎలా ఉపయోగించుకున్నారో అదే జాతులను ఇప్పుడు రష్యాకు వ్యతిరేకంగా సమీకరించటాన్ని చూసిన సామాన్య రష్యన్ పౌరులు మరోసారి తమకు ఫాసిస్టు ప్రమాదం ముంచుకువస్తున్నదని భావిస్తున్నారు. ఇదే అభిప్రాయం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న రష్యన్ కమ్యూనిస్టులలో కూడా ఉన్న కారణంగానే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను సమర్థించారు. దీని అర్థం పుతిన్ విధానాలన్నింటినీ సమర్థి స్తున్నట్లు కాదు. అందుకే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను వ్యతిరేకించిన శక్తులను దేశ వ్యతిరేకులుగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ ఎన్నికలలో మొత్తం నలుగురు పోటీ చేస్తే పుతిన్‌కు 87.28శాతం రాగా రెండవ స్థానంలో ఉన్న కమ్యూనిస్టునేతకు 4.31శాతం ఓట్లు వచ్చాయి.

ధనిక దేశాల కూటమిలో చేరేందుకు ఉవ్విళ్లూరిన పుతిన్ గతం దాస్తే దాగేది కాదు. అయితే వాటి మధ్య తలెత్తిన వైరుధ్యాలు ఈ రూపం సంతరించుకుంటాయని మూడు దశాబ్దాల క్రితం ఎవరూ ఊహించలేదు. నయాఫాసిస్టు శక్తులు, వాటిని వ్యతిరేకించే శక్తుల మధ్య వైరంగా చూసినపుడు అంతర్జాతీయ రాజకీయాల్లో పుతిన్‌ను పురోగామి శక్తులు సమర్థిస్తున్నాయి. జాతీయ భావాలు అంటే రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీలో హిట్లర్ గాంగ్ రెచ్చగొట్టిన జర్మన్ ఆధిపత్య వాదానికి, తమ దేశాన్ని కాపాడుకోవాలన్న రష్యన్ల భావనకు తేడా ఉంది. వ్లాదిమిర్ పుతిన్ పురోగామి వాద, ప్రజాస్వామ్య పరిర క్షకుడో అని కితాబు ఇవ్వాల్సిన అవసరంలేదు. పూర్వపు సోవియట్ యూనియన్ వ్యవస్థలో ప్రజల సంపదగా ఉన్నదానిని గత మూడు దశాబ్దాల కాలంలో కొందరు ఆశ్రితులు, ప్రయివేటుపరం చేసిన వ్యవస్థ ప్రతినిధి పుతిన్. అయితే చమురు, సహజవాయువు వంటి అపార సంపదలు ఇంకా ప్రభుత్వ రంగంలోనే ఉన్నప్పటికీ పూర్తిగా పెట్టుబడి దారీ వ్యవస్థ వైపే అడుగు లు పడుతున్నాయి. రష్యాకు ఉన్న సహజ సంపదలు, మిలిటరీ, ఆయుధాల కారణంగా అది తమకు ఎక్కడ పోటీకి వస్తుందో అన్న భయంతో అమెరికా, ఐరోపాలోని ధనిక దేశాలు అడ్డుకొనేందుకు చూడటమే రష్యాతో వాటికి ఉన్న ప్రధాన వైరుధ్యం. ధనిక దేశాల కూటమి జి-7లోకి రాకుండా ముందు చూశారు, తరువాత చేర్చుకొని, తిరిగి పక్కన పెట్టారు. నాటోను విస్తరించి రష్యా ముంగిట ఉన్న ఉక్రెయిన్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చి అదుపు చేయాలన్న ఎత్తుగడను పుతిన్ జయప్రదంగా వమ్ము చేశాడు. గతంలో రష్యా ప్రాంతంగా ఉండి సోవియట్ హయాంలో ఉక్రెయిన్ రిపబ్లిక్‌లో ఉన్న క్రిమియా ప్రాంతాన్ని 2014లో తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి రష్యాలో జాతీయ భావాలు మరింతగా పెరిగాయని చెప్పవచ్చు. ప్రస్తుతం పుతిన్ బలం అదే !

డిగ్రీలు లేని ప్రిన్సిపాలూ, మరో పరిశోధకుడు


రాంభట్ల కృష్ణమూర్తి





కనీస విద్యార్హత లేకుండానే అధ్యాపకుడూ, ప్రిన్సిపాలూ కావొచ్చా? మాస్టర్స్ డిగ్రీ లేకుండానే రీసర్చ్ ప్రారంభించొచ్చా?- అంటే వీలుకాదు. కానీ, కొందరు ఆ పరిధులు దాటుకుని, దీక్షతో నిరంతర కృషితో వాటిని సాధించగలుగుతారు. ఉదాహరణ ఒకరిద్దరి జీవిత విశేషాలు తెలుసుకుందాం! అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోగల వారు కొందరు ఉంటారని తెలుసుకోగలుగుతాం! స్వశక్తితో మేధావులయిన వారు సామాన్యంగా మనకు ఎక్కడా కనబడరు. ఉన్నా చాలా చాలా అరుదు. అలాంటి అరుదైన జీవితం - వ్యక్తిత్వం గలవాడు మన తెలుగు వారిలోనే ఒకరున్నారు. నాలుగో తరగతితో చదువు ఆపేసి, స్వయం కృషితో ఉన్నత విద్యావంతుడయ్యారు. ఒక జర్నలిజం స్కూలుకు చాలాకాలం ప్రిన్సిపాల్‌గా కొనసాగారు ఆయనే రాంభట్ల కృష్ణమూర్తి (24 మార్చి 1920-7 డిసెంబరు 2001) 24 మార్చి 2020కి ఆయన శత జయంతి పూర్తయింది.

నిరుపేద కుటుంబంలో పుట్టిన మణిమేల శివశంకర్‌కు చదువుకునే అవకాశం రాలేదు. జీవనోపాధి కోసం తప్పని సరైన పరిస్థితుల్లో ముఠా కార్మికుడిగా మారాల్సి వచ్చింది. అతని స్వగ్రామం పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామం. ఉన్న ఊళ్ళో బతుకుదెరువు లేక జిల్లా కేంద్రం గుంటూరుకు వెళ్ళి అక్కడ స్థిరపడాల్సి వచ్చింది. బాల్యంలో శివశంకర్‌ను పెద్దవాళ్లు ఆలయాలకు తీసుకు వెళ్లినపుడు, ఆ బాలుడి దృష్టి దైవ విగ్రహం మీద ఉండేది కాదు. చుట్టు పక్కల వాతావరణం మీద, శిల్పాల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టేవాడు. అలాడే అక్కడి స్థానికులను అడిగి స్థల విశేషాలు ఆసక్తిగా తెలుసుకుంటూ ఉండేవాడు. దగ్గరలో ఏవైనా శాసనాలు కనబడితే వాటిని మెల్లెమెల్లగా చదవడానికి ప్రయత్నించేవాడు. క్రమంగా అది అతని ప్రవృత్తిగా మారింది. వయసు పెరిగినా కొద్దీ బాధ్యత మీద పడుతుంది గనక ప్రవృత్తి తిండి పెట్టదు గనక, చదువు పెద్దగా లేదు గనక - మరో మార్గం లేక ముఠా కార్మికుడిగా జీవనోపాధి చూసుకున్నాడు.


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక ప్రముఖ జర్నలిస్టులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గురువు- లేదా గురుతుల్యులు! ప్రగతిశీల సాహిత్యోద్యమ పునాది నిర్మాణానికి ఆయన ఒక్కొక్క రాయి పేర్చిన అభ్యుదయ కాముకుడు.

తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం తాలూకా అనాతవరం గ్రామంలో జన్మించిన రాంభట్ల స్వయంగా ఇంగ్లీషు, ఉరుదూ, తెలుగు, సంస్కృత భాషలు నేర్చుకున్నారు. ఆయా భాషల్లోని అనేకానేక గ్రంథాలు అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఒక వైపు సంప్రదాయ గ్రంథాల మీద, మరోవైపు ఆధునిక సాహిత్య ధోరణుల మీద సమానంగా పట్టు సాధించారు. చిన్నచిన్న పనులు చేస్తూ, స్వంత వ్యాపారాలు ప్రారంభించి ధనవంతులైన వారిని మనం చాలా మందిని చూడగలం.కానీ, స్వయంకృషితో ఇంత పెద్ద ఎత్తున విద్యాధనమార్జిన పండితుల్ని చూడలేం. వేదాల్ని, ఉపనిషత్తుల్ని, దర్శనాల్ని క్షుణ్ణంగా చదివి, వాటి ప్రభావంలో పడి, ఒక ఛాందసవాదిగా మారిపోకుండా నిలదొక్కుకుని, అభ్యుదయ వాదిగా నిలబడగలగడం చాలా గొప్ప విషయం. 1943లో హైదరాబాదులోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయానికి కార్యదర్శి అయి, అదే సమయంలో ఒక ఐదేళ్ళ పాటు 'మీజాన్' పత్రికలో పనిచేశారు రాభట్ల! 1946లో తొలితరం జర్నలిస్టుల జీతాల పెంపుకోసం సంఘర్షించారు. 1948లో మద్రాసులోను, విజయవాడలోనూ పలు పత్రికల్లో పనిచేశారు. 1952లో విశాలాంధ్ర పత్రికకు సబ్ఎడిటర్ అయ్యారు. ఆ రోజుల్లోనే కార్టూన్లు వేయడం, కార్టూన్ కవితలు రాయడం ప్రారంభించారు. తెలుగు జర్నలిజంలో అవే తొలిప్రయత్నాలు.

కవి రాక్షస, అగ్నిమిత్ర, కృష్ణ - పేర్లతో ఆరోజుల్లో కనిపించిన రచనలన్నీ రాంభట్ల కృష్ణమూర్తివే!! అవన్నీ ఆయన కలం పేర్లు. జర్నలిస్ట్ గనక పత్రికలకు రాయడం మామూలుగా జరిగేదే. కానీ, అంతకు మించి అనేక విషయాల మీద ఆయన ఎన్నో గ్రంథాలు ప్రకటించారు. జనకథ, వేల్పుల కథ, సొంతకథ, శశివిషానం, పాడుటాకులు వంటి గ్రంథాలు చాలా ప్రకటించారు. ఉరుదూ కవి ముగ్దుమ్ మొహియుద్దీన్ కవిత్వానికి ఆకర్షితులై ఆయన కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. అలాగే కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ సాంగ్‌ను అదే బాణీలో, పాడుకోవడానికి అనువుగా అనువదించారు. ఇవన్నీ చేస్తూనే మరోవైపు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి మార్గదర్శిగా నిలిచారు. 1973 గుంటూరులో 1977 హైదరాబాదులో జరిగిన అరసం రాష్ట్ర మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నాటి యువతీ యువకుల మెదళ్ళలో అభ్యుదయ బీజాలు నాటి, వారిని రచనా రంగంవైపు నడిపించారు. ఆయన పరిశీలనల్లో, పరిశోధనల్లో ఎప్పుడూ కొత్త చూపు ఉండేది. కొత్త దారులు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. చేసే కృషి ఏరంగంలో దైనా, అన్నింటా మార్క్సిస్టు దృష్టికోణాన్ని నిలుపుకోవడం ఆయన ప్రత్యేకత! ఈ విషయాలన్నిటినీ పొందుపరిచి 'దారిదీపం' మానపత్రిక సంపాదకులు డి.వి.వి.ఎస్ వర్మ- రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి విశేష సంచికను వెలువరించారు. దానికి ఆర్వీ రామారావు గౌరవ సంపాదకులుగా వ్యవహరించారు.

తొలితరం జర్నలిస్ట్‌గా, తొలి కార్టూనిస్ట్‌గా, మార్క్సిస్టు మేధావిగా గుర్తింపబడ్డ రాంభట్ల ఏం రాశారోనని ఆయన రచనలు జాగ్రత్తగా పరిశీలించాను. అప్పుడు తెలిసింది ఆయన నిజంగానే విషయ పరిజ్ఞానం గలవారని! వేదాలు సృష్టి మొదలైనప్పుడే ఉన్నాయని, ఆ భగవంతుడే స్వయంగా మానవుడికి అందించాడని 'ఉదరగొట్టే వారికి రాంభట్ల వాక్యాలు కొన్ని చూపించదలిచాను. ఆయన ఇలా రాశారు. - "మన వేద సమాజంలో జర్మన్ సమాజం ఛాయలు గోచరిస్తున్నాయని, వేదకాలం కన్నా ముందే ఈ దేశంలో వర్ధిల్లిన హరప్పా మొహంజాదారో సమాజాల్లో ప్రాచ్య సమాజ లక్షణాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని- "జనకథలో ఒక చోట చెప్పారు. ఇది ఆధునిక పరిశోధనలు ధృవపరిచిన విషయాల్ని రాంభట్ల కృష్ణమూర్తి ఆరోజుల్లోనే గ్రహించగలిగారు.

ఇంకా ఇలా రాశారు "మొహంజోదారో సమాజ సంస్కృతుల ప్రభావం వేదాల మీద పడినట్లు వేదాల్లోనే యెన్నో ఆధారాలు కనిపి స్తాయి. ఇప్పుడు రామాయణం చదువుతూ ఉంటే - మెసపటేమియా మొహంజోదారో సమాజం ప్రభావం రామాయణంలో చాలా కనిపిస్తుంది. జుడిషియల్ బ్లయిండ్‌నెస్


డాక్టర్ దేవరాజు మహారాజు

తొలగిపోయిన తర్వాత మన సమాజం కొత్త కాంతులతో కొత్త తేజస్సుతో కనిపిస్తోంది. అందుచేత మార్క్సిజం వెలుగులో మన చరిత్రను తిరిగిచూద్దాం. మన సమాజాన్ని తిరిగి అర్థం చేసుకుందాం. మన కూకటి వేళ్ళను - రూట్స్‌ను- తిరిగి పట్టుకుందాం!" -ఇది రాంభట్ల కృష్ణమూర్తి భావితరాలకు ఇచ్చిన సందేశంగా మనం పరిగణించాల్సి ఉంటుంది.!

అలాగే, విద్యార్హతలు లేని మరో పరిశోధకుడు ఇప్పుడు మన ఎదుటే ఉన్నాడు. ఆయన పేరు శివశంకర్. వృత్తి రీత్యా ముఠాకూలీ అయిన ఒక వ్యక్తి, ప్రవృత్తి రీత్యా చరిత్ర అన్వేషణకు పూనుకున్నాడు, గుంటూరు జిల్లాలో ఐదు వందల అదృశ్య గ్రామాలను గుర్తించి, వాటి గురించిన సమాచారం గ్రంథస్తం చేశారు. మణిమేల శివశంకర్ అతి సాధారణ ముఠా కార్మికుడు. లారీ రాగానే బస్తాలు దించడం, లేదా ఎక్కించడం అతని పని. అదే జీవన భృతి. అయినా, అతని మనసు మరొక విషయం కోసం తపిస్తూ ఉంటుంది. తీరిక దొరికినప్పుడల్లా లేదా తీరిక చేసుకున్నప్పుడల్లా అతను శాసనాలు వెతుకుతుంటాడు. వాటి సారాన్ని క్రోడీకరిస్తూ ఉంటాడు. ఆ విధంగా ఇప్పటికి ఎన్నో అదృశ్య గ్రామాల చరిత్రను వెలికితీశాడు. ఇంకా తీస్తూనే ఉన్నాడు. అతను ఉన్నత చదువులు చదివిన వాడు కాదు. ఏ విశ్వవిద్యాలయం నుండి ఏ డిగ్రీ తీసుకున్న వాడు కూడా కాదు. అతి కష్టం మీద అయిదో తరగతి మాత్రం చదివిన వాడు. అయితేనేం? అతను తెలుగు చరిత్ర పరిశోధకుల జాబితాలో చేరిపోయాడు.

నిరుపేద కుటుంబంలో పుట్టిన మణిమేల శివశంకర్‌కు చదువుకునే అవకాశం రాలేదు. జీవనోపాధి కోసం తప్పని సరైన పరిస్థితుల్లో ముఠా కార్మికుడిగా మారాల్సి వచ్చింది. అతని స్వగ్రామం పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామం. ఉన్న ఊళ్ళో బతుకు దెరువు లేక జిల్లా కేంద్రం గుంటూరుకు వెళ్ళి అక్కడ స్థిరపడాల్సి వచ్చింది. బాల్యంలో శివశంకర్‌ను పెద్దవాళ్ల ఆలయాలకు తీసుకు వెళ్లినపుడు, ఆ బాలుడి దృష్టి దైవ విగ్రహం మీద ఉండేది కాదు. చుట్టు పక్కల వాతావరణం మీద, శిల్పాల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టేవాడు. అలాడే అక్కడి స్థానికులను అడిగి స్థల విశేషాలు ఆసక్తిగా తెలుసుకుంటూ ఉండేవాడు. దగ్గరలో ఏవైనా శాసనాలు కనబడితే వాటిని మెల్లెమెల్లగా చదవడానికి ప్రయత్నిం చేవాడు. క్రమంగా అది అతని ప్రవృత్తిగా మారింది. వయసు పెరిగినా కొద్దీ బాధ్యత మీద పడుతుంది గనక ప్రవృత్తి తిండి పెట్టదు గనక, చదువు పెద్దగా లేదు గనక-మరో మార్గంలేక ముఠా కార్మికుడిగా జీవనోపాధి చూసుకున్నాడు. అయితే వృత్తి ధర్మం పూర్తికాగానే ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకోకుండా శాసనాల వెంటపడేవాడు.

పరిశోధన మీద ఆసక్తి పెరుగుతూ ఉండడంతో ఆర్కియాలజీ విభాగం అందుబాటులోకి తెచ్చిన శాసనాలు అధ్యయనం చేయడం ప్రారంభించాడు. పురాతన తెలుగు శాసనాలు చదవడంలో క్రమంగా పట్టు సాధించాడు. సంస్కృత శాసనాలు చదవడానికి, అర్థం చేసుకోవడానికి ఇతర పెద్దలపై ఆధారపడేవాడు. ఇతనిలోని ఉత్సుకతను గమనించి వారు ఇతనికి సహకరిస్తూ ఉండేవారు. పైగా, మరింతగా ప్రోత్స హించే వారు. ఆవిధంగా మణిమేల శివశంకర్‌లో తెలియకుండానే ఒక పరిశోధకుడు ఎదుగుతూ వచ్చాడు. ఆ రకంగా చుట్టుపక్కల గ్రామాలకు వెళ్ళి, అక్కడి పెద్దల్ని విద్యావంతుల్ని పలకరించేవాడు. ఊళ్ళ మధ్య గల ఖాళీ ప్రదేశాల్ని, సమీపంలో ఉన్న చిన్న చిన్న ఆడవుల్ని తరచి తరచి చూసేవాడు. ఆనవాళ్ళు ఆధారాలు ఏవైనా దొరుకుతాయేమోనని శోధించేవాడు. ఆప్రయత్నంలో స్థానిక రికార్డుల్ని, కల్నల్ మెకంజీ రాతల్ని వెతికి పట్టుకుని అధ్యయనం చేశాడు.

గుంటూరు జిల్లాలో అదృశ్యమైపోయిన సుమారు ఐదు వందల గ్రామాలకు సంబంధించిన ఆధారాలు దొరకబట్టుకుని, వాటి గురించి రాయడం ప్రారంభించాడు. ఫలితంగానే "గుంటూరు జిల్లా అదృశ్య గ్రామాలు" పేరుతో మణిమేల శివశంకర్ రచన పుస్తకంగా వెలువడింది. మన జాతీయ పతాకానికి రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య పూర్వీకులకు - అష్టదిగ్గజాల్లో ఒకడైన పింగళి సూరన్నకు,నేటి సినీకవి పింగళి నాంగేంద్రరావులకు - వారి వారి పూర్వీకులకు సంబంధించిన ఇ వృత్తమంతా మణిమేల శివశంకర్ వెలికితీశారు.

రెంటాల బ్రహ్మీ శాసనంలో ప్రస్తావించిన 'నిడిగల్లు" గ్రామం సాధారణశకం మూడవ శతాబ్దం నాటి ఇక్ష్వాకుల రాజధానిగా ఉన్న నాగార్జునుని కోట విజయపురిలో ఉన్నదనడానికి ఆధారం ఇచ్చాడు. అలాగే, దుర్గి మండలంలో అదృశ్యమైపోయిన 'దద్దనాల పాడు' ఒకప్పుడు రాజకుటుంబాలలోని స్త్రీలు సతీసహగమనం చేసిన ప్రదేశమని శివశంకర్ ఆధారాలు చూపాడు. తెనాలి రామకృష్ణకవి స్వగ్రామం తెనాలి మండలంలోని కొలకటూరుకు సమీపంలో అదృశ్యమై పోయిన 'గార్లపాడు' అని ఈ పరిశోధకుడు నిరూపించాడు. ఇతని కృషికి ఆమధ్య "అయ్యంకి వెలగా పురస్కారం' లభించింది. ఇలాంటి వారు ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటారు. తాము చేయదలచుకున్న పని నిశ్శబ్దంగా చేసుకుంటూ పోతారు. వివేకవంతులు దయతో

తొలితరం జర్నలిస్ట్‌గా, తొలి కార్టూనిస్ట్‌గా, మార్క్సిస్టు మేధావిగా గుర్తింపబడ్డ రాంభట్ల ఏం రాశారోనని ఆయన రచనలు జాగ్రత్తగా పరశీలించాను. అప్పుడు తెలిసింది ఆయన నిజంగానే విషయ పరిజ్ఞానం గలవారని! వేదాలు సృష్టి మొదలైనప్పుడే ఉన్నాయని, ఆ భగవంతుడే స్వయంగా మానవుడికి అందించాడని 'ఉదరగొట్టే వారికి రాంభట్ల వాక్యాలు కొన్ని చూపించదలిచాను. ఆయన ఇలా రాశారు. - "మన వేద సమాజంలో జర్మన్ సమాజం ఛాయలు గోచరిస్తున్నాయని, వేదకాలం కన్నా ముందే ఈ దేశంలో వర్ధిల్లిన హరప్పా మొహంజాదారో సమాజాల్లో ప్రాచ్య సమాజ లక్షణాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని- "జనకథలో ఒక చోట చెప్పారు.

ఇలాంటి వారిని వెలికితీసి, సభ్య సమాజానికి పరిచయం చేస్తూ ఉండాలి. ఇలాంటి పరిచయాలు మరికొందరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి. గొప్ప పదవుల్లో ఉండి కూడా చేసింది ఏమీ లేక పోయినా, సిగ్గు లేకుండా అంతర్జాతీయ అవార్డుల కోసం ప్రయత్నాలు చేసుకునే హీన మనస్సులు, మీడియా పిచ్చోళ్ళు ఉన్న ఈ రోజుల్లో ఏమీ ఆశించకుండా ఎవరినీ పట్టించుకోకుండా సత్యాన్ని అన్వేషించే దిశగా నిరంతరం కృషిచేస్తున్న వారిని తప్పకుండా గుర్తించుకోవాలి! గౌరవించుకోవాలి.

- కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

రామాయణం కథలోని రాముని వ్యక్తిత్వం, రాముని నడవడి నాజీవితానికి ఒక సరికొత్త వ్యక్తిత్వాన్ని, దృక్పథాన్ని నేర్పింది. నేను అచ్చం రామునిలా జీవించాలనే కోరిక కలిగించింది. నేను ఒకటవ,రెండోవ తరగతులు చదివే రోజుల్లోను, ముఖ్యంగా గ్రామంలో చిరుతల రామాయణం ప్రదర్శించిన రోజుల్లో, కృష్ణలీలలు యక్షగానం ప్రదర్శించిన రోజుల్లో సైతం నన్ను బాలరామునిగా, బాలకృష్ణుడిగా ఇవ్వాలని మా అమ్మని అడిగి ఎత్తుకపోయి కౌసల్యగా, యశోదగా నటిస్తున్నవారు వేదికపై ఆడిస్తూ ఏవేవో పాటలు పడేవారు. నాకు ఏమి అర్థం కాకపోయేది. ఆ రోజుల్లో నా బాల్(క్రాప్) ఉంగరాల జుట్టు, నల్లని రూపు ఎలాంటి మేకప్ లేకుండానే అచ్చం బాలరామునిలా ఉన్నాడని సంబరంగా, సంతోషంగా చెప్పుకునేవారు. కానీ నాకు ఏమి అర్థంకాక మౌనంగా ఉండిపోయేవాన్ని మరి

రామరాజ్యం కావాలంటే...

కొన్నిసార్లు తోటి పిల్లలతో ఆడుకోటానికి గయిఇండ్లోకి (బజార్లోకి) ఉరికి పిల్లలందరితో కలిసిమెలిసి ఆటలాడేవాన్ని. సాయంత్రం పూట పొద్దుగూట్లో పడేముందు అమ్మ నాకు అన్నం తినిపిస్తుంటే అమ్మలక్కలు జమయ్యి రాత్రి చూసిన రామాయణ కథని ముచ్చటించే వారు. ఆకుల బుచ్చమ్మ, ఆకుల అయిలక్క, గుండ అనుమవ్వ పెద్దమ్మ, అందరు నువ్వు రాముడివి కావాలనే వారు. రాముడు రాజు కొడుకుకదా దేవుని అవతారం కదా నేను దేవుణ్ణి ఎలా కాగలను అనేవాన్ని. వెంటనే అమ్మ దేవుడని కాదు, రామునిలా మంచి బాలుడివి కావాలి. తండ్రి మాట శిరసా వహించాలి పెద్దలమాట వినాలి, గౌరవించాలి. అబద్ధమాడకూడదు.అడిగిన వారందరికి సాయం చేయాలంటూ రాముని లాగానే నీది కూడా ఒకేమాట, ఒకే బాట, ఒకే బాణం కావాలి.అచ్చం రామునిలా బతకాలన్న మాట. అలా అమ్మ చెప్పిన మాటలు చూసిన రామాయణ కథ బాగా మనస్సులో నాటుకొన్నాయి. రోజురోజుకూ పెరిగి పెద్దయినకొద్దీ శ్రీరామునితత్వం జీవిత సత్యం బాగా అలవడింది. ఆడ, మగ బేధాలు ఉండకూడదని ఇద్దరు సమానులనే భావం ఏర్పడింది. కుల, మత బేధాలు సమసి పోవాలని భావించసాగాను. ఆ రామతత్వంతోనే నేను హుస్నాబాద్, సిద్దిపేట కాలేజీలలో చదివేరోజుల్లోను అమ్మాయిలని ఆటపట్టించే ఆకతాయి రౌడీలను ఎదిరించసాగాను. రామాయణం కథలోని రాముని వ్యక్తిత్వం, రాముని నడవడి నా జీవితానికి ఒక సరికొత్త వ్యక్తిత్వాన్ని, దృక్పథాన్ని నేర్పింది.నేను అచ్చం రామునిలా జీవించాలనే కోరిక కలిగించింది.తరువాత నేను ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో లా పూర్తి చేసి వకాలత్‌ని తిరుగులేని రామబాణంగా మార్చి కరీంనగర్ కోర్ట్ రణభూమిలో వెయ్యి యుద్ధాలు చేసి కొన్ని వేల మందిని విజేతలని చేసాను.వందల మంది నిరుపేద రైతు కూలీలకు లక్షల రూపాయల నష్టపరిహారం ఇప్పించాను. శివుడు, రాముడు. బీరప్ప, మడేలయ్య లాంటి దేవుళ్ళే దిక్కు లేని వారై దేవుళ్ళ భూములన్ని అక్రమార్కుల, రియల్టర్ల హస్తగతమైనపుడు వకాలత్‌నే ఒక వజ్రాయుధంగా ఒక పశుపతాస్త్రంగా మార్చి విజయాన్ని అందించాను. (మరిన్ని వివరాల కోసం కోర్ట్ రణభూమిలో వెయ్యి యుద్ధాలు- వెయ్యి విజయాలు పుస్తకం చదవండి) రాముడికి గుడి నిర్మిస్తే రామరాజ్యం రాదు. రాముడికి పూజలు జరిపినా రామరాజ్యం రాదు. అన్యాయంపై యుద్ధం ప్రకటించి సర్వేజన సుఖినోభవంతు అంటూ పోరాటంచేస్తే రామరాజ్యం వస్తుంది.యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా: అంటూ మహిళా హక్కుల కోసం పోరాటం చేస్తే రామరాజ్యం సిద్ధిస్తుందని నా నమ్మకం.

-గులాబీల మల్లారెడ్డి, 944004135

ఎన్నికలు (నానీలు)



వీధి వీధిలో
రంగుల రాట్నాలే
ప్రతి గడపలో
వాగ్దానపు విసుర్లే

చురకలతో
చమక్కుల తూటాలే
చేతి వాటంతో
అంతటా సిరులే

ఓదార్పుతో
భుజం తట్టదాలే
నేర్పుతో
ఓట్లు పట్టుకోదాలే

ఎన్నికలు
కలల మెరుపులే
నిజానికి
భ్రమల బతుకులే

ఊరి ఊరిలో
ఉగ్రూతల ఉత్సాహాలే
ఊహాకందని
ఉత్తుత్తి పొంగులే

ఎన్నికల కాలం
అన్నీ విద్దూరాలే
ముద్ర కోసం
ఒప్పిదాల తంటాలే

అంతటా
ప్రచార సాధనాలే
కొన్నింటా
తీరని ఆశయాలే

రంగులతో
జెండాల వందనాలే
హంగులతో
ఆర్భాటపు పొంగులే

కలుపుదనంతో
ఆలింగన ప్రేమలే
మెలకువతో
ఒట్టి ముచ్చట్లే


ఎన్నికలంటే
పరుగు పందాలే
చేయి చేయి
కలిపే ఇంద్రజాలాలే

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

ఎన్నికల విన్యాసాలు!

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గత వారంలో మూడు పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందులో ఒకటి సానుకూలమైనది కాగా, రెండు ప్రతికూలమైనవి.ఇందులో మొదటి పరిణామం-ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి 12వ తేదీకల్లా ఎన్నికల కమిషన్‌కు అందచేయాలంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సుప్రీంకోర్టు ఆదేశించడం. అలాగే మార్చి 15కల్లా ఈ బాండ్ల వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో వుంచాలంటూ ఇ.సి ని కోరడం. బాండ్ల వివరాలను అందచేయడానికి జూన్ 30 వరకు నాలుగు మాసాలపాటు గడువు కావాలంటూ ఎస్‌బిఐ కోర్టును కోరిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి.ఎస్‌బిఐ చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. దీంతో ఎట్టకేలకు బీజేపీకి నిధులను విరాళాలుగా ఇచ్చిన వారెవరో, వారెంత మేరకు అందచేశారో ప్రజలు తెలుసుకోగలుగుతారు. ఈ డేటాను విశ్లేషించినట్లైతే ఇందులో క్విడ్ ప్రోకో లాంటిదేమైనా జరిగిందా? అలాగే విరాళాలు అందచేసిన కంపెనీలు ఏవైనా కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలను, దాడులను ఎదుర్కొన్నాయా? అనేది నిర్ధారించ డానికి వీలవుతుంది. దీనివల్ల, దేశాన్ని పాలిస్తున్న హిందూత్వ- కార్పొరేట్ అవినీతి బంధాన్ని ఎన్నికల సందర్భంగా మరింత మెరుగ్గా సమీక్షించడానికి దోహదపడుతుంది.

ఇక రెండో పరిణామం-పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నిబంధనలను నోటిఫై చేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న తిరోగమన చర్య. 2019 డిసెంబరులో ఈ చట్టాన్ని ఆమోదించగా, నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు, అది కూడా లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజులు ముందుగా నిబంధనలను ప్రకటించారు. కొన్ని మతాలకు చెందినవారు మాత్రమే పౌరసత్వాన్ని ఫాస్ట్‌ట్రాక్‌లో అందిపుచ్చుకోగలిగేలా ఈ సిఎఎ నిబంధనలను రూపొందించారు.ముస్లింలను మినహాయించారు. సిఎఎకి సంబంధించి రాజ్యాంగ, చట్టపరమైన ప్రధాన అభ్యంతరాల గురించి ఇక్కడ ప్రస్తావించన వసరం లేదు. కానీ, ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువస్తున్న నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకించాల్సి వుంది. ఈ నిబం ధనల వల్ల తలెత్తుతున్న ప్రధాన సమస్య ఏమిటంటే, దీనికి కటాఫ్ తేదీని 2014 డిసెంబరు 31గా నిర్ధారించారు. అయితే ఇది అస్సాం ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తోంది. అస్సాం ఒప్పం దానికి కటాఫ్ సంవత్సరాన్ని 1971గా నిర్ధారిం చారు. సిఎఎను ఆమోదించి నపుడు అస్సాంలో పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తడానికి ఇదే ప్రధాన కారణం.



అదీకాక, పౌరసత్వం కోసం పెట్టుకునే దరఖాస్తు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి పాత్ర లేకుండా చేసేలా నిబంధనలను రూపొందించారు. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఈ దరఖాస్తుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన సాధికార కమిటీలన్నీ కూడా కేంద్ర ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో నిండిపోయాయి. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు రెండింటిలోనూ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానితులు ఒక్కరు మాత్రమే వున్నారు. తమ రాష్ట్రంలో నివసిస్తున్న వారు పౌరసత్వం కోసం అర్హులా కాదా అనేది గుర్తించే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి పాత్ర లేకుండా చేసేందుకే ఇదంతా చేశారనేది స్పష్టమైపోతోంది. ఒక విచిత్రమైన లాజిక్ ప్రకారం పోస్టల్, రైల్వే శాఖలకు చెందిన అధికారులు ఈ పని చేయడానికి సరిపోతారని భావించారు.

ఇక్కడ సిఎఎ రాజ్యాంగ విరుద్ధమని సవాలు చేస్తూ దాఖలైన దాదాపు 200 పిటిషన్లను విచారణకు చేపట్టకుండా, వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సుప్రీంకోర్టు విస్మరించింది. ఎన్నికల బాండ్ల విషయంలో, 370వ అధికరణను రద్దు చేసిన కేసుల్లో తీర్పు నివ్వడంలో సుప్రీంకోర్టు చేసిన జాప్యం, వైఫల్యాల వల్ల మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన చర్యలు తీసుకోవడానికి వీలు కలిగింది.ఇక మూడవ పరిణామం-భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి సంబంధించినది. రాబోయే లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ప్రత్యక్ష ప్రభావం చూపే అంశమిది. గత వారంలో ఎన్నికల కమిషనర్లలో ఒకరు అరుణ్ గోయెల్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో, ఇక ఎన్నికల కమిషన్‌లో మిగిలిన ఏకైక వ్యక్తి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్. ఎన్నికల కమిషన్‌లోని మూడవ సభ్యుడు కొన్ని మాసాల క్రితమే రిటైరయ్యారు.

అరుణ్ గోయెల్ నియామకం కూడా 2022 నవంబరులో చాలా హడావిడిగా జరిగింది. ఆనాడు ఈ చర్యను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్నికల కమిషనర్ల నియామకపు ప్రక్రియను తటస్థ స్వతంత్ర కమిటీ చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా రాజ్యాంగ ధర్మాసనం ఈ చర్యను ప్రశ్నించింది.అరుణ్ గోయెల్ రాజీనామాకు వాస్తవ కారణమేంటన్నది స్పష్టంగా తెలియరాలేదు. కానీ, దీనివల్ల కమిషన్‌లో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ), ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఈ ముగ్గురితో కూడిన కమిటీ సిఫార్సుల ప్రాతిపదికన సి.ఇ.సిలు, ఇ.సిల నియామకం జరగాలని గతేడాది మార్చిలో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, అలాగే అన్ని రూపాల్లో లొంగదీసుకోవడాలకు దూరంగా వుండడం ద్వారా స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలను నిర్వహించే కర్తవ్యాన్ని ఇ.సి.ఐ నిర్వర్తించడానికి వీలుగా ఇది అవసరమని కోర్టు అభిప్రాయపడింది.

అయితే, సుప్రీంకోర్టు రూలింగ్ తర్వాత, సి.ఇ.సి, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు, పని పరిస్థితు లకు సంబంధించి మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒక బిల్లును తీసుకువచ్చింది. ఈ చర్యతో సెలక్షన్ కమిటీ నుండి సిజెఐ తొలగించబడ్డారు. దానికి బదులుగా, ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రి కమిటీలో వుంటారు. ఆ రకంగా, ముగ్గురు సభ్యులుగల కమిటీలో ప్రభుత్వానికే మెజారిటీ వుండడంతో సుప్రీంకోర్టు సిఫార్సు ప్రయోజనాన్ని ఇది దెబ్బతీస్తోంది.ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసేందుకు మార్చి 14న త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఊహిం చినట్లుగానే, ప్రభుత్వం సూచించిన ఇద్దరే సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేష్ కుమార్ ఎంపికయ్యారు. సిఇసితో వీరిద్దరు కలిసి త్వరలో ప్రకటించబోయే లోక్‌సభ ఎన్నికలను నిర్వహించనున్నారు. రాజ్యాంగ సంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే ఒక పద్ధతి ప్రకారం తుడిచిపెట్టబడుతున్న నేపథ్యంలో స్వతంత్ర సంస్థగా వుండాల్సిన ఎన్నికల కమిషన్

సుప్రీంకోర్టు రూలింగ్ తర్వాత, సి.ఇ.సి, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు, పని పరిస్థితు లకు సంబంధించి మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒక బిల్లును తీసుకువచ్చింది. ఈ చర్యతో సెలక్షన్ కమిటీ నుండి సిజెఐ తొలగించబడ్డారు. దానికి బదులుగా, ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రి కమిటీలో వుంటారు. ఆ రకంగా, ముగ్గురు సభ్యులుగల కమిటీలో ప్రభుత్వానికే మెజారిటీ వుండడంతో సుప్రీం కోర్టు సిఫార్సు ప్రయోజనాన్ని ఇది దెబ్బ తీస్తోంది.ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసేందుకు మార్చి 14న త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఊహిం చినట్లుగానే, ప్రభుత్వం సూచించిన ఇద్దరే సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేష్ కుమార్ ఎంపికయ్యారు. సిఇసితో వీరిద్దరు కలిసి త్వరలో ప్రకటించబోయే లోక్‌సభ ఎన్నికలను నిర్వహించనున్నారు. రాజ్యాంగ సంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే ఒక పద్ధతి ప్రకారం తుడిచిపెట్టబడుతున్న నేపథ్యంలో స్వతంత్ర సంస్థగా వుండాల్సిన ఎన్నికల కమిషన్ విధ్వంసం అరిష్టమే.

విధ్వంసం అరిష్టమే. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

(మార్చి 14 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



క్విడ్‌ప్రోకోతో ఆధారాలు నాశనం

- పలు విషయాలలో కట్టుకథలు
- సమాచారం ఉంటే అనుమానం ఎందుకు?
- సమాచారమే లేనప్పుడు సమయం కోరడం దేనికి? : ఎస్‌బీఐపై మాజీ ఎన్నికల కమిషనర్ లవాసా ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం రూపకల్పన వెనుక ప్రభుత్వ ఉద్దేశాలపై మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా పలు సందేహాలు వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత లవాసాపై మోడీ ప్రభుత్వం పలు వివాదాస్పద చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆయన 2019 ఆగస్టులో పదవి నుండి వైదొలిగారు. 2018లో తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకంలోని సెక్షన్ 7 (4)లోని అంశాలను 'ది హిందూ' పత్రికకు రాసిన వ్యాసంలో లవాసా ప్రస్తావించారు.

'కొనుగోలుదారుడు అందజేసిన సమాచారాన్ని అధీకృత బ్యాంక్ ఏ అధికారికి కానీ, ఏ ప్రయోజనం కోసం కానీ ఇవ్వకూడదు. దీనిని గోప్యంగా ఉంచాలి. అయితే న్యాయస్థానం కోరినప్పుడు లేదా చట్టాన్ని అమలు చేసే సంస్థలు క్రిమినల్ కేసు నమోదు చేసినప్పుడు మాత్రం ఆ సమాచారాన్ని అందజేయాల్సి ఉంటుంది' అని ఆ సెక్షన్ స్పష్టంగా చెబుతోందని లవాసా తెలిపారు. కొనుగోలుదారుకు జారీ చేసిన బాండుపై ఉండే రహస్య నెంబరును చట్టప్రకారం బ్యాంక్ తన వద్ద అట్టే పెట్టుకోకూడదని బాండ్ల రూపకర్తలు కూడా చెప్పారు. అంటే దీని అర్థం కొనుగోలుదారుకు, బాండును స్వీకరించిన వారికి మధ్య ఉన్న సంబంధాన్ని బయటపెట్టడం దాదాపు అసాధ్యం.

దీనిపై లవాసా వ్యాఖ్యానిస్తూ బాండుపై ఉండే నెంబరు దాని ప్రామాణికతను సరిపోల్చడానికి, ఆడిట్ అవసరాలకు మాత్రమే పరిమితమైతే అది కరెన్సీ వంటిదేనని చెప్పారు. 'దర్యాప్తు సంస్థకు అందజేయాలని ఒత్తిడి తెచ్చినప్పుడు కొనుగోలుదారుని గుర్తింపును ఎస్‌బీఐ ఎలా బయటపెడుతుంది? నిధుల వనరులకే విచారణ పరిధిని ఎలా పరిమితం చేస్తుంది? ఇది దాత, రాజకీయ పార్టీ మధ్య ఉన్న సంబంధాలను అందించే అవకాశాలను తోసిపుచ్చడం కాదా? తద్వారా క్విడ్‌ప్రోకో ఆరోపణలపై విచారణకు అవసరమైన కీలక ఆధారాలను నాశనం చేయడం కాదా? చట్టాన్ని అమలు చేయడం, న్యాయస్థానం, దర్యాప్తు సంస్థ పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించడం వంటి విషయాలలో ఎస్‌బీఐ కట్టుకథలు అల్లడం కాదా?' అని ప్రశ్నించారు.

'ఒకవేళ ఎస్‌బీఐ వద్ద రికార్డులు లేకపోతే బాండ్ల సమాచారాన్ని సేకరించేందుకు ఏ ప్రాతిపదికన సమయం కోరింది? దాతలతో రాజకీయ పార్టీలను, యూనిక్ నెంబరును సరిపోల్చే సమాచారం ఎస్‌బీఐ వద్ద లేనప్పుడు తన వద్ద వివరాలు ఉన్నాయని ఎలా చెప్పుకుంటుంది?' అని కూడా లవాసా నిలదీశారు. ఎంపీల సంఖ్య ఎక్కువగా ఉన్నందునే తమకు అధిక విరాళాలు అందాయంటూ బీజేపీ నేతలు చేస్తున్న వాదనను ఆయన కొట్టిపారేశారు. బీజేపీ వైవిధ్యభరితమైన పార్టీ అంటూ వారు ఇస్తున్న నిర్వచనాన్ని కూడా లవాసా ఎద్దేవా చేశారు.

చిత్రపురిలో రూ.3 వేల కోట్ల కుంభకోణంపై విచారణ జరపరెందుకు?

- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చిత్రపురి కాలనీలో రూ.3 వేల కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్ ఖాన్ చేసిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా మాదాపూర్ పోలీసులు తనపై కేసు నమోదుచేసి తన మొబైల్ ఫోన్, పాస్ పోర్ట్ తీసుకున్నారని చెప్పారు. చిత్రపురి సొసైటీ కోశాధికారి అనుముల మహానంద రెడ్డి ఎవరో తెలియదని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారనీ, అయితే ఆయనతో సీఎం దిగిన ఫోటోలున్నాయని ఆరోపించారు. తనపై పెట్టిన కేసు విషయంలో న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అరాచకాలపై ఉన్నత న్యాయస్థానంలో తేల్చుకుంటానని హెచ్చరించారు.

జెబ్రానిక్స్ అమ్ములపొది నుంచి మరో కొత్త ఆవిష్కరణ

- అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మార్కెట్‌లోకి
- జూక్‌బార్ 9900 : డైరెక్టర్, సహ-వ్యవస్థాపకుడు ప్రదీప్ జోషి

హైదరాబాద్: జెబ్రానిక్స్ అమ్ములపొది నుంచి మరో కొత్త ఉత్పత్తి ఆవిష్కరించబడిందని ఆ సంస్థ డైరెక్టర్, సహ-వ్యవస్థాపకుడు ప్రదీప్ జోషి పేర్కొన్నారు. జెబ్- జ్యూక్ బార్ 9900 ఉత్పత్తి డోల్బీ ఆటమ్స్, డిటిఎస్ ఎక్స్ సపోర్ట్‌తో కూడినదని తెలిపారు. ధ్వనిని పెంపొందిం చడంలో అధునాతన పరిజ్ఞానంతో రూపొందించ బడిందన్నారు. ఈ ఉత్పత్తి రూ.32,999కే పొందవచ్చునని తెలిపారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా కూడా ఆర్డర్ చేసుకొని జెబ్- జ్యూక్ బార్ 9900 ఉత్పత్తిని పొందవచ్చునని చెప్పారు. ఐటీ,గేమింగ్ పెరిఫెరల్స్, ఆడియో, కన్జూమర్ ఎలక్ట్రానిక్ వంటి ఉత్పత్తులను రూపొందించడంలో జెబ్రానిక్స్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నదని అన్నారు. 5.2.4 ఛానెల్ కాన్ఫిగరేషన్‌తో రూపొందించబడిన ఈ ఉత్పత్తికి డిటిఎస్-ఎక్స్ ద్వారా ఆవిష్కరించబడిందన్నారు. 16.51 సెంటీమీటర్ల వైర్లు లేకుండా సబ్‌వూఫర్ల ద్వారా ఈ ఉత్పత్తిని ఆవిష్కరించడమైనదని ప్రదీప్ జోషి తెలిపారు.

రైతులను ఆదుకుంటాం : మంత్రి జూపల్లి

నవతెలంగాణ-భిక్కనూర్/దోమకొండ/సిరికొండ

అకాల వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. త్వరలోనే రైతుల ఖాతాలో పంట నష్టపరిహారం జమ చేస్తామన్నారు. గురువారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీతో కలిసి మంత్రి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. భిక్కనూర్, దోమకొండ, సిరికొండ మండలాల్లో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎకరానికి రూ.10,000 చెల్లించి.. త్వరలోనే 20 లేదా 25 వేల రూపాయలు అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కేజ్రీవాల్ అరెస్ట్



(మొదటిపేజీ తరువాయి)

తొమ్మిది సార్లు విచారణకు రావాలని పిలిచినా హాజరయ్యేందుకు కేజ్రీవాల్ నిరాకరించారు. మరోవైపు తనపై బలవంతపు చర్యలు తీసుకోకుండా దర్యాప్తు సంస్థలకు ఆదేశాలివ్వాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈడీ అరెస్టు చేసింది.

సుప్రీంకోర్టులో పిటిషన్

ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆయన తరపు న్యాయవాదులు అత్యవసర విచారణను కోరుతూ.. సుప్రీంకోర్టు రిజిస్ట్రీని అభ్యర్థించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఆప్ కార్యకర్తల ఆందోళన

మరోవైపు, ఈడీ వైఖరిని నిరసిస్తూ కేజ్రీవాల్ ఇంటి వద్ద ఆప్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ పరిణామాలతో సీఎం ఇంటివద్ద భారీగా పోలీసులు మోహరించడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడాన్ని ఆప్ నేతలు ముక్తకంఠంతో ఖండించారు.

ఆయనే సీఎం..జైలు నుంచే పరిపాలన

కేజ్రీవాల్ అరెస్టయినప్పటికీ ఆయనే సీఎంగా కొనసాగుతారని, జైలు నుంచే పరిపాలన చేస్తారని ఢిల్లీ మంత్రి అతిషీ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ అరెస్టు పెద్ద కుట్రేనని ఎంపీ రాఘవ్ చద్దా అన్నారు. 'అరవింద్ కేజ్రీవాల్ అంటే ప్రజలకు ప్రేమ, అభిమానం. ఏదో సాకు చూపి, కారణాలు చూపి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయొచ్చు.. కానీ ఆయన ఆలోచనలను అరెస్ట్ చేయలేరు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే వీధికో కేజ్రీవాల్ పుట్టుకొస్తారు. సోదాల పేరుతో ఈడీ అధికారులు కేజ్రీవాల్ ఫోన్ తీసుకున్నారు. ఆయన సెక్రెటరీ మొబైల్ కూడా తీసుకున్నారు. ఈ అరెస్ట్‌తో బీజేపీ పన్నాగం బయటపడింది. అని ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, అతిషి అన్నారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడంపై ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయెల్ స్పందించారు. మనీశ్ సిసోడియాను అరెస్టు చేసినా ఇప్పటివరకు ఏమీ దొరకలేదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ గొంతు అణచివేసేందుకే.. ఆయనను అరెస్టు చేశారని, గోయెల్ విమర్శించారు.

కవిత అరెస్ట్ అందుకేనా...?

ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇప్పటి వరకు దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జిషీట్లు, సంప్లమెంటరీ చార్జిషీట్లలో కవిత ప్రస్తావన ఉన్నా నిందితురాలిగా ఎక్కడా చూపలేదు. సాక్షిగా కవిత స్టేట్మెంట్‌ను రికార్డు చేసినా ఈ అంశాన్ని సంప్లమెంటరీ చార్జిషీట్‌లో పొందుపరచలేదు. దాదాపు 36 మందిని విచారించినట్లు చూపినా కవిత పేరును విస్మరించడం అప్పట్లో పెద్ద ఎత్తున అనుమానాలకు తావిచ్చింది. అయితే, ఈడీ విచారణకు పిలిచిన ఏడాది తర్వాత దర్యాప్తు సంస్థలు వరుస పెట్టి కవితకు నోటీసులిచ్చాయి. సీబీఐ నేరస్తురాలి కింద నోటీసులిస్తే, సోదాల పేరుతో వెళ్లిన ఈడీ ఏకంగా ఆమెను అరెస్ట్ చేసింది. అయితే మరునాడు కోర్టు ముందు ప్రవేశపెట్టినా అరెస్ట్ రిపోర్ట్‌లో మాత్రం కవితను ఈడీ కింగ్ పిన్‌గా పేర్కొంది. అంతేకాదు...ఏకంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాతో కవిత భేటీ అయి లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలుపై చర్చించారని కీలక ఆరోపణ చేసింది. వీరితో కలిసి కవిత ఒక ఒప్పందం కుదుర్చుకొని, సౌత్ గ్రూప్ సభ్యులతో కలిసి దళారుల ద్వారా ముడుపులు చెల్లించారని తెలిపింది. ఇందుకు వైఎస్సార్ ఎంపీ మాగుంట శ్రీనివాసులు ఇచ్చిన స్టేట్మెంట్‌ను ఆధారంగా చూపింది. దీంతో కవిత అరెస్ట్ ... కేజ్రీవాల్ టార్గెట్‌గానే జరిగిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

కేజ్రీవాల్ పాత్రలో కీలకంగా మాగుంట స్టేట్మెంట్

ఢిల్లీలో లిక్కర్ బిజినెస్ చేసేందుకు కవిత ఇప్పటికే సంప్రదించారని, రూ.100 కోట్లు పార్టీకి చెల్లించేందుకు అంగీకరించారని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ 2021 మార్చి 16న ఆయన ఆఫీసులో తనకు తెలిపారని మాగుంట శ్రీనివాసులురెడ్డి వెల్లడించినట్లు ఈడీ కస్టడీ రిపోర్టులో పేర్కొంది. గతేడాది జూలై 14, 17 తేదీలలో ఈడీకి ఇచ్చిన స్టేట్మెంట్లలో ఈ విషయాలను మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారని పేర్కొంది. కవితను కలుసుకోవాల్సిందిగా కేజ్రీవాల్ తనకు సలహా ఇచ్చారని, ఆ తర్వాత 2021 మార్చి 19న కవిత తనకు స్వయంగా ఫోన్ చేసి హైదరాబాద్‌కు రమ్మన్నారని మాగుంట చెప్పినట్లు ఈడీ ప్రస్తావించింది. హైదరాబాద్‌లో తాను ఆమెను కలుసుకున్నప్పుడు తాము చెల్లించాల్సిన రూ.100 కోట్లలో రూ.50 కోట్లు తన సీఏ బుచ్చిబాబుకు ఇవ్వాల్సిందిగా కవిత చెప్పారని మాగుంట వాంగ్మూలాన్ని చూపింది.

ఐదు రోజుల ఇన్వెస్టిగేషన్‌లో కేజ్రీవాల్ టార్గెట్‌గానే

ఐదు రోజులుగా కస్టడీలో ఉన్న కవితను కేజ్రీవాల్ టార్గెట్‌గానే ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రోజు వారీగా ఎక్కువ సమయం ఇంటరాగేషన్ చేయకపోయినా... మాగుంట శ్రీనివాస్‌లు స్టేట్మెంట్ ఆధారంగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. కేజ్రీవాల్‌ను ఎప్పుడైనా కలిశారా? లిక్కర్ పాలసీ సందర్భంలో ముడుపుల అంశంపై చర్చ జరిగిందా? మాగుంట ఇచ్చిన స్టేట్మెంట్‌తో ఏమైనా సంబంధం ఉందా? ఆప్ నేతలతో సౌత్ గ్రూప్‌లోని సభ్యులెవరు చర్చలో పాల్గొనేవారు?' వంటి అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఈ విచారణలో కవిత స్టేట్మెంట్ లోని పలు అంశాలను ఈడీ రికార్డ్ చేసింది. వీటి ఆధారంగా కేజ్రీవాల్ అరెస్ట్‌కు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం.

సేమ్ సీన్ రిపీట్

లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థలు సోదాల పేరుతో అరెస్ట్‌లు కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇతర నిందితుల అరెస్ట్‌లో ఇదే రీతిలో వ్యవహరించాయి. ప్రస్తుతం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ విషయంలోనూ ఇదే జరిగింది. ఇక కవిత విషయంలోనూ ఈడీ అధికారులు చాలా ప్లాన్‌గా వ్యవహరించారు. తనపై బలవంతపు(అరెస్ట్) చర్యలు తీసుకోవద్దని కవిత వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిన శుక్రవారం సాయంత్రమే హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సోదాలు చేపట్టారు. అనంతరం అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించారు.

మరీ ఇంత దిగజారుడా..?



బీజేపీ అధికారం కోసం ఎంతగా దిగజారిందో..కేజ్రీవాల్ అరెస్టు నిర్ధారిస్తుంది. కేజ్రీవాల్‌పై ఈ రాజ్యాంగ విరుద్ధ చర్యకు వ్యతిరేకంగా 'భారత్' ఐక్యంగా నిలుస్తుంది"

- నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్.

ఓటమి తప్పదన్న భయంతోనే..



'దశాబ్దపు వైఫల్యాలు, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం' కారణంగానే ఈ అరెస్టు జరిగింది.కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వం జుగుప్సాకరంగా వ్యవహరించింది ".

- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

మిర్యాలగూడలో జాతీయస్థాయి నందిని నాటకోత్సవాలు

- 30 నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రదర్శన పోటీలు



నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఈనెల 30 నుంచి జాతీయస్థాయి నందిని నాటకోత్సవాలను నిర్వహించనున్నట్టు సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్ష కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కిష్టమూర్తి తెలిపారు. గురువారం మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో నాటకోత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మిర్యాలగూడలోని కళాభారతి (మినీ రవీంద్ర భారతి) ఆడిటోరియంలో ఈ నాటకోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాటక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. జాతీయ స్థాయి పద్య సాంఘిక నాటక పోటీలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయని చెప్పారు. పద్య నాటక పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 15 దరఖాస్తులు రాగా, వాటిలో తెలంగాణ నుంచి నాలుగు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదింటిని ఎంపిక చేసినట్టు తెలిపారు.

సాంఘిక నాటక పోటీలకు తెలంగాణ నుంచి 13, ఏపీ నుంచి 27 దరఖాస్తులు రాగా, తెలంగాణ నుంచి నాలుగు, ఏపీ నుంచి ఎనిమిది దరఖాస్తులను ఎంపిక చేశామని చెప్పారు. ఈ పోటీలలో పద్యనాటికలలో 9, సాంఘిక నాటికలు 12 ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ప్రతి నాటక పోటీలో మొదటి బహుమతి రూ.50వేలతోపాటు బంగారు నంది అవార్డు, రెండో బహుమతిగా రూ.40 వేలు.. వెండి నంది, మూడో బహుమతిగా రూ.30వేలతో పాటు రాగి నంది అందిస్తామన్నారు. సాంఘిక నాటిక పోటీలలో మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు పురస్కారం అందజేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న పద్య నాటక ప్రతి బృందానికీ రూ.40 వేలు, సాంఘిక నాటిక బృందానికి రూ.20 వేలు పారితోషికంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళా కేంద్రం చంద్రశేఖరరావు, సహాయ కార్యదర్శి దుర్గి శ్రీనివాస్ శర్మ కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణ శర్మ, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, నిర్వహణ కార్యదర్శి పరిమి రామావతారం తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి మంత్రి కోమటిరెడ్డి హామీ

- క్రషర్ యజమానుల సమ్మె విరమణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

క్రషర్ యజమానులు ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించారు. యథావిధిగా కంకర, ఇతర స్టోన్ మెటీరియల్ సరఫరాకు అంగీకరించారు. స్టోన్ క్రషర్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తనను కలిసిన తెలంగాణ క్రషర్ అసోసియేషన్ కమిటీకి చెప్పారు మంత్రిని హైదరాబాద్‌లో తెలంగాణ క్రషర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న క్రషర్ రంగం ఫిట్ మెజర్‌మెంట్, రాయల్టీ చెల్లింపుల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ఎప్పుడో చేసిన క్రషర్ గుంతలకు మెజర్‌మెంట్ వేసి ఇప్పుడు రాయల్టీ చెల్లించాలని చెప్పడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని మంత్రికి తెలిపారు. అందులో ప్రభుత్వ పనులతోపాటు ప్రయివేటు పనులకు సరఫరా చేశామన్నారు. చేశామనీ, ప్రైవేటుకు చేశామన్నారు. అయితే ప్రభుత్వ పనులకు కాంట్రక్టు బిల్లుల చెల్లింపు సమయంలో రాయల్టీ తీసుకుంటున్నారనీ, ప్రయివేటు వాటికి ఎప్పటికప్పుడు తీసుకోవాలని తాము కోరుతున్నామని చెప్పారు. సంవత్సరాల తర్వాత ఇప్పుడు అన్నింటికి కలిపి మళ్లీ రాయల్టీ చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని గుర్తు చేశారు. ఇది క్రషర్ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతుందన్నారు. క్రషర్ అసోసియేషన్ సమస్యలను తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రిగారికి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జూన్ 3వ తారీకు తర్వాత తాను సీఎంతో మరోసారి చర్చించి ఒక మంత్రులతో కమిటీ వేయించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

అప్పారి త్యాగం చిరస్మరణీయం

- ఆయన ఆదర్శాలను కొనసాగించాలి : వర్ధంతి సభలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమైక్య ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం కోసం 18 ఏండ్ల సర్వీసును వదులుకున్న త్యాగధనుడు అప్పారి వెంకటస్వామి అని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి అన్నారు. ఆయన ఆదర్శాలను కొనసాగించాలనీ, వెంకటస్వామి ఆశయాల సాధన కోసం కృషి చేయటమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని చెప్పారు. ఇదే నేటి ఉపాధ్యాయుల కర్తవ్యమన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి (ఏవీఎస్) 23వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వెంకటస్వామి చిత్రపటానికి సీనియర్ నాయకులు డి మస్తాన్ రావు, సి కమలకుమారి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో చావ రవి మాట్లాడుతూ స్వార్థ ప్రయోజనాలకోసం నేడు జాతీయ సమైక్యతకు చిచ్చుపెట్టి రాజ్యాంగ లక్ష్యాలను అపహాస్యం చేస్తున్న విచ్ఛిన్నకర శక్తులను ఎదుర్కోవటానికి వెంకటస్వామి స్ఫూర్తితో అభ్యుదయ ఉపాధ్యాయ ఉద్యమం పనిచేయాలన్నారు. హక్కులు, బాధ్యతలు ఉద్యమ నేత్రాలని పేర్కొంటూ ప్రభుత్వ విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పి అప్పారి తన జీవిత చరమాంకం వరకు అదే నిబద్ధతతో పనిచేసిన మహనీయుడని గుర్తు చేశారు. సంఘంలో ఆర్థిక క్రమశిక్షణను పాటించటం, అభ్యుదయ ఉద్యమాలకు చేయూతనివ్వడంతో పాటు కుటుంబంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించి తను నమ్మిన ఆశయాలను ఆచరించి చూపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ సింహాచలం, నాయకులు శ్యామ్ సుందర్, శారద, బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కిరణ్ మృతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



(ఫైల్)

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కిరణ్ హైదరాబాద్‌లోని బాలాజీనగర్ దగ్గర ఉన్న ప్రగతినగర్‌లో మరణించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆటో కార్మికునిగా ఆయన జీవనం కొనసాగించారు. ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఆటో యూనియన్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. అక్రమ ట్రాఫిక్ చలాన్లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఆటో స్టాండ్లను ఏర్పాటు చేయాలనీ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఒత్తిడి పెంచారు. నిబద్ధత, నిజాయితీతో ఉద్యమంలో పాల్గొన్నారు. కిరణ్ మరణం పట్ల ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీలు సంతాపం ప్రకటించాయి. ఆయన మరణం కార్మిక ఉద్యమానికి తీరనిలోటని ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, వి ప్రవీణ్ తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు.

సికింద్రాబాద్ బీఆర్ఎస్‌లో అభ్యర్థి ఎవరో?

- పద్మారావు, మరో ముగ్గురి పేర్ల పరిశీలన
- దానం నాగేందర్‌కే కాంగ్రెస్ టికెట్
- బొంతుకు నిరాశ?
- లష్కర్‌లో పాగా వేయాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ గట్టి ప్రయత్నాలు
- మరోసారి గెలిచేందుకు కిషన్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ తాజాగా అభ్యర్థిని ప్రకటించగా.. బీఆర్ఎస్‌లో అభ్యర్థి ఎంపిక ఇంకా కొలిక్కి రాలేదు. ప్రధాన పార్టీలైన ఈ రెండూ సికింద్రాబాద్(లష్కర్)లో ఈసారి ఎలాగైనా పాగా వేయాలని పావులు కదుపుతున్నాయి. మరోసారి గెలిచేందుకు కిషన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో అభ్యర్థుల ప్రకటన ఆలస్యమైన నేపథ్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై రకరకాల ప్రచారాలు జరిగాయి. చివరకు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేరును ఖరారు చేస్తూ అధిష్టానం గురువారం ప్రకటించింది. అయితే, మొన్నటివరకు బొంతు రామ్మోహన్, ప్రముఖ విద్యావేత్త విద్యా స్రవంతిలో ఒకరికి ఖచ్చితంగా టికెట్ అని ప్రచారం సాగింది. బీఆర్ఎస్‌లో పద్మారావు, ఎర్ల సుధాకర్ రెడ్డి, నాయిని అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. ఇలా రోజుకో పేరు బయటకు వస్తోంది.

కిషన్ రెడ్డికి దీటైన అభ్యర్థి కోసం వెతుకులాట!

సికింద్రాబాద్ నుంచి బీజేపీ తరపున కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. ఈయన ఇప్పటికే ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇక్కడ బీజేపీకి చెక్ పెట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ భారీ కసరత్తులో ఉన్నాయి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్‌రెడ్డిని



ఓడించాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక్కడ ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉంది. అందుకే అభ్యర్థి ఎంపికలో ఆలస్యమైనప్పటికీ.. జాగ్రత్తలు తీసుకుంటున్నదని ఆ పార్టీ నేత ఒకరు చెప్పారు. బీఆర్ఎస్ సైతం అదే ఆలోచనలో ఉన్నప్పటికీ.. కవిత లిక్కర్ స్కాం, ఈడీ అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీ వైఖరిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అభ్యర్థి ఎంపికలో రోజుకో మలుపు

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక విషయం రోజుకో మలుపు తిరిగింది. రోజుకో పేరు అధిష్టానం పరిశీలనలో ఉన్నదంటూ అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్‌లో ప్రచారాలు ఊపందుకున్నాయి. మొన్నటి వరకు సికింద్రాబాద్ కాంగ్రెస్ సీటు జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కే అని ఊహాగానాలు వెలువడటమే కాదు.. ఆయన ప్రచారం సైతం చేసుకున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా దానం పేరును జాబితాలో చేర్చి ప్రకటించింది అధిష్టానం. అయితే, టికెట్ తనకే వస్తుందన్న ఆశతో ఉన్న బొంతు రామ్మోహన్‌కు నిరాశే ఎదురైంది. ఇక మిగిలింది బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎంపికనే. కొన్నిరోజుల వరకు తలసాని ఫ్యామిలీకే అని ప్రచారం చేశారు. తీరా ఇప్పుడు పద్మారావు గౌడ్ లేదా వారి ఫ్యామిలీలో ఒకరికి టికెట్ ఖచ్చితమని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ మేరకు చర్చలు కూడా జరిగాయి. ఒకవేళ పద్మారావు గౌడ్ ఎన్నికల్లో పోటీకి సుముఖత చూపని పక్షంలో అంబర్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎర్ల సుధాకర్ రెడ్డి, మాజీ హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి అల్లుడు రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి పేర్లను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే, పద్మారావునే ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	67,420	▲ 1090
22 క్యారెట్లు	61,800	▲ 1000
కిలో వెండి	81,500	▲ 1500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 106
రిటైల్ (లైవ్)	రూ. 128
స్కిన్‌తో	రూ. 186
స్కిన్‌లెస్	రూ. 211

వేసవి భత్యం ఉన్నట్టా..లేనట్టా ?

- మూడేండ్లుగా ఉపాధి కూలీల నిరీక్షణ
- మార్గదర్శకాలు రాలేదంటున్న అధికారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఉన్న ఊరిలోనే నిరుపేదలకు పనులు కల్పించే ఉద్దేశంతో యూపీఏ హయాంలో కమ్యూనిస్టుల పోరాటంతో వచ్చిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం రోజు రోజుకూ నిర్వీర్యమవుతోంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కొత్త కొత్త నిబంధనలు పెట్టడమే కాకుండా.. చట్టానికి నిధుల కేటాయింపులో భారీగా కోతలు విధించింది. అందులో భాగంగానే వేసవి భత్యం చెల్లింపు ఆగిపోయింది. వ్యవసాయ పనులు పూర్తైన తరువాత అంటే వేసవిలో ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. అయితే ఏటా అమలు చేసే వేసవి భత్యం విషయంపై ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలూ రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. మూడేండ్లుగా ఆ ఊసే లేకపోవడంతో ఉపాధి కూలీలు డోలాయమానంలో పడ్డారు.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని 15 గ్రామాల్లో ఉపాధి పనులు సాగుతున్నాయి. రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతోంది. మండల ఏపీఓ హరీష్ ఆధ్వర్యంలో కూలీలను పర్యవేక్షణ చేస్తున్నారు. మండలంలో ఉపాధిహామీలో మొత్తం 8,441 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో 11,078మంది సభ్యులుగా ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో(2023-24) 4178 కుటుంబాలు (11078మంది కూలీలు) హాజరు కాగా, 19,6789 పని దినాలు చేశారు. ఒక్కొక్క కూలికి నిత్యం రూ.190.08 నుంచి రూ.200 వరకు చెల్లిస్తున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు ఎక్కువగా జరుగుతాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో పూర్తిస్థాయిలో పనులు చేయలేని పరిస్థితిలో వేసవి భత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 25 శాతం అందించేవారు.



పనుల వద్ద అరకొర సౌకర్యాలే..!

ఈ లెక్కన వేసవి భత్యం, ఫిబ్రవరికి సంబంధించి రూ.2,21,560, మార్చికి సంబంధించి రూ.276960, ఏప్రిల్‌కు సంబంధించి రూ.2,76,960, మేకి సంబంధించి రూ.3,32,340, జూన్‌లో రూ.2,76,960, మొత్తంగా సుమారు రూ.కోటి 3లక్షల పైచిలుకు వేసవి భత్యం చెల్లించాల్సి ఉంటుంది.

అలాగే, మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేసవి భత్యం మొత్తం కూలీలు(13,756మంది)కు ఫిబ్రవరిలో రూ.2,75120, మార్చిలో రూ.3,43900, ఏప్రిల్‌లో రూ.3,43,900, మేలో రూ.4,12680, జూన్‌లో రూ.3,43900 ఉండగా.. మొత్తం రూ.కోటి 6లక్షలకు పైగా బకాయి ఉంది. మూడేండ్లకు గాను మొత్తం రూ.2కోట్లకు పైచిలుకు వేసవి భత్యం చెల్లించాల్సి ఉందని ఉపాధి కూలీలు పేర్కొంటున్నారు. ఒక్క మల్హర్‌రావు మండలంలోనే రెండు కోట్ల రూపాయల పెండింగ్ ఉంటే.. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా ఎన్ని కోట్ల రూపాయలు పెండింగ్ ఉంటాయన్నది ప్రశ్న. ఈ ఏడాది మార్చి 3వ వారం పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు.

ఏటా వేసవిలో ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు అందని ద్రాక్షగా మారాయి. సమావేశాల్లో చెప్పడమే తప్ప ఆచరణలో శూన్యం. మండుటెండలో పనులు చేసి వడదెబ్బకు గురైనవారు లేకపోలేదు. ఉపాధి పనులు జరిగే చోట నీడ, నీళ్ల ఏర్పాటు చేయాలి. చలువ పందిళ్లు, మంచినీటి వసతి తప్పకుండా ఏర్పాటు చేయాలి. నీటి వసతి కల్పించకుంటే మంచినీటి భత్యం కింద రూ.5 అదనంగా చెల్లించాలి. పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. పని చేస్తున్న సమయంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి.

కూలీలు ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించాల్సి ఉంది. కానీ, ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి. కొత్తగా తీసుకొచ్చిన ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించి ఎలాంటి ఆప్షన్ లేదు. దీంతో ఈసారి అమలవుతుందా ? లేదా ? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదనపు భత్యం లేకపోతే కూలీలు నష్టపోయే పరిస్థితి ఉంది.

ఈ విషయంలో ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. చట్టం నిర్వీర్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

మూడేండ్లుగా భత్యం లేదు



ప్రతి సంవత్సరం ఉపాది కూలి పని చేసేవారికి వేసవిలో అదనపు భత్యం ఇచ్చేవారు. మూడేండ్లుగా ఆ ఊసే లేదు. ఇదెక్కడి అన్యాయం అని అధికారులను అడిగితే పై నుంచి ఆదేశాలు రాలేదంటున్నారు.

- కొమురయ్య, తాడిచెర్ల

వసతులు కల్పించాలి



ఉపాధి పనులు చేసే చోట సౌకర్యాలు కల్పించడం లేదు. అధికారులు పర్య వేక్షణకు వచ్చినప్పుడు వారికి చెప్పినా ఏర్పాటు చేయడంలేదు. ఎండలు ముదరకముందే ఏర్పాట్లు చేయాలి. లేకుంటే వడ దెబ్బకు కూలీలు తట్టుకోలేరు.

- అక్కల బాపు, ప్రజా సంఘాల నాయకుడు

డీఎడ్ జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎడ్ (డీఈఐఈడీ) ప్రథమ సంవత్సరం ఫలితాల్లో అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల చాలా కాలేజీల్లో విద్యార్థులు ఒకే సబ్జెక్టులో ఫెయిలయ్యారని తెలంగాణ డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం తెలిపింది. ఆ సబ్జెక్టుకు సంబంధించిన జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు వచ్చి కేవలం ఒక సబ్జెక్టులోనే వందల మంది విద్యార్థులకు తక్కువ రావడం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఇలా జరిగిందా? లేదా అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల జరిగిందా? అనేది ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో టెట్, డీఎస్సీ నిర్వహిస్తున్నందున విద్యాశాఖ అధికారులు త్వరగా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మీ గవర్నర్ ఏం చేస్తున్నారు?

- ఆర్.ఎన్.రవి తీరును తప్పుబట్టిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తనపై ఉన్న నేరారోపణను ఉన్నత న్యాయస్థానం సస్పెండ్ చేసిన తర్వాత కూడా ఎమ్మెల్యే కె. పొన్ముడిని తిరిగి మంత్రిగా చేర్చుకోవడానికి రవి నిరాకరిస్తున్నారు. ఈ విషయంలోనే సర్వోన్నత న్యాయస్థానం పై విధంగా స్పందించింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ ఆలస్యాన్ని దష్టిలో ఉంచుకొని.. భారత అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణిని ఉద్దేశిస్తూ "మీ గవర్నర్ ఏమి చేస్తున్నారు?" అని అడిగారు. "అత్యున్నత న్యాయస్థానం నేరారోపణపై స్టే విధించింది. గవర్నర్ ఆయనతో ప్రమాణం చేయించనని చెప్పారు. మేము కొన్ని తీవ్రమైన పరిశీలనలు చేయవలసి ఉంటుంది. దయచేసి మీ గవర్నర్‌కు చెప్పండి. మేము దానిని తీవ్రంగా పరిగణించబోతున్నాము" అని సీజేఐ అన్నారు. ఎమ్మెల్యే నేరారోపణపై సుప్రీంకోర్టు స్టే విధించిన తర్వాత కూడా అతనిని(పొన్ముడి) మంత్రిగా తిరిగి చేర్చుకోవటం రాజ్యాంగ నైతికతకు విరుద్ధమని గవర్నర్ ఎలా చెప్పగలరని కూడా సీజేఐ ప్రశ్నించారు. పొన్ముడిని మళ్లీ మంత్రిగా నియమించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ చేసిన సిఫారసును ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ, జస్టిస్ జె.బి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో గవర్నర్‌పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసే పరిస్థితి ఏర్పడిందని సుప్రీంకోర్టు వివరించింది. తమిళనాడు ప్రభుత్వంతో ఈ ఒక్క విషయంలోనే కాదు.. గతంలోనూ అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో గవర్నర్ విబేధించారు.

'ఉపాధి' వేతన పెంపుపై ప్రచారయత్నం

- ఎన్నికల నేపథ్యంలో దీనిపై ఆంక్షలు విధించాలి : ఈసీకి మాజీ బ్యూరోక్రాట్ ఇ.ఎ.ఎస్ శర్మ లేఖ

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) కింద వేతన స్థాయిలను పెంచటానికి ఇటీవల ఎన్నికల సంఘం కేంద్రానికి అనుమతినిచ్చింది. దీంతో, బీజేపీకి ఎన్నికల వేళ ఈ అంశాన్ని ప్రచారాస్త్రంగా మలుచుకునే అవకాశం ఉన్నది. దీంతో ఈ ప్రచార ప్రయత్నాలపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించాలని మాజీ బ్యూరోక్రాట్ ఇ.ఎ.ఎస్ శర్మ కోరారు. ఈ మేరకు ఈసీకి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వంపై ఆంక్షలు విధించాల్సిన అవసరం ఉన్నదని అందులో వివరించారు. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ప్రకారం సవరించిన వేతనాలను నోటిపై చేయడానికి ఎన్నికల సంఘం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు గురువారం అనుమతినిచ్చింది. శర్మ తన లేఖను భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధులకు పంపారు. " ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ)ని ఉల్లంఘిస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖ ఉద్దేశపూర్వకంగా లేదా ఇతరత్రా వివరాలను మీడియాకు ఇచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది" అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. దీనిపై అత్యవసరంగా దర్యాప్తు చేసి, అవసరమైతే తగిన చర్య తీసుకోవాలని కమిషన్‌ను శర్మ కోరారు.

వారికి 2 నెలల్లో రేషన్ కార్డులు అందించాలి

- ఈ-శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలసకార్మికుల విషయంలో సుప్రీంకోర్టు
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న వలస కార్మికుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ-శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న ఎనిమిది కోట్ల మంది వలస కార్మికులకు జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకి రాని వారికి రెండు నెలల్లోగా రేషన్ కార్డులు అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నిర్వహించే పోర్టల్ అసంఘటిత కార్మికులందరికి సంబంధించిన కేంద్రీకృత డేటాబేస్. దాని డేటాబేస్‌లో 28.6 కోట్ల మంది వ్యక్తులు ఉన్నారు. వీరిలో 20.63 కోట్ల మంది రేషన్ కార్డులను పొందగలరు. వలస కార్మికులకు రేషన్ కార్డులు అందించడానికి మూడు నెలల సమయమిస్తూ 2023లో అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పాటించటంలో విఫలమయ్యాయని న్యాయమూర్తులు హిమా కోహ్లి, అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం వివరించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం రేషన్ కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రేషన్ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని సామాజిక కార్యకర్తలు అంజలి భరద్వాజ్, హర్ష్ మందర్, జగదీప్ చోకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. ఈ మేరకు పైవిధంగా ఆదేశాలను జారీ చేసింది.

ఐబీఏ నూతన ఛైర్మెన్‌గా ఎంవీ రావు



న్యూఢిల్లీ : ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) నూతన ఛైర్మెన్‌గా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మాటమ్ వెంకట రావు నియమితులయ్యారు. గురువారం జరిగిన ఐబీఏ మేనేజింగ్ కమిటీలో ఆయన్ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మెన్ దినేష్ కుమార్, ఇండియన్ బ్యాంక్ ఎండీ ఎస్ఎల్ జైన్, సిటీ యూనియన్ బ్యాంక్ ఎండీ ఎన్ కామకొడి ఉన్నారు. అదే విధంగా బ్యాంక్ ఆఫ్ బహ్రేన్ అండ్ కువైట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, కంట్రీ హెడ్‌ను అసోసియేషన్ గౌరవ సెక్రెటరీగా ఎన్నుకున్నారు.

ఖమ్మం సీటుపై కయ్యం

- సామాజిక తరగతుల మధ్య పోరు
- తలపడుతున్న ముగ్గురు కీలక నేతలు
- తమ కుటుంబ సభ్యులకు ఇప్పించుకునేందుకు తీవ్రప్రయత్నాలు
- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంపీ సీట్లకు సంబంధించి అధికార కాంగ్రెస్‌కు ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. కానీ ఖమ్మం ఎంపీ సీటుపై కాంగ్రెస్‌లో కయ్యం ముదురుతున్నది. కమ్మ, రెడ్డి, ఎస్సీ సామాజిక తరగతుల మధ్య అంతర్గత పోరు నడుస్తున్నది. సీటు సాధించుకునేందుకు నేత మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. తమ కుటుంబ సభ్యులకు టికెట్ ఇప్పించుకునేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పైకి చూడడానికి తమ కుటుంబ సభ్యులకు అడుగుతున్నా...అది సామాజికంగా పై చేయి సాధించేందుకేనని తెలుస్తోంది.తన భార్య నందినికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు తన తమ్ముడు ప్రసాద్‌రెడ్డికి టికెట్ ఇప్పించేందుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా అంతే ప్రయత్నం చేస్తున్నారు.

అలాగే తన కొడుకు యుగాంధర్ కోసం తుమ్మల నాగేశ్వరరావు ప్రయత్నిస్తున్నారు. ఈ రకంగా ఒకే టికెట్ కోసం ముగ్గురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో వారిలో టికెట్ ఎవరికి టిక్కెట్ ఇవ్వాలో ఏఐసీసీ తేల్చుకోలేకపోతుంది. ఈమేరకు గురువారం రేవంత్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆ ముగ్గురితో భేటీ అయినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే మంత్రుల మధ్య సయోధ్య కుదిర్చే బాధ్యతను ఏఐసీసీ ఇంచార్జ్ మున్షీకి అప్పగించింది. దీంతో పాటు అభ్యర్థి ఎంపికకు శ్రీకారం చుట్టబోతున్నారని సమాచారం.

మరోవైపు భువనగిరి టిక్కెట్‌ను కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భార్యకు ఇప్పించుకునేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రయత్నిస్తున్నారు. వరంగల్ ఎంపీ స్థానం ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆ పార్టీ ఎంపీ పసునూరి దయాకర్‌కు ఖాయమైనట్టు తెలిసింది.

మిగతా చోట్ల అధిస్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో వేచిచూడాల్సిందే. మిగతా చోట్ల పెద్దగా ఇబ్బందులు ఏమీ లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ నాయకుల మధ్య తగాదాల్లేనట్టు, సీనియర్లు, జూనియర్ల మధ్య బేధాభిప్రాయాలూ లోపల మాత్రం పరిస్థితి గరం గరంగానే ఉన్నది.

వాట్సాప్‌లో వికసిత్ భారత్ మెసేజ్‌లు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

అది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఇసి చర్యలకు ఉప క్రమించింది. వాట్సాప్‌లో వికసిత్ భారత్ పేరుతో మెసేజ్‌లను తక్షణమే ఆపాలని కేంద్రానికి స్పష్టం చేసింది. ఈమేరకు గురువారం కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచీ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తోంది. అయినా, వికసిత్ భారత్ మెసేజ్‌లు రావడంపై కాంగ్రెస్ పార్టీ, టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వం పంపించే వికసిత్ భారత్ సమాచారం ఎన్నికల కోడ్ ఉల్లంఘించడమే అవుతోందని ఫిర్యాదు చేశాయి.

ఐదు రాష్ట్రాల్లో ఎస్పీ, మెజిస్ట్రేట్‌లు బదిలీ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నాలుగు రాష్ట్రాల్లో జిల్లా ఎస్పీలను బదిలీ చేసింది. జిల్లా మెజిస్ట్రేట్, ఎస్పీ హెూదాల్లో ఉన్న వారిని బదిలీ చేస్తూ ఈసీ గురువారం ఆదేశాలు జారీ చేసింది.

గుజరాత్, పంజాబ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో ఆ బదిలీలు జరిగాయి. గుజరాత్‌లోని చోటా ఉదయ్‌పూర్, అహ్మదాబాద్ రూరల్ జిల్లా ఎస్పీలు, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫజిల్కా, జలంధర్ రూరల్, మలేర్‌కోట్లా జిల్లా ఎస్ఎస్పీలను బదిలీ చేశారు. ఒరిస్సాలోని ధేన్‌కెనాల్ జిల్లా మెజిస్ట్రేట్, డియోఘర్, కటక్ రూరల్ జిల్లా ఎస్పీల బదిలీకి ఆదేశాలిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ మిడ్నాపూర్, జార్‌గ్రామ్, పూర్వా బర్ధమాన్, బీర్భమ్ జిల్లాలకు చెందిన జిల్లా మెజిస్ట్రేట్లను బదిలీ చేశారు. రాజకీయ ప్రజాప్రతినిధులకు బంధువులైన పంజాబ్ లోని బటిండా ఎస్ఎస్పీ, అస్సాంలోని సోనిట్‌పూర్ ఎస్పీ కూడా బదిలీ చేశారు.

కాసులు కురిపిస్తున్న చికెన్ వేస్ట్ దందా

- చేపలకు మేతగా వ్యర్థాలు
- కాలుష్యంలో నీలి సంపద
- బీఆర్ఎస్ హయాంలో లైసెన్స్‌లు
- మహబూబ్‌నగర్ నుంచి గద్వాలకు చికెన్ వేస్టేజ్
- గద్వాల నుంచి మహబూబ్‌నగర్‌కు చేపలు



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

చేప భోజనం రుచించని వారు ఉండరు. ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు సైతం సలహా ఇస్తుంటారు. కొవ్వులేని ఆహార పదార్థంగా చేపల మాంసాన్ని ప్రతి ఒక్కరూ తినాలని డాక్టర్లు సూచిస్తారు. చెరువులు, రిజర్వాయర్లలో పెరిగే చేపలు అత్యంత రుచికరంగా ఉంటాయి. అయితే, అదంతా గతం.. ఇప్పుడు మొత్తం చెరువులు చికెన్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. గద్వాల, అలంపూర్ ఇటిక్యాల ప్రాంతాల చెరువులలో చేపలకు ఆహారంగా చికెన్ నుంచి తీసిన వ్యర్థ పదార్థాలను వేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వివిధ చికెన్ సెంటర్లలో నుంచి వ్యర్థ పదార్థాలను తెచ్చి గద్వాల పరివాహక ప్రాంతంలోని చెరువుల్లో కలుపుతున్నారు. దీనంతటికీ ఆయా రాజకీయ పార్టీల నేతల కక్కుర్తే కారణం. అవి తిన్న చేపలను మనుషుల తినడం వల్ల క్యాన్సర్‌కు దారితీస్తుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

ప్రజల ఆరోగ్యం పట్ల చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు, నాయకులు ఆదాయమే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. చికెన్ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేయడానికి కాంట్రాక్టు లైసెన్సులు జారీ చేసి లక్షలు ఆదాయం పొందుతున్నారు. నూతన మున్సిపల్ చట్టం 2019 ప్రకారం.. ఇండ్లు, దుకాణాలు, రెస్టారెంట్ల నుంచి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో డిస్పోసల్ చేయాలి. వ్యర్థాలను ధ్వంసం చేయడం పురపాలక సంఘం యొక్క బాధ్యత. పై నిబంధనలను అనుసరించి గతంలో మాజీ మంత్రి, మున్సిపల్ ఛైర్మెన్ ఆదేశాలానుసారం పట్టణంలో వెలువడే చికెన్ వ్యర్థాలను తరలించేందుకు సీడీఎంఏ అనుసరించి ఎండార్స్‌మెంట్ చేసి శాస్త్రీయ పద్ధతితో డిస్పోసల్ చేసేందుకు ఒక లైసెన్స్ హోల్డర్‌కు అనుమతిచ్చారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఆ లైసెన్స్ హోల్డర్ చికెన్ వ్యర్థాలను తరలించడానికి గద్వాల చేపల వ్యాపారికి సబ్ లీజుకు ఇచ్చారు. అందుకు నెలకు రూ.రెండు లక్షలు సదరు లైసెన్స్ హోల్డర్‌కు ఇస్తున్నట్టు సమాచారం. చెరువుల్లో ఆ వ్యర్థాలను వేయడానికి అటు చెరువుల కాంట్రాక్టర్లు, ఇటు దుకాణాదారులతో మాట్లాడుకున్నారు. చికెన్ షాపులకు నెలకు 20 నుంచి 50 వేల రూపాయలు చెల్లిస్తున్నట్టు తెలిసింది. ఆ వ్యర్థాలను తిన్న చేపలు వేగంగా బరువు పెరుగుతున్నాయి. ఆ చేపలే గద్వాల నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తున్నాయి. వాటిని తినే వారు అనారోగ్యాలకు గురవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు.

అయితే, ఆ లైసెన్స్ గడువు మార్చి వరకు ఉండగా.. దాని కోసం కాంగ్రెస్ నాయకులు మూడు నెలలుగా ఎవరి ప్రయత్నాలు వాళ్ళు ముమ్మరం చేస్తున్నారని సమాచారం. కాగా, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ ఆనంద్ గౌడ్ ఈ విషయంలో చొరవ చూపి పాత లైసెన్సు రద్దు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో శుద్ధిచేసి ఎరువు తయారు చేసే వారికే లైసెన్సులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ వ్యర్థ పదార్థాల కోసం విధివిధానాలు ఏమీ లేవు

షకీలా, మత్స్య శాఖ ఏడీ - గద్వాల

చేపల చెరువులో చికెన్ వ్యర్థ పదార్థాలను వదులుతున్నారనేది మా దృష్టికి వచ్చింది. ఇలాంటి పదార్థాలు ఆహారంగా తీసుకున్న చేపలను తినడం అనారోగ్యమే. ఇలాంటి వ్యర్థాలను నియంత్రించాలనే విధివిధానాలు ప్రభుత్వం నుంచి మాకు ఏమీ రాలేదు. అయినప్పటికీ మా దృష్టికి రాగానే నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం.

పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలి

- వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తాం : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రెస్‌మీట్ పెట్టి వేతన సమస్య పరిష్కరిస్తున్నట్టు ప్రకటించాలని కోరారు. వేతనాలివ్వకుంటే ఏప్రిల్ తొమ్మిదో తేదీ తర్వాత చెప్పాపెట్టకుండా రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పెండింగ్ వేతనాలను ఇచ్చేదాకా గ్రామాల్లో జీపీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొనాలనీ, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పంచాయతీ కార్యాలయాల ముందు నినాదాలతో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికులకు వారి ఖాతాల్లోనే వేతనాలు వేయాలని సూచించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలనీ, కార్మికులకు ఇన్సూరెన్స్, బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. గత సర్కారు మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించకూడదనీ, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడిని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనరేట్‌ను వందలాది మంది జీపీ కార్మికులు ముట్టడించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకు యూనియన్ ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. వేతన సమస్య తీవ్రతను నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కార్మికుల బృందానికి డిప్యూటీ కమిషనర్ హామీనిచ్చారు.

ముట్టడినుద్దేశించి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ ఉందని ధర్నాలు చేయొద్దంటారా? ఏడు నెలల నుంచి వేతనాలు ఇవ్వాలని తెలియదా? ఎట్ల బతుకుతారనే సోయి లేదా? నెలనెలా ఇచ్చే జీతానికి కోడ్‌తో సంబంధమేంటి? మేం ఏమన్నా గొంతెమ్మ కోరికలు అడుగుతున్నామా? అంటూ రాష్ట్ర సర్కారుపై ప్రశ్నల వర్షం కురిపించారు. 2014 నుంచి కేసీఆర్ వ్యవహరించిన తీరు వల్లనే పంచాయతీ కార్మికులంతా మూకుమ్మడిగా కాంగ్రెస్‌కు ఓట్లేశారని తెలిపారు. ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మీరు కూడా గత ప్రభుత్వం మాదిరిగా వుంటారా? కార్మికుల సమస్యలను పరిష్కరిస్తారా? అనేది ప్రభుత్వమే తేల్చుకోవాలన్నారు. ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం కాదు జీతాల్లేక పూట గడవటం కోసం ఇబ్బందులు పడుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. జీతాలు చెల్లించకుంటే పంచాయతీ కార్మికులు పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించబోరనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ఉత్పన్నమవుతున్న చెక్‌పవర్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, మతతత్వ బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. మోడీ సర్కార్ అధికారంలోకొచ్చిన ఈ పదేండ్ల కాలంలో ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం, కార్మిక చట్టాల్లో సవరణలు చేస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన బడ్జెట్‌ను పూర్తిగా తగ్గిస్తూ రాష్ట్రాలపై వదిలివేసిన తీరును వివరించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ.. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వమిచ్చిన రూ.5 లక్షల ఇన్సూరెన్స్, దహనసంస్కారాలకు రూ.10 వేల హామీని నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు మాట్లాడుతూ..రాష్ట్ర కమిటీ ఇచ్చే పిలుపుల్లో కార్మికులు పట్టుదలగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముట్టడిలో ఆ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పైళ్ల గణపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, కార్యదర్శులు వెంకటేష్ గౌడ్, బి. వెంకటేష్, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నారోజు రామ్‌చందర్, మండ్ల రాజు, కొప్పుల శంకర్, ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7
నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | మార్చి 22, 2024 | www.navatelangana.com

'ప్రత్యేక కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ప్రత్యేక కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు శ్రీ యెగ్గె మల్లేశం కురుమ, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఇటీవల విడుదల చేసిన గొల్ల, కురుమ కార్పొరేషన్ నుండి కురుమను వేరు చేసి ప్రత్యేక కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కురుమల బీసీ బీ 11 అలాగే యాదవులు బీసీ-డి 33 లోకి వస్తారని రాష్ట్రంలో యాదవులతో పోల్చుకుంటే కురుమలు అధిక సంఖ్యలో ఉంటారని చెప్పారు. కురుమ కార్పొరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి తమ కుల అభివృద్ధికి తోడ్పడాలని సీఎం కు వినతి పత్రం అందజేసి కోరమన్నారు. కోకాపేట్ లో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవనానికి పెండింగ్ పనులకు నిధులు విడుదల చేసి, పనులను పూర్తిచేసి త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరామ న్నారు. ఈ విషయాలపై సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ప్రాణాలకు తెగించిన తల్లీకూతురు..

నవతెలంగాణ-బేగంపేట



బేగంపేటలోని రసూల్ పూర జైన్ కాలనీలో ఒక షాకింగ్ ఇన్సిడెంట్ చోటు చేసుకుంది. గన్‌తో ఇంట్లోకి చొరబడిన అగంతకుడిని తల్లీకూతురు తరిమికొట్టారు. గన్‌తో బెదిరింపులకు పాల్పడినా ఏమా త్రం బెదరకుండా దుండగుడితో వీరోచితంగా పోరాటం చేసి.. చివరకు దొంగే భయపడి పారిపోయేలా చేశారు. ఈ వ్యవహారంగా అక్కడే ఉన్న సీసీటీవీలో రికార్డు అయింది. దాని సాయంతో తల్లీకూతురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసుల దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. కుటుంబ వివాదంగా పోలీసులు భావిస్తున్నారు. హెల్మెట్ పెట్టుకుని ఇంట్లోకి ప్రవేశించేందుకు వచ్చిన వ్యక్తి తెలిసిన వ్యక్తిగా భావిస్తున్నారు.



రూ.5లక్షల విలువైన ఫ్యాన్లు సీజ్

- నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



లోకసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌లోని పార్సెల్ ఆఫీసులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 199 కాటన్ బాక్సులలో 826 టేబుల్ ఫ్యాన్, సీలింగ్ ఫ్యాన్లు ఉన్నాయన్నారు. ఈ ఫ్యాన్లు (సరుకు) కు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో వాటిని సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసి ఫ్యాన్లను ఆగాపుర సిటిఓకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ బి . ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ ఫ్యాన్ల విలువ ఐదు లక్షల పైచిలుకు విలువ ఉంటుందన్నారు. ఎలాంటి పత్రాలు లేని వాటిని సీజ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కల్పన, రైల్వే కానిస్టేబుల్ సాయికుమార్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు ,షకిల్ పాషా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ చంద్రమౌళికు గౌరవ డాక్టరేట్ ప్రధానం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా ప్రముఖ కవి విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళికీ ఫ్రెండ్షిప్ మినిస్ట్రీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. రామకృష్ణ చంద్రమౌళి సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన దాశరథి రంగాచార్యులు లాగా ప్రజల వైపు ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి. ముఖ్యంగా ఈయనలో కనిపించిన మంచి గుణాలు, ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునే స్వభావం కలిగిన మనిషి చిన్నతనం నుండే కవితలు రాయడం, పాటలు రాయడం ఈయన దినచర్య. వారు రాసిన కవితలు ఆ రోజుల్లోనే ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి తదితర పత్రికల్లో అచ్చయ్ వచ్చేవి. ఇలాంటి వ్యక్తికి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. ఈ డాక్టర్ అవార్డు అందుకున్న రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ నా పైన మరింత బాధ్యత పెరిగిందని సమాజం పట్ల సాహిత్యం పట్ల బాధ్యతతోమెలుగుతానన్నారు. నల్లకుంటలో శ్రీధర్ ప్లాజాలో అందరూ కలిసి రామకృష్ణ చంద్రమౌళి యొక్క గొప్పతనాన్ని కొనియాడారు. అనేక సేవా కార్యక్రమాలు సాయితీ సేవలు, సమాజ సేవలు చేసుకుంటూ మా మధ్యలోనే ఉంటూ గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఎంతో సంతోషమని వారు ఆనందం వ్యక్తం చేశారు.

తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం అందుకున్న చేగోని రవికుమార్



నవతెలంగాణ-అంబర్‌పేట

గ్రంథాలయ రంగంలో విశేష సేవలు చేస్తున్నందుకుగాను సిటీ కాలేజ్ గ్రంథ పాలకుడు చేగోని రవికుమార్ తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం అందుకున్నారు. గురువారం నాంపల్లిలోని పిఎస్ తెలుగు యూనివర్సిటీలో జరిగిన కీర్తి పురస్కారాల ప్రధానంలో ఆయన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ టి.కిషన్ రావు, రిటైర్డ్ జడ్జి మంగారి రాజేందర్ ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయన గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. గ్రంథాలయ రంగంలో విశేష పరిశోధన చేస్తూ పురాతన చారిత్రక గ్రంథాలయాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన పని చేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఘంటసాల పాటలు ప్రసిద్ధి

- ప్రముఖ సినీ నటుడు సుమన్

నవతెలంగాణ-ముషీరాబాద్



ప్రముఖ సినీ గాయకులు ఘంటసాల పాడిన పాటలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో ఘంటసాల గంధర్వ గానామృత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ శరత్ చంద్ర, దాము గేదెల, ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రముఖ నటుడు సుమన్, హాస్యనటుడు శివారెడ్డి, న్యాయవాది వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సంద ర్భంగా www.idolgandharva.org వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ ఘంటసాల వివిధ భాషల్లో పాడిన అనేక గీతాలు ప్రపంచవ్యాప్తంగానూ ప్రాచుర్యం పొందాయన్నారు. వారి మధురమైన పాటలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకున్నాయని మనసుకు వినసొంపుగా ఉండే ఘంటసాల పాటలను ప్రతి ఒక్కరు ఆస్వాదించారని తెలిపారు. ఆయన సంగీత ప్రపంచానికే మకుటం లేని మహారాజని తెలిపారు. అనంతరం నిర్వా హకులు వక్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసాగర్, శ్రీనివాస్, డా.హరి, విజయలక్ష్మి, శివ రమ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర

నవతెలంగాణ-ధూల్‌పేట్



దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్యా విభాగం సంచాలకులు ఆచార్య జీ.వి. రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో 'సామాజిక సమ్మిళిత అభివృద్ధిలో మహిళల పాత్ర' అనే అంశంపై జరుగుతున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అసమానతలు తొలగిపోయినపుడే ఆదర్శ సమాజం ఏర్పడుతుందన్నారు. మానవ జీవితాన్ని మహోన్నతంగా నిర్మించడంలో మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. గృహానికి మహారాణి మహిళయేనన్నారు. ఆర్థిక సాధికారత మహిళలపైనే ఆధారపడి ఉన్నదని విశ్లేషించారు. న్యాయస్థానాల్లో, మహిళల ఆస్తి పంపకాలకు సంబంధించిన వ్యాజ్యాలే ఎక్కువగా ఉన్నాయని, దీనిని బట్టి మహిళలు ఎంత వివక్షను ఎదుర్కొంటున్నారో అర్థమవుతుందన్నారు. రాజకీయ రంగంలో మహిళలు గణనీయంగా రాణించేందుకు తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఉత్తర భారత దేశంలో మహిళలపై రాజకీయ అణచివేత కొనసాగుతుందని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డాక్టర్.విజయ ఖాదర్ మాట్లాడుతూ.. దేశంలో గ్రామం నుండి జాతీయ స్థాయి వరకూ విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే కీలక సంఘాల్లో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. స్త్రీ పురుషులిద్దరూ పరస్పరం గౌరవ మర్యాదలతో, సమానత్వ భావనతో జీవించాలన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త కైసర్ జమీల్ మాట్లాడుతూ.. మహిళాప్రగతితోనే సామాజిక సమ్మిళిత ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డాక్టర్. పి.పి. రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు కేవలం ముప్పయి శాతం రిజర్వేషన్ మాత్రమే సరిపోదని, వారి శక్తి సామర్థ్యాలను బట్టి ఇంకా ఎక్కువ అవకాశాలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు సమకూర్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సులో కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్.యం అనురాధ కీలకోపన్యాసం చేశారు. సభకు అధ్యక్షత వహించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. మహిళల సర్వతోముఖ వికాసానికి దోహదపడే అనేక జాతీయ సదస్సులు సిటీ కళాశాలలో తరచుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభలో ప్రారంభోపన్యాసం చేసిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్ల మాట్లాడుతూ.. మహిళయే తొలి ఆర్థికవేత్త యని, ఆది వైద్యురాలన్నారు. సదస్సు సంచాలకులు డాక్టర్. వి.శ్రీదేవి అంతర్జాతీయ సదస్సు ఆవశ్యకతను వివరించారు. సభలో వివిధ కళాశాలల, విశ్వవిద్యాలయాల ఆచార్యులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. పరిశోధనా పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఈ సందర్భంగా ఆచార్య జి.వి.రెడ్డి ఆవిష్కరించారు. అతిథులను ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ సత్కరించారు. డాక్టర్. ఈశ్వరయ్య, డాక్టర్.బెల్లి యాదయ్య, డాక్టర్.లక్ష్మి తదితరులు సాంకేతిక సదస్సుల్లో ప్రధాన వక్తలుగా ప్రసంగించారు. కళాశాల మహిళా సాధికార విభాగం సభ్యులు అవధానం సుజాత, డాక్టర్.నర్మద, టి.వేదవతి, డాక్టర్. సుదక్షిణ, డాక్టర్.కృష్ణవేణి తదితరులు మాట్లాడారు.

బీజేపీని గద్దెదించేందుకు ప్రతి ఒక్కరు పోరాడాలి

- శంభుల ఉషాశ్రీ శ్రీకాంత్ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీని గద్దెదించేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాలని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలంబ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు అన్నారు. గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయకుండా ఆల్ ఇండియా కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేసిన మోడీ సర్కార్‌ని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా దెబ్బతీయడానికి ఈ బీజేపీ సర్కార్ కుట్రపూరిత రాజకీయాలను చేస్తుందని ఇలాంటి చిల్లర వ్యవహారాలను చేయొద్దని హెచ్చరించారు. ఎలక్షన్స్ ముందు బీజేపీ పార్టీ హామీల పేరుతో మభ్యపెడుతూ మతం పేరుతో రాజకీయాలు చేస్తూ గెలవాలని చూస్తుందన్నారు. ఈ మోడీ సర్కార్ కి ప్రజలే రాబోయే కాలంలో జరిగే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పి ప్రధాని మోదీని గద్దె దించుతారన్నారు. మోడీకు హటావ్, దేశ్ కో బచావ్ అనే నినాదంతో మహిళా కాంగ్రెస్ ముందుకు వెళుతుందని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత, స్టేట్ జనరల్ సెక్రెటరీ అదితి స్వప్న, స్టేట్ ఆఫీస్ బేరర్స్ ,కాంసెన్సీ ప్రెసిడెంట్ , బ్లాక్ ప్రెసిడెంట్లు ,డివిజన్ ప్రెసిడెంట్ లు తదితరులు పాల్గొన్నారు.



'చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జీగా మైనుద్దీన్ పాషా'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ మైనుద్దీన్ పాషాను సమితి చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జీ గా ప్రకటించినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అండగా ఉన్న కాంగ్రెస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా దూదేకుల సామాజిక వర్గానికి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తనను సమితి చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జీగా ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గా రావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మెపా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా శీలం జ్యోతి ముదిరాజ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మెపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శీలం జ్యోతి ముదిరాజ్‌ను మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం) యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియామకం చేసి ఆ నియామక పత్రాన్ని జ్యోతి ముదిరాజ్‌కి అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అందించారు. ఈ సందర్భంగా శీలం జ్యోతి ముదిరాజ్ మాట్లాడుతూ.. జాతి అభివృద్ధి ఐక్యత కోసం అందరినీ కలుపుకుని ముఖ్యంగా మహిళ సాధికారత కోసం ముందుకు వెళ్తానని అలాగే ముదిరాజ్‌ల రిజర్వేషన్ సాధన కోసం కలిసి కట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ పదవి అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను కలిసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మెన్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సి.పి రాధాకృష్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపిన చైర్మెన్ మామిడి భీమ్ రెడ్డి, హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ సభ్యులు వీరమణి, ఎ. వి. రావు, పి. జ్యోతి, జిల్లా శాఖా యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ వి. మణిదీప్, సరోజినీదేవి కంటి ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్ కల్పన, జిల్లా శాఖ హెల్త్ క్యాంప్ కో కన్వీనర్ కల్పనా దత్త, వాలంటీర్లు సుజాత, సిద్దు తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే నీటి పొదుపును అలవర్చుకోవాలి

- తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ విజ్జులత

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



విద్యార్థి దశ నుంచే నీటి పొదుపును అలవర్చుకోవాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం విజ్జులత అన్నారు. గురువారం కోఠి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో "ప్రపంచ జల దినోత్సవం మార్చి -22" సందర్భంగా భూగోళ శాస్త్ర విభాగం, సామాజిక శాస్త్ర విభాగం సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత, గౌరవ అతిథిగా ఎన్విరాన్మెంటలిస్ట్ డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి విజ్జులత మాటాడుతూ.. ప్రపంచంలో రోజురోజుకీ నీటి ఆవశ్యకత, నీటి సంరక్షణకు ప్రాముఖ్యత పెరుగుతూ ఉందన్నారు. విద్యార్థి దశనుంచే నీటి పొదుపును అందరూ అలవర్చుకోవాలన్నారు. ప్రస్తుతం బెంగుళూరు నగరవాసులు అనుభవిస్తున్న టువంటి నీటి కరువును భవిష్యత్తులో ఏ నగరం కానీ, ఏ ప్రాంతం కానీ ఎదుర్కోకుండా ఉండాలంటే తక్షణమే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటిని పొదుపుగా వాడాలని ప్రతి ఒక్కరు వారి ఇంటిలో గాని కార్యాలయాల్లో గాని నీటి వృధా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని వారు సూచించారు. డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి మాటాడుతూ.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని , వర్షాలు సరిగా పడటం లేదని దానికి కారణం శీతోష్ణస్థితిలలో మార్పులన్నారు. పంటలు పండించే విధానంలో కూడా మనం మార్పులు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పుడు ప్రపంచ వాతావరణ మార్పుల గురించి, ప్రపంచ కరువు గురించి మనం చర్చించే సమయం దాటిపోయిందని, తక్షణమే ఆచరణ మొదలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూగోళ శాస్త్ర విభాగధిపతి డాక్టర్ ఆనంద్, సామాజిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవి, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ ప్రియ, మౌనిక, స్టాఫ్ డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయం

- మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్ కొండ దేవయ్య పటేల్

నవతెలంగాణ-ముషీరాబాద్



మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్ కొండా దేవయ్య పటేల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ప్రకటించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రులు శాసనసభ్యులకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో గురువారం బాగలింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. మున్నూరు కాపు రాష్ట్ర సంఘాలు 33 జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ ముఖ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ కొండా దేవయ్య పటేల్‌ను చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, ఆగ్రో చైర్మెన్ కాసుల బాలరాజు, సంగీత నాటక అకాడమీ చైర్మెన్ పుంజాల అలేఖ్య, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ,తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగల మహేష్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల రత్నాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద మున్నూరు కాపులకు లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గత రెండు దశాబ్దాలుగా మున్నూరు కాపు సమస్యలపై కృషి చేస్తున్న కొండా దేవయ్య పటేల్‌కు కార్పొరేషన్ చైర్మెన్ ఇవ్వాలని ఈ సందర్భంగా తీర్మానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఎడ్ల రవిపటేల్, తెలంగాణ మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ పటేల్, కన్వీనర్ చింతపండు మహేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్వి మహేందర్ పటేల్, పెద్దలు బూరుగు బావి హనుమంతరావు, ఓ బి సి చైర్మన్ తూము వినయ్, రాష్ట్ర కార్యదర్శి ముత్యాల రాజశేఖర్, గ్రేట్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ , మున్నూరు కాపు సంఘ రాష్ట్ర జిల్లా నాయకులు ఆకుల బాలకృష్ణ ,మామిడి అశోక్ ,రాయుడు పటేల్ ,యాదా క్రాంతి వల్లాల ప్రసాదరావు , తేళ్ల హరికృష్ణ, బాపట్ల మురళి ,కొట్టే మహేష్ తదితర ఆయా జిల్లాల అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌తోనే ప్రాణాలు పదిలం



- నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ గాండ్ల శంకర్ రాజు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్-సుల్తాన్ బజార్

ట్రాఫిక్ రూల్స్ పాటించడంతోనే ప్రాణాలు పదిలంగా ఉంటాయని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ గాండ్ల శంకర్ రాజు పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, ట్రాఫిక్ పోలీస్, రోడ్డు రవాణా శాఖలతో కలిసి నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా గురువారం నిజాం కళాశాలలో "రోడ్డు భద్రత అవగాహన-ట్రాఫిక్ రూల్స్"అనే అంశంపై సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ప్రతి ఏటా వేలాది మంది తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి వ్యక్తికి ప్రాణం ఎంతో విలువైందని, ప్రాణం విలువ తెలుసుకుని నియమ నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు.ఒక వ్యక్తి మరణిస్తే వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోతారనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు.కుటుంబ పోషణకు ఆధారమైన వ్యక్తి చనిపోతే వారి భార్యా, పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.తమ ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను హరించకుండా ఉండాలంటే ట్రాఫిక్ రూల్స్ పాటించడంతోనే సాధ్యమవుతుందన్నారు. ఆసుపత్రులు, అవస్థల పాలు కాకుండా ఉండాలంటే రోడ్డు భద్రతను అవగాహన చేసుకుని మసలుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.భీమా, నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఏ.ఆర్.విజయరావు, అబిడ్స్ ట్రాఫిక్ సీఐ రవి, ఎన్ఎస్ఎస్ నిజాం కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజుల, సుదర్శన్, స్టూడెంట్స్ అడ్వైజర్ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్ గంజ్ రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయానికి ఉద్యోగ అభ్యర్థుల తాకిడి

- విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు..
- గ్రంథాలయ ముఖ్య గ్రంథా పాలకులు ఏవిఎస్ రాజు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్





అఫ్జల్ గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి నిరుద్యోగ అభ్యర్థుల తాకిడి పెరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం పలు విభాగాల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తుంది. ఇప్పటికే గ్రూప్స్, పలు విభాగాల్లో ఉద్యోగ నోటిఫి కేషన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు అఫ్జల్ గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నారు. రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి అభ్యర్థుల తాకిడి పెరిగింది. రాష్ట్రంలో అతిపెద్ద విజ్ఞాన భాండాగారంలో వివిధ భాషల్లో ఇప్పటికే సుమారు 5 లక్షల పైచిలుకు పుస్తకాలు ఉన్నాయన్నారు. వీటికి అదనంగా పోటీ పరీక్షలకు సన్నతమైన అభ్యర్థులకు టెస్ట్‌బుక్స్, సెక్షన్ అందుబాటులో ఉంది. విశాలమైన ప్రాం గణం, నిశ్శబ్ద వాతావరణం లో అభ్యర్థులు ఇక్క డే ఉండి గంటల తరబడి చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతు న్నారు. నగరం నుండి కాకుండా శివారు ప్రాంతల నుండి ఇక్కడికి అభ్యర్థులు వస్తుంటారు. ఇక్కడే జీహెచ్ఎంసీ అందించే ఐదు రూపాయల భోజనం సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలు అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. టెస్ట్ బుక్స్ సెక్షన్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుంది. యువతీ, యువకులకు వేరు వేరుగా రీడింగ్ గదులు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి మెరుగుపరిచారు. పోటీ పరీక్షల కోసం వేలాది పుస్తకాలు అందుబాటులోకి రానున్నాయి కొత్త కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామని దినపత్రికల విభాగాన్ని కుదించి పోటీ పరీక్షలు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం కేటాయించామని అఫ్జల్ గంజ్ రాష్ట్ర కేంద్రం గ్రంథాలయం ముఖ్య గ్రంథ పాలకులు ఏవిఎస్ రాజు తెలిపారు.

8

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

శుక్రవారం | మార్చి 22, 2024 | www.navatelangana.com

వివేకానంద కళాశాల కో-ఆర్డినేటర్‌గా ఎస్.రవి ప్రసాద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వివేకానంద ప్రభుత్వ కళాశాల అంబేద్కర్ అభ్యాసకుల సహాయ కేంద్రం-129 నూతన కో ఆర్డినేటర్‌గా కళాశాల తెలుగు సహాయ ఆచార్యులు ఎస్.రవి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కోర్డినేటర్‌గా విధులు నిర్వహించిన డా.జె. చిన్నబాబు రవి ప్రసాద్‌కు స్వాగతం పలికి గరువారం బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా కొత్త కోర్డినేటర్ ఎస్. రవి ప్రసాద్ ను అధ్యాపకులు జె.చిన్నబాబు, డా. అనీల్ కుమార్, ఇ.నర్సింగరావు శాలువా లో సన్మానించారు. కోఆర్డినేటర్ రవి ప్రసాద్ మాట్లాడుతూ.. అభ్యాసకుల సహాయ కేంద్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంబేద్కర్ సహాయ కేంద్రం సేవలను అందరూ వినియోగించుకొని పట్టభద్రులు కావాలని కోరారు.

అల్వాల్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లోని ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.18 లక్షలు, 6 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా కాశ్యపిరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

పజ్జూరి కాశ్యపిరెడ్డి జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కమలానగర్ స్ఫూర్తి వారి ఆధ్వర్యంలో సాధన మెంటల్లీ ఛాలెంజ్ స్కూల్‌లోని 150 మంది పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్‌రెడ్డి, స్కూల్ యాజమాన్యం మధుసూదన్ రెడ్డి, సురేఖరెడ్డి, నాగన్న, మండ సురేష్, రాజేంద్రప్రసాద్, రాజు, వంజరి ప్రవీణ్, రవికుమార్, నాగేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులు దేవేందర్‌రెడ్డి, రజితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ పరిధిలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీని గురువారం ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా దమరపల్లి నర్సింహారెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా కీర్తి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చిలుకూరి అఖిలేష్, ప్రొఫెసర్ సీ.హెచ్. పరందాములు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కో-ఆర్డినేటర్‌గా దొమ్మటి కిరణ్ కుమార్‌రావును ఎన్నికయ్యారు. వారికి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని కోరారు. తమకు అవకాశం కల్పించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉప్పల్ నియోజకవర్గ చైర్మెన్ తాడూరి గగన్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సుదర్శన్ రెడ్డి, కన్వీనర్ బల్దేవ్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్ గౌడ్, కోశాధికారి జంగా సుదర్శన్, విభాగం ప్రధాన కార్యదర్శి బద్దినేని అనంతలక్ష్మి, సనత్ నగర్ నియోజకవర్గ చైర్మెన్ పూల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

విజయ హై స్కూల్ విద్యార్థి మరో ప్రభంజనం



- భారత రక్షణ దళంలో అధికారి విభాగంలో ఏవీ.సాయి రోహిత్

నవతెలంగాణ-కాప్రా

అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో స్థిరపడిన కాప్రా విజయ స్కూల్ విద్యార్థులు మరో మైలురాయిని అధిగమించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయ హై స్కూల్ విద్యార్థులు ఉన్నారు. తాజాగా మరో విద్యార్థి ఏ.వీ.సాయి రోహిత్ భారత రక్షణ దళంలో ఉన్నతాధికారి విభాగంలో ఉన్నత స్థానం దక్కించుకున్నారు. ఎన్‌సీసీ-యోగ్యతా పత్రాన్ని, ఎన్‌సీసీలో ప్రత్యేక అధికారుల శిక్షణ సంస్థ అలహాబాద్ వారు ఉన్నతాధికారిగా నియామక పత్రాన్ని అందజేశారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సాయి రోహిత్ మాట్లాడుతూ.. నేను ఈ స్థాయిలో ఉండడానికి విజయ హై స్కూల్ వేసిన గట్టి పునాది అని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్ మాట్లాడుతూ.. సాయి రోహిత్ లాంటి విద్యార్థులు పాఠశాలకు ఎంతో గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనకు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఎన్‌సీసీ అధికారి, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఈపీఎస్ కల్పించాలి



నవతెలంగాణ-కాప్రా

రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఈపీఎస్ సౌకర్యం కల్పించాలని డాక్టర్ ఏఎస్‌రావు నగర్ కమ్యూనిటీహాల్‌లో ఈసీఐఎల్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ శంకర్‌రావు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. పబ్లిక్, ప్రయివేట్ రంగ సంస్థల్లో రిటైర్డ్ అయిన ఉద్యోగుకు ఈపీఎస-95, నెలవారీ పెన్షన్ రూ.7500, మెడికల్ సదుపాయం కల్పించాలని నేషనల్ ఎజిటేషన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీలక్ష్మి కరవది, జనరల్ సెక్రటరీ రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ విబేధాలను పక్కనపెట్టి, అన్ని అసోసియేషన్స్ కలిసి పోరాడి హక్కులను సాధించుకుందా మని ఎన్ఏసీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. పెన్షనర్లను పట్టించుకోని ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 300 మంది వివిధ డిపార్టుమెంట్‌ల రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు.

లాల్ గడి మలక్ పేటలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-శామీర్‌పేట

శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేటలో గురువారం మెడిసిటీ హాస్పిటల్ (మేడ్చల్) వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలపై వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడిసిటీ హాస్పిటల్ మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమార స్వామి మాట్లాడుతూ... వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ వైద్య శిబిరంలో 132 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేసి ఆపరేషన్ అవసరమైన 33 మందిని గుర్తించి మెడిసిటీ హాస్పిటల్‌కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కారోబార్ రంజిత్, అభిలాశ్, డాక్టర్లు ఒమార్ ,అభిషేక్ , వైభవి , దివ్య , సమ్రాన్, నాగార్జున, పూజ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌మార్కెట్‌లో.. ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు

- ఇద్దరు నిందితుల అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఏసీపీ శివమారుతీ తెలిపిన వివరాల మేరకు సంగారెడ్డికి చెందిన గాడిలా సాయిగౌడ్, శిలంకోటి సాయి కుమార్‌లు సులువుగా డబ్బులు సంపాదించాలని అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. తాము 'బీనాన్స్‌క్రిప్టో ఎక్స్‌ఛేంజ్' నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. తాము చెప్పిన విధంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే అధిక లాభాలొస్తాయని నమ్మిస్తున్న నిందితులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఇదే తరహాలో బల్కంపేట్‌కు చెందిన ఓ వ్యక్తిని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్నారు. సిక్వోయా క్యాపిటల్ బిజినెస్ స్కూల్‌లో పెట్టుబడులు పెట్టాలని నమ్మించారు. పూర్తిగా నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా వివిధ బ్యాంక్ అకౌంట్స్‌లల్లో రూ.58,66,000లను ట్రాన్స్‌ఫర్ చేశాడు. తీరా మోసపోయిన తర్వాత తేరుకున్న బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులపై దేశంలోని వివిధ ప్రాంతాలల్లో 45 కేసులు నమోదు కాగా, తెలంగాణలో మూడు కేసులు నమోదైనట్టు తెలిపారు. నిందితులు ఇప్పటి వరకు రూ.13కోట్లు వసూళ్లు చేసినట్టు గుర్తించామని ఏసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్, ఎస్ఐలు కే.భవాణీ, శైలేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని.. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- రజక , బీసీ సంఘాల ఐక్యవేదిక డిమాండ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ దోబీఘాట్‌లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దోబీఘాట్ రజక సంఘం, మల్కాజిగిరి నియోజకవర్గం బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..10 రోజుల క్రితం జ్యోతి నగర్‌లోని దోబీఘాట్‌లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎంపీ రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌లకు వినతి పత్రాలు అందజేసి అనుమతి తీసుకున్నామని తెలిపారు. పది రోజుల క్రితం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు రెండు రోజుల క్రితం ధ్వంసం చేశారని పేర్కొన్నారు. తక్షణమే దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం, మల్కాజిగిరి పీఎస్ ముందు ధర్నా చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన అధికారులు దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు కామల్ల ఐలన్న, ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, రజక సంఘం అధ్యక్షులు పి. పాండు, ప్రధాన కార్యదర్శి ముదిగొండ లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీ కాసర్ల నాగరాజు, పి.లక్ష్మీనారాయణ, వి.ప్రవీణ్, వై. యాదగిరి, కె. శ్రీకాంత్, బీసీ సంఘం నాయకులు ఒగ్గు చంద్రశేఖర్‌రావు, కరణం గోపి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని అల్వాల్ హిల్స్ కాలనీలో మంచినీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని అల్వాల్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగాపురం కాలనీలోని జలమండలి కార్యాలయంలో మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో నీటి కష్టాలు మొదలయ్యాయని, మంచినీరు లో ప్రెషర్‌తో రావడం వల్ల సరిపోవడం లేదని తెలిపారు. జలమండలి సిబ్బంది నీటి సరఫరా వేళలు పాటించకుండా ఇష్టా వదులుతున్నారని ఆరోపించారు. నీటి కొరతతో ట్యాంకర్ల కోసం పరుగులు తీస్తున్నామని వాపోయారు. తాగు నీటి సమస్య పై ఫాదర్ బాలయ్య నగర్ లోని జలమండలి కార్యాలయంలో విజ్ఞప్తి చేశామని తెలిపారు. నీటి సమస్యను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జలమండలి జీఎం, సీజీఎంల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సభ్యులు నర్సింగ్ రావు, శ్రీనివాసరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి , రమేశ్, రాజారెడ్డి, రాకేష్, భాస్కర్, సంతోష్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నగరిగారి ప్రీతంను.. కలిసిన బాబు జగ్జీవన్ రావు కమిటీ సభ్యులు



నవతెలంగాణ-జవహర్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా పదవీ చేపట్టిన నగరి గారి ప్రీతంను జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బాబు జగ్జీవన్ రావు కమిటీ సభ్యులు గురువారం గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నాగరిగారి ప్రీతం మాట్లాడుతూ.. పదేండ్లుగా దళితులు ఆర్థికంగా వెనుకబడ్డారని, కాంగ్రెస్ ప్రజా పాలనలో దళితులకు ఆర్థిక స్వేచ్ఛ, అన్ని రంగాల్లో అభివృద్ధి అయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి భిక్షు, కర్ణాకర్, పాలపర్తి రవి, ఎర్ర రాము, గుగ్గిల శివ, న్యాలపెల్లి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత కామ్రేడ్ కిరణ్ మృతికి సంతాపం



నవతెలంగాణ-జవహర్‌నగర్

పీసీఐ(ఎం.ఎల్) మాస్ లైన్, ఇఫ్టూ కార్మికోద్యమ నాయకులు కామ్రేడ్ కిరణ్ మృతికి ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి, ఐపీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత, దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపకుడు మహ్మద్ రషీద్‌లు కిరణ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్‌లో ఉన్న తన నివాసంలో గురువారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆయన మరణం జవహర్ నగర్ ప్రజలకే కాక, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్‌కు, రాష్ట్ర కార్మికోద్యమానికి తీరనిలోటన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కిరణ్ పాత్ర, జవహర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడే వరకు రాజీలేని పోరాటాలు చేశాడని గుర్తు చేశారు.

ఘనంగా శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం



నవతెలంగాణ-ఘట్కేసర్

మండల పరిధిలోని ప్రతాప్ సింగారం గ్రామంలో గురువారం శ్రీ మల్లికా ర్జున స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి-కేతమ్మ, బౌరమ్మలను ఒగ్గు కళాకారులు సుందరంగా కల్యాణానికి ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో శామియా నాలు వేసి అన్ని ఏర్పాట్లు చేశారు. మల్లికార్జునస్వామి కల్యాణం గురించి వివరిస్తు డోలు వాయిద్యాలతో కళాకారులు అలరించారు. అమ్మవార్లకు జిలకబెల్లం, మాంగళ్యధారణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు కట్నకానుకలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,చంద్రకళ దంపతు లు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమా న్ని యాదవ సంఘం సభ్యులు బాలగోని నర్సింహ్మా, ఎల్లయ్య, అంజయ్య యాదవ్, మల్లేష్, రవి, చంద్రమౌళి తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నాయకులు ప్రభాకర్ గౌడ్, బద్దం కుమార్. చంద్రశేఖర్, జంగయ, బాలకృష్ణ, వెంకటేష్‌యాదవ్, మహంకాళి, మహిళలు పాల్గొన్నారు.

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో .. కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయంతో ఓ బాలుడు ఫుడ్ పాయిజన్ గురైన సంఘటన మేడ్చల్ చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసముండే మణికంఠ ఈనెల 18వ తేదీన రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో వివిధ ఆహార పదార్థాలను కొనుగోలు చేశాడు. కాగా మార్కెట్‌లో కొనుగోలు చేసిన బ్రెడ్‌ను తన కొడుకుకు 19 తేదీన తినిపించడంతో వాంతులు, విరేచనాలు చేసుకొని అస్వస్థతకు గురయ్యాడు. సదరు బ్రెడ్ ప్యాకెట్‌పై కాలం చెల్లిన తేదీ ఉండడంతో పాటు బూజు పట్టి ఉంది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలం చెల్లిన బ్రెడ్ ఇవ్వడంతో రత్నదీప్ సూపర్ మార్కెట్ సిబ్బందిపై సదరు వినియోగదారుడు మణికంఠ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు, స్థానిక మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పలు సూపర్ మార్కెట్లు, హెూటల్ పై తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సీడ్ హెల్త్ ల్యాబ్ ఏర్పాటుతో నాణ్యమైన విత్తనాలు



- రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు
- సీడ్ హెల్త్ ల్యాబ్‌ను ప్రారంభించిన వ్యవసాయ శాఖ అధికారులు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో ఉన్న సెంజెంటా కంపెనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీడ్ హెల్త్ ల్యాబ్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ గోపి, కేంద్ర వ్యవసాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీవాస్తవ, సెంజెంటా ఆసియా పసిఫిక్ అధికారి నిషింత్ భాటియా, గ్లోబల్ హెడ్ ఎరిక్ పోస్టిమాలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు మాట్లాడుతూ రైతులు పండించే విత్తనాలలోని వైరస్‌లను గుర్తించి నాణ్యత ప్రమాణాలను పెంపొందించడానికి సీడ్ హెల్త్ ల్యాబ్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ల్యాబ్ పరీక్షల్లో పాసైన విత్తనాలను రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా రైతులకు విక్రయిస్తారని తెలిపారు. రైతుల పండించిన ఇతర విత్తనాలను ఈ ల్యాబ్ సర్టిఫికేషన్ ద్వారా యూరప్ ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి వీలుంటుందన్నారు. సీడ్ ల్యాబ్ ఏర్పాటు అనేది రాష్ట్ర వ్యవసాయ రంగంలో ముఖ్యమైన ఘటనగా తెలిపారు. ఇలాంటి ల్యాబ్‌లు గతంలో ప్రభుత్వ రంగంలోని సంస్థల్లో ఉండేవని ప్రస్తుతం ప్రయివేట్ సంస్థలు సైతం ఏర్పాటు చేయడం రాష్ట్ర వ్యవసాయ రంగం అభివృద్ధికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సెంజెంటా కంపెనీ ప్రతినిధులు మల్లయ్య, అనిత, జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ, మండల వ్యవసాయ అధికారి అర్చన, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి


మృతుడి (ఫైల్)

నవతెలంగాణ-జవహర్‌నగర్

మద్యానికి బానిసై, మత్తులో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బండారి రాజశేఖర్ తన కుటుంబంతో బాలాజీ నగర్‌లో నివాసం ఉంటు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. రాజశేఖర్ ప్రతి రోజూ మద్యం సేవించేవాడు. ఇటీవలే తన భార్య అమృత ప్రసవం కావడంతో తన తల్లిగారి ఇంట్లోనే ఉంటుంది. బుధవారం ఉదయం నుంచే రాజశేఖర్ మద్యం సేవించి, సాయంత్రం తన తల్లికి ఫోన్ చేసి మద్యం తాగేందుకు డబ్బు అడిగాడు. అప్పటికే మద్యం తాగి ఉండడంతో ఆమె డబ్బు ఇవ్వడానికి నిరాకరించింది. రాజశేఖర్ తన భార్యతో ఫోన్‌లో మాట్లాడి పడకగదిలోకి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం ఎంతకు లేవకపోవడంతో బెడ్‌రూమ్ తలుపు పగుటగొట్టి చూడగా రాజశేఖర్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో రాజశేఖర్ తండ్రి నర్సింగరావు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ శాడగొండ కరుణాకర్ రెడ్డి మేనకోడలు అనూష రెడ్డి , అజిత్ రెడ్డితో ఈ నెల 17 న మియాపూర్ లోని విశ్వనాథ గార్డెన్‌లో వివాహం జరిగింది. జగద్గిరిగుట్టలోని ఆయన స్వగృహంలో గురువారం జరిగిన వ్రతానికి మాజీ మంత్రి జానారెడ్డి హాజరై , నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శాడగొండ కరుణాకర్ రెడ్డి,కరుణ దంపతులు, అనూష తల్లిదండ్రులు వెంకట లక్ష్మి, రాం రెడ్డి, సోదరుడు అనిల్ రెడ్డి, సోదరి అర్చన, కుటుంబ సభ్యులు రజిత మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం కట్ట మైసమ్మ దేవాలయం, దుండిగల్ లోని సింగాపురం మైసమ్మ దేవాలయాలను గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి దర్శించుకుని, కట్టమైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, పాక్స్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్ మృతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ కాలనీకి చెందిన, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్ (లడ్డు) బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించి, మాట్లాడుతూ.. సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు అయిన దేవేందర్ లాంటి మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరం అని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి దేవేందర్ పార్టీ కోసం అత్యంత క్రియా శీలకంగా పనిచేసి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని గుర్తు చేశారు. పార్టీ పరంగానే కాకుండా, దేవేందర్ తనకు అత్యంత ఆత్మీయుడని, ప్రతిరోజు నా ప్రక్కనే ఉండే నా సోదరున్ని కోల్పోవడం బాధాకరం అని విచారం వ్యక్తం చేశారు. దేవేందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యం ప్రసాధించాలని, ఘన నివాళులు అర్పించారు.

ఐలమ్మ విగ్రహాన్ని దొంగిలించిన దుండగులు



- TRVS జిల్లా కమిటీ డిమాండ్

నవతెలంగాన-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జ్యోతి నగర్, దోబీ ఘాడ్ దగ్గర చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి, ఐలమ్మ విగ్రహాన్ని దొంగలించడం విడ్డూరమని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సౌదారం సుభద్ర, జ్యోతి ఉపేందర్ ఖండించారు. వీర తెలంగాణ పోరాటంలో క్రియాశీల ఉద్యమాన్ని నిర్వహించిన వీర వనిత తెలంగాణ తల్లిగా గుర్తించబడ్డ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని దొంగలించిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి ఐలమ్మ విగ్రహాన్ని పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

యువ పరిశోధకులు ప్రతి విషయాన్ని ఆలోచించి నేర్చుకోవాలి

- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



యువ పరిశోధకులు ప్రతి విషయాన్ని ఆలోచించి నేర్చుకోవాలని హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)లో గురువారం సైన్స్ అండ్ కల్చరల్ ఫెస్టివల్ సంయుక్త-2024 జరిగింది. ఈ కార్యక్రమానికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువశాస్త్రవేత్తలు లక్ష్యాలను చేరుకునే సమయంలో వైఫల్యాలు ఎదురైనప్పటికీ ప్రయత్నాలను వదులుకోవద్దని సూచించారు. హైదరాబాద్‌లో పబ్లిక్, ప్రయివేట్ పార్టనర్షిప్ (పీపీపీ) మోడల్లో మెట్రో నిర్మాణం చేస్తున్నప్పుడు తాము ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని, సున్నితమైన అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించామని వివరించారు. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టు చేపడుతున్నప్పుడు చాలామంది నిపుణులు ఇది మూర్ఖపు ఆలోచన అని, జింక్ ప్రాజెక్టుగా చెప్పారని, అయితే దీని విజయగాధను ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ ప్రాక్టీషనర్ల ప్రయోజనం కోసం ఇటీవల కేస్టడీగా తన జర్నల్లో ప్రచురించిందని మెట్రో ఎండీ గుర్తుచేశారు. యువశాస్త్రవేత్తలు వినూత్నంగా ఆలోచించాలని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని, దేశ పురోగతికి దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అజయ్‌ధర్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్రం పెరిగింది



నవతెలంగాణ-కల్చరల్

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర పెరిగిందని, గతంలో లాగా వంటింటికే పరిమితం కాక శాస్త్ర, సాంకేతిక వైజ్ఞానిక రక్షణ రంగాల్లో సైతం పాలు పంచుకుంటున్నారని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శశిశ్రీ అన్నారు. గురువారం శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై ఉజ్వల సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ నిర్వహణలో విశిష్ట సేవా రత్న పురస్కారాలు వివిధ రంగాల ప్రముఖులకు ప్రధానోత్సవ సభకు శశిశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేసేందుకు మనసు ముఖ్యమని, పదవులు కాదని పేర్కొన్నారు. శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ.. సమాజంలో మంచి భావాల వ్యాప్తికి సాంస్కృతిక సంస్థలు దోహదపడతాయన్నారు. అనంతరం సంస్థ పక్షాన పురస్కారాలను పద్మ గోవర్ధన్, పొన్నం అంజలి, గాయని సాయి పావని,శివ శక్తులు ఆనంద్, శివాని బోర బండ నందులకు అందజేశారు. ప్రముఖ జ్యోతిష్య నిపుణులు శివ నరసింహన్ స్వామి, సామాజిక వేత్త వీర భోగ వసంత రాయలు, గాయనీ వీణ తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి తొలుత సాయి, పావని, గొల్ల కృష్ణ సినీ పాటలు మధురంగా ఆలపించారు.

భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి

- నేడు భగత్ సింగ్ వర్థంతి
- ఇబ్రహీంపట్నంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం
- వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

భగత్ సింగ్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు బి.శంకర్, పి జగన్ పిలుపునిచ్చారు. భా రత స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం తమ ప్రాణాలను తణప్రాయంగా అర్పించిన యువకిషోరాలు షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్థంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలి పారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని పాషా, నర హరి స్మారక కేంద్రంలో వర్థంతి వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో మెగా రక్తదాన శిబి రాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భగత్ సింగ్ స్ఫూర్తితో అందరికీ విద్య, ఉపాధి అవకాశాలకై డీవైఎఫ్ఐ, ఎస్ ఎఫ్ఐ ఉద్యమిస్తున్నాయన్నారు. పోరాటాల్లోనే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించటంలో కూడా ముందుం టామన్నారు. నేడు ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం, యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ నిర్మూలనకు ఈ నెల 23న మాసబ్ చెరువు నుంచి తుర్కయాంజాల్ వరకు 2కే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం ఇబ్రహీం పట్నంలో భారీ కాగడాల ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చెనమోని రాఘవేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మస్కు చరణ్, ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ఐ నాయకులు మద్దెల శ్రీకాంత్,తరంగ్, స్టాలిన్, వేణు, సుమంత్, పీహెచ్ శివ, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం గెలిచి

సీఎంకు బహుమతిగా ఇస్తాం..



- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 3 నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చి, యువత స్థితి గతులను మార్చి, మాట తప్పని ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లోని, తెలంగాణ ప్రభుత్వం నిలిచిందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లో అన్ని వర్గాల అన్ని ప్రాంతా ల అన్ని మతాల ప్రజలను కలుపుకొని 17కార్పోరేషన్‌లు ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణలో సమసమాజ స్థాపనకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారని బండి అన్నా రు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం సీఎం నివాసంలో మల్కాజిగిరి పార్లమెం టు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో రేవంత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బండి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన రూ. 7 లక్షల కోట్ల అప్పును తప్పులను సరిచేస్తూ పేద ప్రజల సంక్షేమం కోసం రేవంత్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాయకులు తెలంగాణ సంప దను దోచుకుతిన్నారని ధజమెత్తారు. మల్కాజిగిరి పార్ల మెంట్ నియోజకవర్గానికి పార్టీ తరపున ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ ఏకతాటిపై ఉండి గెలిపిస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ జెండా రెప రెప లాడేలా చేసిన రేవంత్‌కు మల్కాజిగిరి పార్లమెంటు సీటును గెలిచి బహుమతిగా ఇస్తామన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ను గొప్పగా పోరాట పటిమ చూపిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు అందర్నీ గుర్తించి గౌరవించాలన్నారు. ప్రభుత్వ పదవుల్లో వారికి పెద్దపేట వేయాలని బండి రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్ బస్ స్టేషన్‌ను ఆధునీకరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్‌లోని బస్ స్టేషన్‌ను ఆధునీకరించాలని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ శంషాబాద్ నేతలు విన్నవించారు. మంత్రిని కలిసి బస్ స్టేషన్ ఆధునికరించాలని కోరుతూ వినతి పత్రం అందజేయడంతో పాటు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జల్ పల్లి నరేందర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు కౌన్సిలర్ పీఎస్ సంజయ్‌యాదవ్ మాట్లాడుతూ శంషాబాద్ బస్ స్టేషన్ 1970 సంవత్సరంలో నిర్మించినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు, ఇతర ఆధునీకరణ చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరిందని అన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషా బాద్‌లో బస్ స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వానకాలంలో బస్ స్టేషన్ ప్రాంగణమంతా మురు గునీరు నిలిచి దుర్వాసనతో ఇబ్బందిగా మారుతుందని మంత్రికి విన్నవించినట్టు తెలిపారు. హైవేపై షాద్‌నగర్ వైపు వెళ్లే బస్సులు ప్రయాణికులకు బస్ షెల్టర్లు లేకపోవడం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రం గారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రాల నుంచి శంషాబాద్ బస్సులు వస్తుంటా యని అన్నారు. గత పాలకులు బస్ స్టేషన్ నిర్మాణం విషయంలో ఎలాంటి శ్రద్ధ చూపలేదని కనీస సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. లక్షల రూపాయల ఆదాయం కలిగిన శంషాబాద్ బస్ స్టేషన్ కనీస సౌకర్యాలకు కూడా నోచుకోని పరిస్థితిలో ఉందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించిన కాంగ్రెస్ ప్రభుత్వం బస్ స్టేషన్ కూడా ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. షాద్‌నగర్ వైపు వెళ్లే వాహనదారులకు ప్రయాణికులకు బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని తాగునీటి సౌకర్యం ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి బస్ స్టేషన్ ఆధునీకరణకు సాధ్యమైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచాల గణేష్, ప్రసాద్ నాగరాజు, మనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులుచెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

- పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ కుల్కచర్ల

ప్రతి ఒక్కరు తమ ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఇంటి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. అందరి సహకారంతోనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. విధిగా పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో గెలిపించాలి

- బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డి

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి కోరారు. గురువారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకెపల్లి చైతన్యవంతమైన గ్రామమని, అత్యధికంగా విద్యా వంతులు ఉన్న గ్రామమన్నారు. ఈ ఊరు నుంచి చాలామంది జర్నలిస్టులు ఉన్నారన్నారని, మీరంతా ఆలోచించి ఓటు వే యాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం, జాయింట్ కన్వీనర్ సింగపురం రమేష్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతా పరెడ్డి, సంకే పల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ రెడ్డి, వికారాబాద్ ఎస్సీ మోర్చా కాలయ్య, రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, మరల అధ్యక్షులు రాములు గౌడ్, వైభవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు కట్టలేదని పిల్లలకు శిక్ష

- పాఠశాల పని వేళల్లో బయటకు పంపిన వైనం
- ఇంటికి పంపించాలని డ్రైవర్లకు హుకుం
- ఎర్రటి ఎండలో బస్సులోనే చిన్నారుల నిరీక్షణ
- ఇబ్రహీంపట్నం ప్రియాంక పాఠశాల యాజమాన్యం నిర్వాకం

రూ.11 వేల బిల్లు కట్టలేదని..

జాపాల గ్రామానికి చెందిన హిందూజా రెండో తరగతి చదు వుతోంది. ఈ విద్యార్థిని స్కూల్ ఫీజు రూ.7000 బస్సు ఫీజు రూ4000 కలిపి మొత్తం రూ.11వేలు చెల్లించా ల్సి ఉంది. కానీ పాఠశాల ముగిసే సమయానికి 'మా నాన్న ఫీజు చెల్లిస్తాడని చెప్పినా వినిపించుకో కుండా బయటకు పంపించారు'. అని ఆ విద్యార్థిని వాపోయింది.

రూ.6వేల కోసమే బయటకు..

అదే గ్రామానికి చెందిన మరో విద్యార్థి తపస్వి ఐదవ తరగతి చదువుతోంది. తన తమ్ముడు రిషి నా లుగో తరగతి చదువుతున్నాడు. ఈ ఇద్దరికీ కలిపి రూ.6000 ఫీజు చెల్లించాల్సి ఉంది. కేవలం రూ. 6000 ఫీజు చెల్లించలేదన్న నెపంతో ఆ ఇద్దరు విద్యార్థులను పాఠశాల బయటకు పంపిం చేశారు. సుమారు 20 మంది విద్యార్థులతో కలిసి ఎర్రటి ఎండలో పార్కింగ్ స్థలంలో నిలుచున్న బస్సుల్లో పడిగాపులు కాశారు. పాఠశాల ముగిసే సమయానికి ఫీజు చెల్లిస్తామని చెప్పిన వినిపించుకోకుండా తమను టీచర్లు బయటకు పంపించారని ఆ విద్యార్థిని ఆగిపోయింది.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ప్రయివేట్ పాఠశాలల ఆగడాలు రోజు రోజుకూ శృతి మించుతున్నాయి. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పరీక్షలు వచ్చే సమయానికి ఫీజులు చెల్లించలేదంటూ విద్యార్థులను ఇంటికి పంపించడం లేదా? వారికి పనిష్‌మెంట్ ఇస్తు న్నారు. దీంతో విద్యార్థులు అవమానాలకు గురవుతున్నా రు. ఎర్రటి ఎండలో బయటకు పంపిస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ప్రియాంక ప్రయివేట్ పాఠశాలలో ఇలాంటి ఘటనే గురువారం చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రియాంక ప్రయివేట్ పాఠశాలలో చదివేందుకు కందుకూరు మండలంలోని కొనలగూడ, మంచాల మండలంలోని తిప్పాయిగూడ, జాపాల, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోచారం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలకు వస్తుంటారు. అయితే ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఫీజులు కట్టలేదన్న నెపంతో వారిని పాఠశాల పని దినాల సమయంలోనే గేటు బయటకు పంపించారు. ఫీజులు కట్టని పిల్లలను బస్సులో పాఠశాలకు తీసుకు రావద్దని చెప్పినప్పటికీ డ్రైవర్ ఆ పిల్లలను స్కూలుకు తీసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిని యధావిధిగా తమ ఇండ్లలో దింపి రావాలని పాఠశాల బస్సు డ్రైవర్లకు యాజమాన్యం హుకుం జారీ చేస్తూ సుమారు 20 మంది పిల్లలను పాఠశాల బయటికి పంపించేశారు. గత్యంతరం లేక ఆ విద్యార్థులంతా ఎర్రటి ఎండలో పార్కింగ్ స్థలంలో నిలుచున్న బస్సుల్లో కూర్చుని ఎర్రటి ఎండలో మాడిపోయారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు నేరుగా మీడియాను ఆశ్రయించారు. పలువురు మీడియా ప్రతినిధులు జోక్యం చేసుకుని పాఠశాల పార్కింగ్ స్థలంలో నిలుచున్న ప్రయివేట్ బస్సుల్లో సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ విద్యార్థులతో మీడియా మాట్లాడే ప్రయత్నం చేసింది. తమ తల్లిదండ్రులు పాఠశాల ఫీజుతో పాటు బస్సు ఫీజు కట్టలేదని, అందుకే తమని పాఠశాల నుంచి బయటికి పంపించారని పిల్లలు కన్నీళ్ల పర్యంతమయ్యారు. మీడియా ప్రతినిధులు వచ్చి విద్యార్థులతో మాట్లాడుతున్న విషయన్ని తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం చేరుకొని ఆ విద్యార్థులు అందరిని తిరిగి పాఠశాలకు తీసుకువెళ్లారు. ఫీజు కట్టలేని పిల్లల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఫీజు కట్టాలని కోరిన వినిపించుకోకపోవడం వల్లనే పిల్లలను బయటికి పంపించాల్సి వచ్చిందని పాఠశాల యాజమా న్యం చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. విద్యార్థులు పాఠ శాల ఫీజు కట్టలేదన్న నెపంతో విద్యార్థులను బయటకు పంపించడం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం మాత్రం నిర్లక్ష్యమైన సమాధానం చెప్పడం హాస్యాస్పదం.

ఇసుక అనుమతి ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- బషీర్‌మియా తాండ మాజీ సర్పంచ్ మిత్రు నాయక్

నవతెలంగాణ-తాండూరు

తాండూరు నియోజక వర్గంలో అవసరం ఉన్న పనులన్నీటికీ ఇసుక అనుమతులు ఇస్తామని ఉన్నత అధికారులు చెబుతున్నా స్థానిక అధికారుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బషీర్‌మియా తాండ మాజీ సర్పంచ్ మిత్రునాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారు లు అధికార పార్టీ వారికి ఒక విధంగా, ప్రతిపక్ష పార్టీల వారికి మరో విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. అధికార పార్టీ వారికి ఇష్టా రాజ్యంగా అనుమతులు ఇస్తూ తమకు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశా రు. గ్రామంలో 'మన ఊరు-మన బడి' కార్యక్రమం లో భాగంగా పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ పనులను చేద్దామంటే యాలాల మండల తహసీల్దార్ ఇసుక అనుమ తులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు అవస రం ఉన్న వారందరికీ ఇసుకను ఇవ్వకుండా వారికి నచ్చిన వారికి ఇసుక అను మతులు ఇస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అధికారులపై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఇసుకకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరిగి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈనెల 23 శనివారం పరిగి పట్టణ కేంద్రంలోని ఎస్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న సందర్భంగా కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసేందుకు ఈ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరిగి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ-పరిగి

ముఖ్యమంత్రి నివాసంలో మల్కాజిగిరి పార్లమెంట్ నాయకుల సమావేశం



నవతెలంగాణ- కంటోన్మెంట్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, బ్లాక్, మండల, మున్సిపల్, కార్పొరేషన్ అధ్యక్షులు సీనియర్ నాయకులు సమీక్షా సమావేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు చేయాల్సిన కార్యక్రమాలను వ్యూహాలను వెల్లడించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కంటోన్మెంట్ ఆశావాది గణేష్ పలువురు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

- ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజ్ ద్వారా రూ.80 లక్షల సహకారానికి సిఫారసు

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

ఈ నెల 17న వికారాబాద్‌లో యాక్సిడెంట్‌లో చనిపోయిన ఏఆర్ కానిస్టేబుల్ అగ్గనూర్ కృష్ణకుమార్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజ్ అకౌంటు ద్వారా రూ.80 లక్షల ఇన్సూరెన్స్ అర్హత ఉన్నం దున వారి కుటుంబానికి ఈ డబ్బులు ఇవ్వాలని సిఫారసు చేశామని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎ.విద్యాధర్ తెలిపారు. ఎస్‌బీఐలో శాలరీ ప్యాకేజీ ఉన్నందున ఈ అర్హత పొందాడని వారి కుటుంబానికి ఈ ఆర్థిక సాయం ఎంతో చేయూతనిస్తుందని వారు తెలిపారు. ఎస్‌బీఐలో జీతాలు తీసుకుంటున్న ఖాతాదారులకు ఇలాంటి సేవలు ఎన్నో అందిస్తు న్నామని తెలిపారు. రైతులకు క్రాప్ లోన్స్ వ్యాపారస్తులకు బిజినెస్ లోన్స్ వ్యక్తిగత రుణాలు బంగారంపై రుణాలు ఇచ్చి ఆర్థిక సహాయానికి తోడ్పడునందిస్తున్నామని, ప్రజలు సహకరించి బ్యాంకులను సరైన రీతిలో సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. సిబిల్ పడిపోకుండా రుణాలు సకాలంలో చెల్లిస్తే ఖాతాదారుల లావాదేవీలను బట్టి అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చునని వారన్నారు.

సమ్మె విరమించిన స్టోన్ క్రషర్స్ అసోసియేషన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ మంత్రి కోమటిరెడ్డి హామీతో సమ్మె విరమించినట్లు గురువారం ప్రకటించింది. బంజారా హిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు నందిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె విరమించి స్టోన్ క్రషర్స్ నేటి సాయంత్రం నుంచి తమ కార్యకలాపాల ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వపరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేనందున సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని మంత్రి చెప్పడంతోనే తాత్కాలికంగా సమ్మెను విరమించినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కరిస్తామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారన్నారు. తాము సమ్మె ప్రారంభించిన మొదటి రోజు నుంచే నిఘా వర్గాల ద్వారా సమాచారం సేకరించిన ప్రభుత్వం రెండు మూడు పర్యాయాలు తమతో మాట్లాడిందని చెప్పారు. సుమారు 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థలపై వేధింపులు సరికావని తాము చెప్పడంతో సానుకూలంగా స్పందించిందన్నారు. నిర్మాణ రంగంలో కీలక భూమిక పోషిసున్న తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మోహన్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి,వీరారెడ్డి,రాంరెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఆత్మగౌరవ కరపత్రాన్ని ఆవిష్కరించిన మందకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగల ఆత్మగౌర రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రం పత్రాన్ని గురువారం మందకృష్ణ మాదిగ ఆవిష్కరించారు. కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణను కలిసి మాదిగల ఆత్మ గౌరవ రౌండ్ టేబుల్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ బాబు మాదిగ, ఇటుక శ్రీ కిషన్ మాదిగ, అజిత్ కళ్యాణ్ వాల్మీకి రొట్టెల సునీల్ మాదిగ, విజయ ఇతరులు పాల్గొన్నారు.

చిట్ చాట్ చాయ్ టీ బార్ ప్రారంభం



నవతెలంగాణ-బంజారా హిల్స్

దేశంలోనే మొట్టమొదటి స్పెషాలిటీ టీ బార్, చిట్ చాట్ చాయ్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 4లో ఈ లాంచ్‌కు 'పేజ్3' సర్క్యూట్‌లోని సోషలైట్లు ఇతర ప్రముఖ అతిథులు హాజరై నిర్వహకులు పూర్ణ తేజ్ వల్లూరు, విద్యలతో కలిసి ప్రారంభించారు. కేఎల్ నారాయణ్, హరీష్ చంద్ర ప్రసాద్ యార్లగడ్డ, శ్రీదేవి చౌదరి, స్వాతి సంఘి, వినయ్ వంటి సామాజికవేత్తలు, ప్రముఖ అతిథులు అనేక మంది ఈ వేడుకకు హాజరయ్యారు. పూర్ణ తేజ్ వల్లూరు, విద్య మాట్లాడుతూ చిట్ చాట్ చాయ్ యూనిక్ కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేశామన్నారు.

జోష్ నింపిన ఎలక్ట్రికల్ ఫ్లాష్ మాబ్

నవతెలంగాణ-ఓయూ



నేటి నుండి 2 రోజుల పాటు జరిగే ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విద్యార్థుల టెక్నోనెన్స్ 2024 లో భాగంగా గురువారం విద్యార్థులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఫ్లాష్ మాబ్ కార్యక్రమన్ని నిర్వహించారు. నేటి నుండి జరిగే జాతీయ స్థాయి సింపొజియాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులు కోరారు. విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో స్టూడెంట్ కో ఆర్డినేటర్ ప్రో.బి.మంగు, విద్యార్థులు అభినవ్ రెడ్డి, భారత్, శివ, జోస్నా, సుప్రియ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.



తెలంగాణ నూతన గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను ఎన్‌యు రాజ్ భవన్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా చైర్మెన్ భీమ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కలిసి శాలువాతో సన్మానించారు. వారి వెంట నవీన్ యాదవ్, జ్యోతి, సాయినాథ్ యాదవ్ తదితరులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

- జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉండటం శుభ పరిణామం
- జర్నలిస్టుల సమస్యల పట్ల తనకు సంపూర్ణ అవగాహన ఉంది
- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి
- బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ పాత్రికేయుల మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల సానుకూలంగా ఉండటం శుభ పరిణామమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ పాత్రికేయుల మిత్ర బృందం ఆధ్వర్యంలో గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు కె.విరాహత్ అలీలకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ పాత్రికేయుల మిత్ర బృందం వారికి పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇండ్ల స్థలాలతో పాటు ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని, జర్నలిస్టులకు అది వర్తిస్తుందన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇతరుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కాకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పట్ల తనకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రక్రియ అనంతరం జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు లేదా గృహాల పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేస్తామన్నారు. ఇప్పటికే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు గుర్తు చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రతినిత్యం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి పరోక్షంగా జర్నలిస్టులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జర్నలిస్టులు అటు ప్రజలు, ఇటు ప్రభుత్వానికి వారధిగా నిలిచి, తమ వృత్తికి న్యాయం చేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నగరంలో వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తనకు తెలుసునని, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం చూపుతుందన్న సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శిగ శంకర్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులు ప్రతినిత్యం అసైన్మెంట్లు, ప్రెస్ మీట్ లు ఇతర వార్తల సేకరణను త్వరగా డెస్క్‌కు పంపాలని ఆఫీసు నుండి ఫోన్లు రావడం తదితర కారణాల వల్ల జర్నలిస్టుల కు పని భారం అధికం కావడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున త్వరితగతిన ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ జరిగే విధంగా చొరవ చూపాలని ఆయన మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డిని కోరారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం కార్యవర్గ సభ్యులు స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పుండరీ చారి, పాత్రికేయులు రామినేని దేవేంద్రప్రసాద్, గణేష్, వక్కల వెంకటేష్, మంచె సాగర్, టి.వెంకటేష్, సుభాష్ కృష్ణ, కొండా రాంబాబు, శ్రీనివాస్, మల్లేష్, ఉపేందర్, భూషణ్, దయాకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్షం లేకుంటే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రతిపక్షం లేకుంటే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థ కంగా ఉంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆయన 'ప్రతిపక్షం' దిన పత్రిక, డిజిటల్ మీడియాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మా ట్లాడుతూ ప్రతిపక్షం పత్రిక ఆకర్షణీయంగా, ఆదర్శనీయంగా ఉందని కొనియాడారు. ప్రతిపక్షం ప్రజలతో కలిసి ముందడుగు వేయాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రం, దేశంలో రాజకీయాలు ప్రమాదం అంచున ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా ఉన్న మీడియా ప్రజల భావాలను ప్రతిబింబించేందుకు నిరాకరిస్తున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిపక్షం ఎడిటర్ మహమ్మద్ ఫజుల్ రహమాన్, ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారులు దేవులపల్లి అమర్, బిఆర్.అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ విశ్రాంత ఆచార్యులు, ప్రొఫెసర్ ఘంటాచక్రపాణి, టీయూడబ్ల్యూజే, ఐజేయూ ప్రధాన కార్యదర్శి కె.విరహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలలో మాదిగలకు భవిష్యత్తు లేదు

- ఎమ్మార్పీఎస్ సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-బంజారా హిల్స్

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాదిగలకు భవిష్యత్తు లేదని ఆలోచించి నిర్ణయాలు తీసుకుని ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌లో కేవలం రెండు కుటుంబాలకు ప్రాధాన్యత ఉందని మల్లు అనంత రాములు, జి. వెంకట్ స్వామిలాంటి కుటుంబాలే తప్ప 75 శాతం మంది మాదిగలకు ప్రాధాన్యత లేదని మహబూబ్ నగర్ జిల్లాలో 85 ఉన్న మాదిగలకు టికెట్ ఎందుకు ఇవ్వలేదని సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి ఆయన సేవలు చేయలేదా? ఆయనకు టికెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. మాదిగల తరపున మాట్లాడితే.. మాలలు తన సీఎం కుర్చీకి ఎసరు పెడ్తారని ఆయనకు భయం పట్టుకుందన్నారు. మాల సామాజిక వర్గానికి కాంగ్రెస్‌లో గాడ్ ఫాదర్లు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత మల్లిఖార్జున ఖర్గే మాల సామా జిక వర్గం, కానీ మాదిగలకు కాంగ్రెస్ పార్టీలో గాడ్ ఫాదర్ లేరన్నారు. కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తుపై ఆలోచించి బీఆర్‌ఎస్‌లో 1 శాతం ఉన్నవారికి 4 మంత్రి వర్గ స్థానాలు, 10 మంది ఎమ్మెల్యేలు ఉన్న మాదిగలకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వనప్పుడే ఆ పార్టీలో భవిష్యత్తు లేదని స్పష్టం చేశారనీ చెప్పారు. తమిళనాడు నుంచి ఎమ్మెల్యేగా ఓడిన మురుగన్ మాదిగ జాతి బీజేపీ పార్టీ అతని సేవలను గుర్తిం చి కేంద్ర మంత్రి పదవి ఇచ్చారు. భ్రమలు మరిచి బీజేపీ పార్టీకి మద్దతు ఇవ్వాలని వర్గీకరణ ఖచ్చితంగా అమలు చేస్తారని పిల్లల ఎదుగుదల బాగుంటుందనీ భావిస్తే బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

వైభవోపేతంగా కోలాచల మల్లినాథసూరి వ్యాయసంగోష్ఠి



నవతెలంగాణ-ఓయూ:

సంస్కృత అకాడమీలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న మల్లినాథసూరి వ్యాయ సెమినార్ చాలా వైభవోపేతంగా ముగిసింది. భారతదేశంలోని పలు రాష్ట్రాల నుండి అనేకమంది విద్వాంసులు మల్లినాథుని వ్యాఖ్యానాలపైన, స్వయంగా రచించిన కావ్యాలపైన విస్తృతమైన పరిశోధన ప్రసంగాలు చేశారు. మహామహోపాధ్యాయ దోర్భల ప్రభాకర శర్మ ఆచార్య విద్యానంద ఆర్య, తిరుపతి వేదవిశ్వవిద్యాలయం డీన్ ఆచార్య పవన్ కుమార్ శర్మ మహామహోపాధ్యాయ నల్లగొండ పురుషోత్తమ శర్మ ఉస్మానియా విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ ప్రొ. రాములు ఇత్యాది ప్రముఖులు పాల్గొన్న ఈ సమావేశాలకు అకాడమీ డైరెక్టర్ ఆచార్య నీలకంఠం ఆధ్యక్షత వహించారు. తన కీలక సందేశంలో మొదటిరోజు మల్లినాథుని వ్యాఖ్యానాల గురించి, మల్లినాథుని స్వీయ రచనల గురించి వివరించి ఈనాటి యువసంస్కృత పండితులంతా ముందుకు వచ్చి ఇంకా విస్తృతమైన పరిశోధనలు చేయాలని సూచించారు. గతప్రభుత్వం మల్లినాథసూరి సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపించుటకు ప్రయత్నించినప్పటికి అది కార్యరూపం దాల్చలేదని ఇప్పటి ప్రభుత్వం చొరవ తీసుకుని సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపించాలని సెమినార్‌లో పాల్గొన్న పండితులంతా ప్రభుత్వాన్ని ప్రార్థించారు. ఆంధ్రప్రదశ్, కర్ణాటకలో మిగతా అన్ని రాష్ట్రాలలో సంస్కృతి విశ్వవిద్యాలయాలున్నాయని తెలంగాణాలో కూడ సంస్కృతి విశ్వవిద్యాలయం స్థాపిస్తే తెలంగాణాలోని ఉత్సాహవంతులైన విద్యార్థులందరికి సంస్కృతం చదువు కునే అవకాశం లభిస్తుందని అనేక సంవత్సరాలు కష్టపడి పీహెచ్‌డీలు చేసిన అనేకమందికి సంస్కృతంలో ఉద్యోగాలు లభిస్తాయని ఆచార్య నీలకంఠం అన్నారు. ప్రొ. రాములు మాట్లాడుతు వెనుకబడిన మెదకు జిల్లాలో జన్మించి సంస్కృత శాస్త్రాలన్ని అధ్యయనం చేసి ప్రపంచానికంతటికి సంస్కృత కావ్యాలను శాస్త్రాలను సులభతరం చేసిన మల్లినాథుపండితుణి సేవకు ప్రభుత్వాలు ఇంకా మహోన్నతమైన స్థానం కల్పించాలని సూచించారు. ఆచార్య విద్యానంద ఆర్య మాట్లాడుతు విద్యార్థి లోకం ఇంకా ప్రశస్తమైన కృషి చేయాలని తెలంగాణా విద్యార్థుల సంస్కృత ప్రతిభను లోకానికి తెలిసేలా కృషి చేయాలన్నారు. సంస్కృత అకాడమీలో మల్లినాథుని పీఠం నెలకొల్పి ప్రతి సంవత్సరం ఇటువంటి సెమినార్లు నిర్వహించాలని ఆచార్య పురుశోత్తమ శర్మ సూచించారు. మల్లినాథుని వ్యాయంపై నిర్వహించిన ఈ సంగోష్ఠి ఫలప్రదమైందని సెమినార్‌లో పాల్గొన్న పలువురు అధ్యాపకులు సంతృప్తి వ్యక్యం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ ముద్రించిన ఐదు విశేషమైన పుస్తకాలను లోకార్పణం చేశారు. డాక్టర్ కే వరలక్ష్మి. డాక్టర్ జోషీ సంతోష్ కుమార్ ఈ సెమినార్ నిర్వహించారని ఆచార్య నీలకంఠం తెలిపారు. సుమారు నలభై మందికి పైగా శోధపత్రాలు సమర్పించారని నిర్వాహకులు తెలిపారు.

బీసీ కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరిన బొల్లెపల్లి స్వామి గౌడ్



నవతెలంగాణ-ఓయూ:

గౌడ కార్పొరేషన్‌తో పాటు అన్ని బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ కోరారు. స్వామి గౌడ్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్పొరేషన్ కేవలం గౌడ కులవృత్తిదారులకు సంబంధించిన కార్పొరేషన్ మాత్రమే కానీ గౌడ కార్పొరేషన్ అనేది గౌడ కులం యొక్క సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే కార్పొరేషన్ అని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బొల్లేపల్లి స్వామి గౌడ్ వివరించారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన గౌడ కులస్తులు సుమారుగా 50 లక్షల పైచిలుకు జనాభాను కలిగి ఉన్నారని గౌడ కులం యొక్క సమగ్ర అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందించాలని కోరారు. గౌడ కార్పొరేషన్‌తో పాటు, అన్ని బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్ట పవన్, రాజశేఖర్, బద్రి, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బస్సు కిందపడి మహిళ మృతి

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రమాదవశాత్తు బస్సు కిందపడి మహిళ మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం అడిక్ మెట్ నల్లకుంట ప్రాంతానికి చెందిన గంద్ర లలిత (50) అనే మహిళ గురువారం సాయంత్రం సమయంలో అడిక్‌మెట్ నుంచి కుషాయిగూడ వెళ్లాలని అడిక్‌మెట్ నల్లకుంట పోలీస్ స్టేషన్ ఎదురుగా గల బస్ స్టాప్ వద్ద బస్సు కోసం వేచి చూస్తోంది. బస్సు రావడం గమనించిన లలిత కదులుతున్న బస్సులో వెనకాల నుంచి బస్సు ఎక్కడానికి ప్రయత్నించగా అదుపుతప్పి బస్సు వెనకల చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. నల్లకుంట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు.

డ్రాపౌట్స్ లేని సమాజం కోసం ఉచిత బ్రిడ్జి స్కూల్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మురికివాడల్లో చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థుల కోసం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్ హెచ్ ఎఫ్) ఆధ్వర్యంలో జల్‌పల్లిలో స్థానిక మసీదు సహకారంతో పహాడీ షరీఫ్ రోడ్, జల్‌పల్లి గేట్, అల్-అష్రఫ్ యునానీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మస్జిద్ ఈ-రెహ్మత్-ఈ-ఆలమ్‌లో మొదటి బ్రిడ్జ్ స్కూల్ ఏర్పాటైంది. ప్రైమరీ, మిడ్ స్కూల్ డ్రాపౌట్స్ కోసం ఉచిత బ్రిడ్జ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్‌లో ప్రాథమిక స్థాయి నుంచి మాధ్యమిక స్థాయి వరకు 110 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా సమీపంలోని మురికివాడల నుంచి బ్రిడ్జ్ స్కూల్ కోసం నమోదయ్యారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ నిర్వహించిన సర్వేలో హైదరాబాదులోని కొన్ని అర్బన్ మురికివాడలలో 27 శాతం మంది ముస్లిం పిల్లలు బడి మానేసినట్లు తేలింది. ఇదికాక ఐదు శాతం మంది ఎప్పుడూ హాజరు కాలేదని వెల్లడైంది. ఈ డ్రాపౌట్‌ల వెనుక ప్రధాన కారణాలు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించడంలో ఆర్థిక అవరోధాలు, రెండోది ఉపాధ్యాయుల కొరత అని తెలిసింది. ప్రభుత్వ పాఠశాలల లభ్యత, మౌలిక సదుపాయాలు తక్కువగా ఉండటంతో తల్లిదండ్రులకు అటువైపు చూసేందుకు ఇష్టపడటం లేదు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారీ మాట్లాడుతూ... ఈ స్కూల్ కు అర్హులైన ఉపాధ్యాయులు, కౌన్సెలర్లు కలరన్నారు. ఉచిత రవాణా సదుపాయం కలదన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఉడికించిన గుడ్లు, అరటి పండ్లతో కూడిన మధ్యాహ్నం అల్పాహారం ఇవ్వనున్నామన్నారు. పట్టణ మురికివాడల్లో మరిన్ని బ్రిడ్జ్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో వెనకబడిన పిల్లలను ప్రధాన విద్యలోకి తీసుకురాగలమన్న నమ్మకం ఉందన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

భారతీయ జనతా పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికునిలా పని చేయాలని కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజ కవర్గం పరిధిలోని జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్స్, కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ల సమావేశానికి కిషన్ రెడ్డి, డా. లక్ష్మణ్ లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్ మాట్లాడుతూ బూత్ స్థాయిలో బీజేపీకి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు మాట్లాడుతూ బీజేపీ అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమని గౌతమ్ రావు అన్నారు. ఈ సమావేశంలో బిజెపి నేతలు మహేందర్, శ్యామ్ సుందర్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, దీపక్ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు పట్టణ కేంద్రంలోని చంద్ర థియేటర్‌లో ప్రదర్శిస్తున్న రజాకార్ సినిమాను గురువారం తాండూరు మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ మహిళా మోర్చా నాయకు రాలు సాహు శ్రీలత లక్ష్మీకాంత్ ఆమె వార్డు ప్రజలతో కలిసి సినిమా చూశారు. -నవతెలంగాణ-తాండూరు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
శుక్రవారం | మార్చి 22, 2024 | www.navatelangana.com

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నార్సింగి నాయకులు



నవతెలంగాణ-గండిపేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని నార్సింగ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కలిశారు. గురువారం నగరంలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మాజీ డైరెక్టర్ కె.వేణుగౌడ్ కుమార్తె వివాహానికి రావాలంటూ సీఎంకు ఆహ్వానం అందించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎంను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు క్యాతం అశోక్‌యాదవ్, మాజీ సర్పంచ్ గండయ్య, ఓంప్రకాష్ రెడ్డి, ముంగి శిపాల్‌రెడ్డి, కె.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టీమ్స్ ఆస్పత్రి పనుల్లో వేగం పెంచాలి



- మహేశ్వరం మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలి
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగు
- సంబంధిత అధికారులకు ఆదేశాలు

నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టీమ్స్ హాస్పిటల్ పనులను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు, వైద్య ఆరోగ్య జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. టీమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్అండ్‌టీ ఇంజనీర్స్ వివరించారు. నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. హాస్పటల్ నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సెక్రటరీ ఆదేశించారు. ఈ పర్యటనలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టీమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమల థామస్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్ అండ్‌బీ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- రాజేంద్రనగర్ సీఐ కిరణ్‌కు ఆటో రంగ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-రాజేంద్రనగర్

తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికులు ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని వారికోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. గురువారం ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాజేంద్రనగర్ సీఐ కిరణ్‌కు ఆటో రంగ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరు తో ఉచిత బస్సు ప్రయాణం తీసుకురావడం వలన ఆటో కార్మికులకు గిరాకీ లేక తీవ్ర ఇబ్బందులకు, ఫైనాన్సులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులందరికీ కల్లుగీతా కార్మికుల మాదిరిగా ప్రతినెలా రుణ భృతి రూ. 4,500 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆరాంగర్ చౌరస్తా నుంచి మోహిదీపట్నం దగ్గర వరకు నడిపిస్తున్న ఆటో కార్మికులకు పర్మనెంట్ అడ్డా ఖాళీ సమయంలో సేద తీర్చుకోవడం కోసం షెడ్లు, మరుగుదొడ్లు, టాఫిక్ అధిక చలాన్లు తగ్గించాలన్నారు. ఆటో కార్మికులకు సమావేశాలు ఏర్పాటు చేసి నియమ నిబంధనలు సూచించాలన్నారు. లైసెన్స్ లేని ప్రతి ఆటో కార్మికుడికీ అధికారులతో మాట్లాడి లైసెన్సీ ఇప్పించే విధంగా చర్యలు తీసుకొని వారి సమస్యలు పరిష్కరించాలని సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రోడ్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కాలే రాజు, ఆరాంగర్ ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు ఎండి ఇమ్రాన్ భాయ్, ఎస్ రాజు, సల్మాన్, పి.వినోద్, ఎస్.కె ఖలీక్, శంకర్‌నాయక్, లోకేష్, ఆకాశ రాథోడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

- అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మెన్ చల్లా నరసింహారెడ్డి



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మెన్‌గా ఎన్నికైన చల్లా నర్సింహారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సీఎంను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బల్ రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల మౌనిక శ్రీశైలం, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కర్మాంఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ వెంకటేష్‌గౌడ్, విజయ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన

అప్పారి వెంకటస్వామి



- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య
- ఇబ్రహీంపట్నంలో 23వ వర్ధంతి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన అప్పారి వెంకటస్వామి జీవితం నేటి ఉపాధ్యాయ వర్గానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య అన్నారు. ఇబ్రహీంపట్నంలో వెంకటస్వామి 23వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలయ్య మాట్లాడుతూ.. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రస్థాపనలో అప్పారి వెంకటస్వామి కృషి మరువలేనిదన్నారు. తన 18 సంవత్సరాల సర్వీసుని త్యాగం చేసి ఉద్యమాన్ని పటిష్టం చేశారన్నారు. సమయ పాలన, ఆర్థిక క్రమశిక్షణలో ఈ తరం నాయకులకు ఆదర్శనీయులని కొనియాడారు. హెచ్ఆర్ఏ పెంపు ఏఏఎస్ సాధించడం, అప్రెంటీస్ రద్దు, 2002 డీఎస్సీకి ఓపీఎస్ సాధించడంలో అప్పారి కృషి మరువలేనిదన్నారు. ఆయన స్ఫూర్తితో రాబోయే కాలంలో విద్యారంగాన్ని కాపాడుకో వాలన్నారు. సీపీఎస్ రద్దు అయ్యే వరకూ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలన్నారు. 317 బాధితులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుగంధ, రాములయ్య, నాగేంద్రం, జిల్లా నాయకుల అర్జున్‌రెడ్డి, బొడ్డుపల్లి రాములయ్య, అజ్మత్ ఖాన్, ఇబ్రహీంపట్నం నాయకులు కిరణ్, రవి, శ్రీను, నర్సిహ, యాచారం నాయకులు నర్సింహ ధనరాజ్, మంచాల మండలాల నాయకులు జహీర్, బాలునాయక్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణం



నవతెలంగాణ-పరిగి

పరిగి పట్టణం బాలాజీ నగర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 37వ బ్రహ్మోత్సవాలు మూడవ రోజు కూడా ఘనంగా కొనసాగాయి. గురువారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం పూర్ణాహుతి నిర్వహించి అనంతరం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి-ఉమారెడ్డి దంపతులు, టీటీడీ బోర్డు మెంబర్ సీతారంజిత్ రెడ్డి కల్యాణంలో పాల్గొన్నారు. తాండూర్ ఎమ్మెల్యే బుయాని మనోహర్‌రెడ్డి, పరిగి మున్సిపల్ చైర్మెన్ ముకుంద అశోక్‌కుమార్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మస్కట్ పాలకేంద్రం మేనేజర్ బసవరాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ హరిప్రియ ప్రవీణ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు వేతు గోపాల్‌రెడ్డి యశోదమ్మ వారి జ్ఞాపకార్థం ముఖద్వారం నిర్మి స్తామని ప్రకటించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి పట్టణవాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
శుక్రవారం | మార్చి 22, 2024 | www.navatelangana.com

సీఎంను కలిసిన మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని గురువారం ఉదయం జుబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం బోకేను అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బాలింగని జంగయ్య, పన్నాల రాజేందర్ రెడ్డి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మానవతావాదులు ముందుకు రావాలి : నక్క అంజయ్య



నవతెలంగాణ - సంతోష్ నగర్

తల్లీదండ్రులను కోల్పోయిన ఓ బాలికను ఆదుకునేందుకు మానవతావాదులు ముందుకు రావాలని సీనియర్ అడ్వకేట్ నక్క అంజయ్య కోరారు. మాదన్నపేట చంద్రయ్య బస్తీకి చెందిన గోగుల దివ్య తల్లీదండ్రులు గోగుల సువర్ణ- శ్రీశైలం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న అడ్వకేట్ నక్క అంజయ్య ఆ బాలికకు తన వంతు సహకారం అందించేందుకు ముందుకువచ్చారు. ఈ మేరకు చంద్రయ్య బస్తీలో ఆ బాలికను కలిసి తన వంతుగా రూ.20000 ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం బాలు, వి. లింగయ్య, వి యాదయ్య, వికె నాగరాజు, ఎన్ వీరయ్య, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు
ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా

నవతెలంగాణ - చైతన్యపురి

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా అన్నారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం నందు గురువారం నిర్వహించిన వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డౌన్ సిండ్రోమ్ అనేది ఒక రకమైన జన్యు సంబంధమైన వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధి ఉన్న పిల్లల్లో సరైన ఎదుగుదల ఉండదు, ఆలోచననాశక్తి కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఒకరు ఈ డౌన్ సిండ్రోమ్ డిజార్డర్‌తో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి అనారోగ్య పరిస్థితిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా మార్చి 21న వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవంగా పాటిస్తారని తెలిపారు. అనంతరం డౌన్ సిండ్రోమ్‌తో భాదపడుతున్న పిల్లలకు విశేషంగా సేవలు అందిస్తున్న డాక్టర్స్ సుస్మిత, జయశ్రీ, రమాదేవిలను సన్మానించారు.

సమాజంలో మహిళలను గౌరవించాలి

- సీపీ తరుణ్ జోషి



నవతెలంగాణ - హయత్ నగర్

సమాజంలో మహిళలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో మహిళలను, బాలికలను, యువతులను వేధించిన ఆకతాయిల కుటుంబ సభ్యులతో రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ షీ టీం ఆధ్వర్యంలో గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎక్కడైనా ఎవరైనా వేధింపులకు గురి అయితే ధైర్యంగా షీ టీంకు ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు. 15 రోజుల్లో 121మంది ఆకతాయిలను షీ టీం పట్టుకున్నట్లు వెల్లడించారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, స్కూల్స్, కాలేజీలు, జనం రద్దీగా ఉండే ప్రాంతాలల్లో షీ టీం మఫ్టీలో నిఘా పెడుతున్నారని గుర్తుచేశారు. మొత్తం 121మంది ఆకతాయిలు...(మేజర్స్-64, మైనర్లు 57) గత నెల 16నుండి 29వరకు 130 ఫిర్యాదులు అందాయని షీ టీం డీసీపీ ఉషా తెలిపారు. ఫోన్ల ద్వారా 14మంది, వాట్సాప్ కాల్స్, మెసేజ్ ద్వారా 8 మంది, సోషల్ మీడియా యాప్స్ 20 మంది, నేరుగా 88 మంది ఆకతాయిలు వేధింపులకు గురిచేసిన వారు ఉన్నారన్నారు. వాటిలో 4క్రిమినల్ కేసులు, 63పిటీ కేసులు, 55మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఎవరినైనా వేధింపులకు గురిచేస్తే వాట్సాప్ రాచకొండ 8712662111 ద్వారా, లేదా ఆ ప్రాంత షీ టీం అధికారుల ఫోన్ నెంబర్లు భువనగిరి ఏరియా - 8712662598, చౌటుప్పల్ ఏరియా - 8712662599, ఇబ్రహీం పట్నం -8712662600, కుశాయిగూడ-8712662601, ఎల్బీనగర్ -8712662602, మల్కాజిగిరి -8712662603, వనస్థలిపురం ఏరియా-8712662604 నెంబర్లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో షీ టీం ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర కృషితో విజయాలు సాధించవచ్చు



- కళాశాల చైర్మన్ టి.ప్రేమ్‌నాథ్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

విద్యార్థులు చదువుతో పాటు నిరంతర కృషి, తపనతో ఎన్నో విజయాలు సాధించవచ్చని అక్మే డిగ్రీ కళాశాల చైర్మన్ టి.ప్రేమ్‌నాథ్ రెడ్డి అన్నారు. గురువారం అక్మే డిగ్రీ కళాశాలలో టెక్స్ అకాడమీ ద్వారా డిగ్రీ బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించడానికి అర్హులు గల విద్యార్థుల కోసం ఆన్లైన్ ద్వారా పోటీ పరీక్షను నిర్వ హించారు. ఈ పోటీ పరీక్షలో ఎంపికైన విద్యార్థులను చైర్మన్ ప్రేమ్‌నాథ్ రెడ్డి అభినందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉచిత కోర్సులు, ప్లేస్మెంట్ అందించే డ్రైవ్‌లు విద్యార్థుల సాంకేతికత, వికాసాని కోసం ఖచ్చితంగా సహాయపడతాయన్నారు. కోర్సులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగాలు, టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగులుగా ప్రవేశాలు కల్పిస్తామని మోహన్ దాస్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ తెలిపారు. ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు టెక్స్ అకాడమీ కళాశాల డైరెక్టర్ పి.రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూదాన్ యజ్ఞ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయండి



- తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు శంకర్ నాయక్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అన్యాక్రాంతమైన భూదాన భూములను రక్షించేందుకు, ఉన్న భూదాన భూములను పేదలకు పంపిణీ చేసేందుకు భూదాన్ యజ్ఞ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం నాంపల్లి(గాంధీ భవన్)లోని తెలంగాణ సర్వోదయ మండలి కార్యాలయంలో తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా మహాసభలు జరిగాయి. దీనికి మండలి సీనియర్ నాయకులు భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్. శంకర్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల విలువైన భూదాన్ భూములు బడా భూకబ్జాదారులు, మైహెూం రామేశ్వరరావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి వంటి భూబకాసురుల కోరల్లో చిక్కుకున్నాయని ఆరోపించారు. భూదాన్ భూములను ప్రయివేట్ భూములుగా చూపించి ధరణి పోర్టల్ లోనూ ఎక్కించారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లోని కోట్లాది విలువైన వేల ఎకరాల భూదాన భూములున్నాయని, ఆ భూములు కబ్జాల పాలవడంతోపాటు గత భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మెన్ గున్న రాజేందర్ రెడ్డి చట్టబద్ధత లేని పాత ప్రొసీడింగ్ తేదీలతో వందలాది ఎకరాలు కనుమరుగు చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేసి, భూముల కబ్జాలకు తెరలేపిందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి కబ్జాలకు గురైన భూదాన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని, జిల్లాలోని భూమి, ఇండ్లు లేని పేద ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు. ఇష్టారాజ్యంగా చట్టబద్ధత లేని పాత ప్రొసీడింగ్‌లతో అవకతవకలకు పాల్పడ్డ బోర్డు మాజీ చైర్మెన్ గున్న రాజేందర్ రెడ్డిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా రమేష్, గోవిందమ్మ, కార్యదర్శిగా యాదమ్మ, సహాయ కార్యదర్శులుగా విజయ, పరశురాముడు, ప్రత్యేక ప్రతినిధిగా భాస్కర్, కోశాధికారిగా పి.సూర్యంను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ మహాసభలో తెలంగాణ సర్వోదయ మండల్ రాష్ట్ర నాయకులు వై.గిరిప్రసాద్, మండలి సభ్యులు, జిల్లా నాయకులు యాదమ్మ, విజయ పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను మెజార్టీతో గెలిపిద్దాం

- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ

నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. గ్రీన్ హిల్స్ కాలనీ పార్టీ కార్యాలయంలో ఈ నెల 24న మీర్‌పేట్ ఎస్ వై ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న సన్నాక సమావేశంపై గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు అనుభవించి పార్టీ మారడం బాధాకరమన్నారు. వందరోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంతవరకు రైతు బంధు ఇవ్వలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో వేసిన 30000 ఉద్యోగ నోటిఫికేషన్‌లను తమ ప్రభుత్వమే నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చామనడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు రామాచారి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, దుబ్బాక శేఖర్, జగన్, వాజిద్ పటేల్, బాలు నాయక్, బుజ్జి బాయి, కల్పన, హేమ, రేవతి తదితరులు పాల్గొన్నారు.





పేదింటి ఆడబిడ్డల
పెళ్లిళ్లకు అండగా ఉప్పల ఫౌండేషన్

ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ - నాగోల్

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ అండగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ నిరుపేద కుటుంబానికి చెందిన రుచికా అమ్మాయి పెండ్లికి, నల్గొండ జిల్లా అంతంపేటకు చెందిన మల్లేశ్వరి, హైదరాబాద్, నాగోల్ బండ్లగూడ నిరుపేద కుటుంబానికి చెందిన శ్రావణి, వరంగల్, జనగాంకు చెందిన అమ్మాయి, మౌనిక వివాహాల కోసం సహాయ సహకారాలు అందించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు గురువారం నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్తను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్పందించిన ఉప్పల శ్రీనివాస గుప్త వెంటనే ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మాయిల కుటుంబ సభ్యులు, బంధువులు, ఉప్పల ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ హాస్పిటల్‌కు
రేడియో సిటీ అవార్డు

నవతెలంగాణ - చైతన్యపురి

'బెస్ట్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్' కేటగిరీలో నగరంలోని ప్రఖ్యాత ఓజోన్ హాస్పిటల్ రేడియో సిటీ అవార్డును గెలుచుకుంది. హైటెక్స్, హెచ్ఐసీయూ నోవాటెల్ హెూటెల్‌లో గురువారం 'రేడియో సిటీ' 'హైదరాబాద్ ఐకాన్ అవార్డ్స్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, హనుమాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ, సినిమా హీరో తేజ, నటుడు శివ బాలాజీలు హాజరయ్యారు. హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి చేతుల మీదుగా ఓజోన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కుమారి దీప్తి సాయి ప్రసాద్ ఆ అవార్డును అందుకున్నారు.



ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. అంతేకాదు మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓజోన్ హాస్పిటల్స్ చైర్మన్ బి.వి. సత్యసాయి ప్రసాద్, చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సి. హెచ్.శ్రీనివాసరావు, డైరెక్టర్ వై.మధుసూదన్ రెడ్డి, సినీ ప్రముఖులు, నటులు తదితరులు పాల్గొన్నారు.



48 గంటల్లో నిందితుడి అరెస్ట్



నవతెలంగాణ - నాగోల్

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 19న జరిగిన మల్లికార్జున్ అనే యువకుడి హత్య కేసును నాగోల్ పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. నిందితుడిని కూడా పట్టుకున్నారు. ఈ మేరకు నాగోల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ జోన్ ఏసీపీ ఏ.కృష్ణయ్య కేసుకు సంబంధించిన విషయాలను వెల్లడించారు. మృతుడు మల్లికార్జున్ తాగుడుకు బానిసై డబ్బుల కోసం అతడి స్నేహితులైన కొప్పుల అర్జున్ యాదవ్, కుంచెల ఓంకార్, మల్లెల మహేష్‌లను చంపుతానని బెదిరిస్తూ వేధించేవాడు. ఈ క్రమంలో వారిపై పలుమార్లు దాడి కూడా చేశాడు. వీళ్ల గతంలో గొడవలుపడిన ఘటనలపైన వివిధ పోలీస్ స్టేషన్ల లో కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. హత్య జరిగిన ముందు రోజు మృతుడు మల్లెల మహేష్‌పై దాడి చేసి గాయపరిచాడని తెలిపారు. ఈ క్రమంలో మల్లికార్జున్ నుంచి ఎప్పటికైనా ప్రాణహాని ఉంటుందని భావించిన ముగ్గురు పక్క ప్రణాళిక వేశారు. ఈ నెల 19న లక్ష్మి నరసింహా కాలనీలోని మూసీ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో మల్లికార్జున్ మద్యం సేవిస్తున్నాడని తెలుకొని వెళ్లి కత్తితో విచక్షణ రహితంగా పొడి అంతమొందించారని వివరించారు. దీంతో కేసు దర్యాప్తును వేగవంతం చేసిన నాగోల్ పోలీసులు గురువారం ఉదయం ఆరు గంటలకు ఆనంద్ నగర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలలో నిందితులు ఉపయోగించిన కారును గుర్తించారు. దానిలో ఉన్న వారిని విచారించగా నిందితుల ఆచూకి తెలియడంతో వెంటనే ముగ్గురి నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని విచారించగా చేసిన హత్యను ఒప్పుకున్నారని పేర్కొన్నారు. తదుపరి సాక్ష్యలతో సహా నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. ఇంత త్వరగా కేసును ఛేదించిన నాగోల్ సీఐ పరుశురాం, వారి సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

'చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్ ఈవో అంకమ్మరావు అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ దుర్గా భవాని నగర్ పరిధిలోని సంతోష్ నగర్ భాష్యం విద్యాసంస్థలు మూడు నుండి ఐదవ తరగతి బాలురకు నిర్వహించిన క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా అంకమ్మరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా నైపుణ్యం గల విద్యార్థులు చాలామంది ఉన్నారని, అలాంటివారిని గుర్తించి ప్రోత్సహించాలని వ్యాయామ ఉపాధ్యాయునికి సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అంతేకాదు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపి చురుకుదనాన్ని కలిగించి వారిలో పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. క్రీడల వలన క్రీడా స్ఫూర్తి, స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం వివిధ శాఖల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్లు

నవతెలంగాణ - బడంగ్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు జి.రంజిత్ రెడ్డిని గురువారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారు మనోహర్, రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డి, సేనావత్ బాలు నాయక్, ఎర్ర మహేశ్వరి జైహింద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. బోకేను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు కలసి కట్టుగా పనిచేసి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొనిరావాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మేయర్‌కు తెలియకుండా ఎంపీని కార్పొరేటర్లు కలవడం చర్చనీయంగా మారింది. వారి వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.





దేవాన్షి యాదవ్... 14 ఏండ్ల వయసులో యాసిడ్ దాడికి గురైంది. 18 ఏండ్ల వయసులో కుటుంబ స్నేహితుడి నుండి వేధింపులను ఎదుర్కొంది. ఇలాంటి బాధలు ఎదుర్కొన్న ఆమె ఆ కసి నుండి 26 ఏండ్ల వయసులో నోయిడాలో షహీద్ రామాశ్రయ్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించింది. ఒక బాంబు పేలుడులో అమరవీరుడైన తన తండ్రి జ్ఞాపకార్థం దీన్ని స్థాపించింది. లైంగిక వేధింపులు, గృహహింస బాధితులకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్‌ను అందిస్తోంది. జీవితంలో నొప్పిని, గాయాలను భరిస్తున్న వారికి ఆమె ఎన్‌జీఓ అభయ హస్తాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు ఆమె చేసిన అవిశ్రాంత కృషి 1,000 మంది జీవితాలను తాకింది. వారికి అవసరమైన వైద్యం చేయిస్తూ, న్యాయం కోసం పోరాడేందుకు మద్దతు అందిస్తుంది. అంతేకాదు భవిష్యత్తులో మెరుగైన జీవితాన్ని గడిపేలా వారిని శక్తివంతం చేస్తున్న ఆమెతో సంభాషణ...

ధైర్యం విసిరిన రాకెట్... దేవాన్షి

ఓ సంస్థ నడిపించాలనే ఆలోచన ఎలా వచ్చింది..?

నేను అనుభవించిన చేదు అనుభవాల నుండే నాకు ఈ ఆలోచన వచ్చింది. ఇక దీన్ని నడిపే ధైర్యం అంటే మా అమ్మే నాకు స్ఫూర్తి. నాకు తొమ్మిది నెలలు ఉన్నప్పుడు నాన్న చనిపోయాడు. ఒకవైపు భర్త చనిపోయిన బాధ, మరోవైపు బిడ్డను ఎలా పోషించాలనే బాధ ఇలాంటి ఆయోమయాలు ఆమెను చుట్టుముట్టాయి. ఆ రోజు ఆమె ధైర్యం కోల్పోయి ఉంటే ఈ రోజు నేను ఉండేదాన్ని కాదు. జీవితంలో ప్రతి సందర్భంలో ధైర్యంతో ముందుకు వెళ్లింది మా అమ్మ. ఒంటరి తల్లిగా తను పడ్డ బాధలు కండ్లారా చూశాను. అయినా ఓ తల్లిగా నాకు ప్రేమానురాగాలు పంచడమే కాదు ధైర్యం అనే విలువైన బహుమతిని ఇచ్చింది మా అమ్మనే. నా బాధల నుండి బయటపడేందుకే కాదు, నాలా మరో మహిళ హింసకు గురికాకూడదనే ఈ సంస్థను ప్రారంభించాను.

సంస్థ ముఖ్య ఉద్దేశం..?

'ఈ సమాజం నన్ను చిన్నచూపు చూస్తుంది. నాకు ఎవరూ అండగా లేరు' అనుకున్న ఎంతో మందికి 'నాకు ఎవరి అండా అక్కర్లేదు. ఒంటరిగా పోరాడగలను. నా కోసం నేను పోరాడలేనా' అనే ధైర్యాన్ని ఇవ్వడమే ముఖ్య ఉద్దేశం. 'ఇంకే ముంది నా భవిష్యత్ సర్వనాశనం అయ్యింది' అని జీవనాసక్తి కోల్పోయిన వారిలో కష్టాలు నీ ఒక్కదానికే కాదు అందరికీ వస్తాయి. అదిగో నీ భవిష్యత్ అంటూ ఆశావాహ దృక్పథాన్ని వారిలో నింపడం మా లక్ష్యం.



సంస్థ నడిపేటపుడు ఎదుర్కొన్న ప్రధాన సవాళ్లు ఏమిటి?

ప్రారంభించిన కొత్తలో ఫండింగ్ అనేది ఒక సవాలుగా ఉండేది. 'మీ వల్ల ఏమవుతుంది' అన్నట్లుగా ఎంతో మంది వ్యంగ్యంగా మాట్లాడేవారు. ఒక ఎన్‌జీఓ నడుస్తుందంటే దానిపై చాలా మందికి అనేక రకాల అనుమానాలు ఉంటాయి. ఇది నిబద్ధతగా నిర్వహించడుతుందా లేదా అనే సందేహాలు కచ్చితంగా వస్తాయి. అలాంటి ప్రశ్నలే నాకూ ఎన్నో ఎదురయ్యాయి. కొందరు నా దయా హృదయాన్ని బలహీనతగా కూడా భావించారు. ఇలాంటి వారందరికీ నా పనితోనే సమాధానం చెప్పాను. ఇంకా ఎన్నో సమస్యలతో ఎన్‌జీఓ కార్పొరేట్ ప్రపంచాన్ని నావిగేట్ చేయడంలో సవాళ్లను ఎదుర్కొంది. అయితే సేవ చేయాలి అనే నా ఆలోచన నిజానికి ఈ ప్రయాణంలో నా సూపర్ పవర్ అని నేను గ్రహించాను. దీని వల్ల ఇతరుల బాధలను లోతుగా అర్థం చేసుకోగలుగుతున్నాను.

మీరు చేస్తున్న కార్యక్రమాల వల్ల బెదిరింపులు ఏమైనా ఎదుర్కొన్నారా..?

చాలా ఎదుర్కొన్నాను. మా దగ్గరకు వచ్చే వాళ్ళలో 60 నుంచి 70 శాతం గృహహింస బాధితులే. వారికి అండగా నిలిచినప్పుడు సహజంగానే బెదిరింపులు ఎదురయ్యాయి. బరేలీకి చెందిన ఒక మహిళ విషయంలో ఆమె అత్తింటి వారు నన్ను బెదిరించేందుకు వీధి రౌడీలను కూడా పంపించారు. అయితే నేను వాటిని ఎప్పుడూ లెక్క చేయలేదు. మీకు ఇంత ధైర్య ఎక్కడి నుండి వచ్చింది అంటూ నా దగ్గరకు వచ్చిన బాధితులు చాలా మంది నన్ను ప్రశ్నిస్తుంటారు. దానికి నేను ఒకప్పుడు నేనూ మీలాగే భయపడేదాన్ని. అంటూ నాకు ఎదురైన చేదు అనుభవాలను వారితో పంచుకుంటాను. అమ్మ నుంచి ధైర్యం ఎలా పొందానో చెబుతాను. ధైర్యం అనేది ఒకరు దయతో ఇచ్చేది కాదు. అది అందరిలోనూ ఉంటుంది. దాన్ని ఉపయోగించుకుంటున్నామా? లేదా? అనేదే ముఖ్యం అని చెబుతుంటాను.

ప్రజలకు అవగాహన కల్పించడంలో ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా..?

చాలా ఎదుర్కొన్నాను. నా వద్దకు వచ్చిన బాధితురాలిని 'పదా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేద్దాం' అంటే 'అమ్మో నాకు పోలీస్ స్టేషన్ అంటే భయం' అనేవారు. అప్పుడు 'తప్పు చేసిన వాడు హాయిగా తిరుగుతుంటే ఏ తప్పు చేయని నువ్వెందుకు భయపడడం' అని ధైర్యం చెప్పేదాన్ని. ఇలాంటి సంఘటనలు ఎన్నో. ముఖ్యంగా తక్కువ విద్యా స్థాయిలు ఉన్న చిన్న నగరాల్లో అవగాహన కల్పించడం మరొక అడ్డంకి. ముఖ్యంగా మహిళలకు విద్య, ఆర్థిక స్వాతంత్ర్య ప్రాముఖ్యత గురించి ప్రజలను ఒప్పించడం చాలా కష్టంగా మారిందనే చెప్పాలి. వరకట్నం, భ్రూణహత్యలు, LGBTQIA+ పోరాటాల కేసులపై పని చేయడం నా ప్రయాణంలో ఒక భాగం. కొన్ని విషయాల్లో పోలీసుల నుండి మద్దతు లభించినప్పటికీ పాతుకుపోయిన నమ్మకాలను అధిగమించడానికి, షరతులతో కూడిన దృక్పథాలను మార్చడానికి సమిష్టి కృషి చాలా అవసరం అని తెలుసుకున్నాను.





ఈ ప్రయాణంలో మీకు బాగా సంతోషాన్ని కలిగించిన విషయం ఏమిటి?

నేను ఒక బాధితురాలిని. ఎన్నో అవమానాలు ఎదురైనా అప్పట్లో మాట్లాడే ధైర్యం లేని చిన్న వయసు నాది. ఇలాంటి అనుభవాలు ఎదురైన నేను ఈ నా సొంత ప్రయాణంలో ఎంతో మందికి ఓదార్పుగా నిలబడగలగడమే నాకు గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. వైద్యం కోసం వారికి సహకరించడం, వారి కష్టంలో అండగా నిలబడి న్యాయం కోసం పోరాడటం అన్నీ సంతోషకరమైన విషయాలే. ఎందుకంటే నాది స్వస్థత కలిగించేందుకు చేస్తున్న ప్రయాణంలా అనిపిస్తుంది. యువత తమకు ఏది సరైనదో దాని కోసం నిలబడటం, విముక్తి, సాధికారత భావాన్ని అర్థం చేసుకోవాలి. ఇలా నా వ్యక్తిగత బాధను ఉద్దేశపూర్వక ఓ మిషన్‌గా మార్చగలిగిన సామర్థ్యం నా పనిలో ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా మిమ్మల్ని కొనసాగించేది ఏమిటి?

ఎన్నో ఏండ్లుగా హింసను భరిస్తూ చివరకు మా మద్దతును కోరుతూ ప్రాణాలతో బయటపడిన వారి వైద్య ప్రయాణాలలో అద్భుతమైన వృద్ధిని చూడటం చాలా ఉత్తేజకరమైనది. అంతేకాదు విద్యకు దూరమైన పిల్లలు పరివర్తన చెందడం, తిరిగి చదవుకోవడం, ఉపాధిని పొందడం, బాల్య వివాహాల వంటి సాంప్రదాయ సామాజిక అంచనాల కంటే వ్యక్తిగత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం నా నిర్ణయానికి మరింత బలమైన ఆజ్యం పోసింది. లింగ సమానత్వంలో అతి చిన్న పురోగతి సైతం గణనీయమైన, శాశ్వత ప్రభావాన్ని సృష్టించగలదని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. ఆ నమ్మకమే నా పనిలో నన్ను ముందుకు నడిచేలా చేస్తుంది.



సమాజానికి మీరిచ్చే సందేశం ఏమిటి?

హింస నుండి బయటపడిన వారికి, ముఖ్యంగా మహిళలకు మద్దతు ఇవ్వడం, సానుభూతి చూపడం వంటివి ప్రస్తుత మన సమాజంలో ఎంత అవసరమో, దాని ప్రాముఖ్యం ఎంత ఉందో నేను తెలియజేయాలనుకుంటున్నాను. వారంతా ఇప్పటికే అనేక రకాల బాధలను భరించి బయటకు వచ్చిన వారు. అలాంటి బాధితులకు అండగా నిలబడకపోయినా కనీసం అవమానించడం మానుకోండి. దానికి బదులుగా వారిపై కరుణ చూపండి. వారి అనుభవాలను వినండి. ఇలా అవగాహన, మద్దతుతో కూడిన వాతావరణాన్ని పెంపొందించడం ద్వారా మహిళలపై నేరాలు, అన్యాయాలను ఎదుర్కోవడానికి మేము సమిష్టిగా పని చేయవచ్చు. ఇలా అందరూ ఆలోచిస్తే ప్రతి ఒక్కరికీ సురక్షితమైన జీవితం అందించవచ్చు. మరింత దయగల సమాజానికి దోహదం చేయవచ్చు. మరొక విషయం ఏమిటంటే సిగ్గుపడాల్సింది దోషులు, బాధితులు కాదు.

- సలీమ


అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల రాష్ట్రంలో వీచిన ఈదురుగాలులు, వడగండ్ల వానకు నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, నిర్మల్ తదితర జిల్లాల్లో రెండు వేల ఎకరాలకుపైగా మిరప, పత్తి, మొక్కజొన్న, వరి, జొన్న, పొగాకు, శనగ, మామిడి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కోతకోసిన పంటలేకాక, మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కూడా తడిసి ముద్దయిందని తెలిపింది. తక్షణమే గణాంకాలను సేకరించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించాలనీ, రుణమాఫీని ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదిలోనే మూడుసార్లు కురిసిన అకాల వర్షాల వల్ల ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వానాకాలంలో 12 లక్షల ఎకరాల్లో, యాసంగిలో మిఛౌంగ్ తుపాన్ వల్ల 4.70 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారమిస్తామంటూ ప్రకటించి, కనీసం గణాంకాలు కూడా సేకరించలేదని విమర్శించారు. తుపాన్ వల్ల మరణించిన 49 మంది కుటుంబాలకు కూడా పరిహారమివ్వలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వమైనా పంట నష్టాలను సేకరించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

ఎట్టకేలకు ఈసీకి బాండ్ల వివరాలు

(మొదటిపేజీ తరువాయి)



బాండును జారీ చేసిన బ్రాంచ్ కోడ్, ఇష్యూ టెల్లర్, స్టేటస్‌కు సంబంధించిన సమాచారం అంతా ఉంది. బాండును నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీల వివరాలను కూడా అందులో పొందుపరి చారు. బాండ్ సీరియల్ నెంబరు, నగదుగా మార్చుకున్న తేదీ, రాజకీయ పార్టీ పేరు, అకౌంట్ నెంబరులో చివరి నాలుగు అంకెలు, బాండ్ నెంబరు, దాని విలువ, చెల్లించిన బ్రాంచ్ కోడ్, పే టెల్లర్ సమాచారం అందులో ఉంది. రాజకీయ పార్టీల బ్యాంక్ ఖాతా పూర్తి నెంబరును, కేవైసీ వివరాలను బహిర్గతం చేయడం లేదని, ఖాతాల భద్రత దృష్ట్యా వీటిని అందించడం లేదని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎస్‌బీఐ చైర్మెన్ తెలియజేశారు. అదేవిధంగా కొనుగోలుదారుల కేవైసీ వివరాలను కూడా బయటపెట్టడం లేదు. అయితే రాజకీయ పార్టీల గుర్తింపునకు ఈ వివరాలు అవసరం లేదని ఆయన తెలియజేశారు. 'ఎస్‌బీఐ ఇప్పుడు అన్ని వివరాలూ వెల్లడించింది. బ్యాంక్ ఖాతాల పూర్తి నెంబర్లు, కేవైసీ వివరాలు మినహా ఏ సమాచారాన్నీ దాచలేదు' అని ఆయన అందులో తెలియజేశారు.

ఏం జరిగింది?

ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఫిబ్రవరి 15వ తేదీన చారిత్రక తీర్పును వెలువరించింది. 2019 ఏప్రిల్ 12, ఈ సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీ మధ్య విక్రయించిన బాండ్లు, వాటిని సొమ్ము చేసుకున్న పార్టీల వివరాలను ఈ నెల 6వ తేదీ లోగా అందించాలని ఎస్‌బీఐని ఆదేశించింది. అయితే వివరాలు బహిర్గతం చేసేందుకు జూన్ 30 వరకూ గడువు పొడిగించాలని అభ్యర్థిస్తూ ఎస్‌బీఐ దరఖాస్తును సమర్పించింది. దీనిపై స్పందించిన ధర్మాసనం ఎస్‌బీఐ దరఖాస్తును ఈ నెల 11న తిరస్కరించింది. 12వ తేదీ నాటికి వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని ఆదేశించింది. అయితే ఈ నెల 12న ఎస్‌బీఐ అందించిన వివరాల్లో బాండ్ల యూనిక్ నెంబర్లు లేవని సుప్రీంకోర్టు గుర్తించింది. అవి లేకుంటే ఎవరు, ఏ పార్టీకి విరాళం ఇచ్చారో ఎలా తెలుస్తుందని ప్రశ్నించింది. తన వద్ద ఉన్న వివరాలన్నింటినీ 21వ తేదీన ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సిందేనని, ఆ విషయాన్ని సాయంత్రం 5 గంటల లోగా అఫిడవిట్ రూపంలో కోర్టుకు తెలియజేయాలని 18వ తేదీన ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ తన వద్ద ఉన్న పూర్తి సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు అందజేసింది.

బీజేపీ ఓటమే సీపీఐ(ఎం) లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుంకరి వీరయ్య అన్నారు. గురువారం మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలు వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మతుల కోసం నిపుణుల కమిటీ వేయాలన్నారు. డిజైనింగ్ నిర్మాణం, అవినీతి, నిర్లక్ష్యంపై న్యాయ విచారణ కమిటీ వేయాలని కోరారు. రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ ఓటమికి సీపీఐ(ఎం) కట్టుబడి ఉందని, అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీతో సీట్ల సర్దుబాటుకు తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) ఒంటరిగా పోటీ చేయాలని ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. దేశంలో మరోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకుండా ఉండటం కోసం దేశంలో ప్రతిపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడినట్టు చెప్పారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో వామపక్షాలు సర్దుబాటుకు సిద్ధంగా ఉన్నాయని సీపీఐ(ఎం) జాతీయ కార్యవర్గం కాంగ్రెస్ అధిష్టానానికి తెలిపినట్టు చెప్పారు. భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ స్థానాలపై తమకు పట్టు ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయం కోసం పది రోజులు వేచి చూసినట్టు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా ఆలస్యం జరిగి నష్టం జరగకముందే సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం నిర్వహించేందుకే భువనగిరి అభ్యర్థిగా మహమ్మద్ జహంగీర్‌ను ప్రకటించినట్టు చెప్పారు. ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సీపీఐ(ఎం) ప్రచారంలోకి దిగిందని, అందులో భాగంగానే భువనగిరిలో ప్రచారం ప్రారంభించినట్టు తెలిపారు. అయితే, దీని అర్థం సీపీఐ(ఎం) ఒంటరిగా పోటీలో ఉండాలని కాదన్నారు. కాంగ్రెస్ నుంచి ప్రతిపాదన వస్తే అభ్యంతరం ఉండదని చెప్పారు. సీపీఐ(ఎం), సీపీఐకి భిన్నాభిప్రాయాలు లేవని, పరస్పర సహకారంతోనే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటమి లక్ష్యంగా పని చేస్తాయన్నారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐతో సర్దుబాటు చేసుకోవడం ద్వారా బీజేపీని నిలువరించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. కాంగ్రెస్ అనేక స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిందని, కానీ వామపక్షాలు గురిపెట్టిన ఖమ్మం, భువనగిరి స్థానాల్లో మాత్రం ఇంకా ప్రకటించలేదని గుర్తు చేశారు. మరో మూడు స్థానాలను కాంగ్రెస్ ఇంకా ప్రకటించనప్పటికీ వాటిపై కమ్యూనిస్టులు గురిపెట్టలేదని తెలిపారు. కాంగ్రెస్ సర్దుబాటుకు సిద్ధంగా లేకుంటే వామపక్షాలు ఆలోచించి ముందుకు వెళ్తాయని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుడిసెవాసులకు ఇచ్చిన హామీల్లో భాగంగా.. రాష్ట్రవ్యాప్తంగా 69కేంద్రాల్లో గుడిసెలు వేసుకున్న లక్ష మందికి ఇంటి స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ గృహాలకు రూ.5లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో కురవి రహదారిలో పేదలు వేసుకున్న గుడిసెలను 19సార్లు పోలీసు, రెవెన్యూ, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ధ్వంసం చేశారని, పేదల గుడిసెలను కాల్చేసి నిలువ నీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేండ్లుగా పేదలు అక్కడే చెట్ల కింద తలదాచుకుంటున్నారన్నారు. గుడిసెవాసులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) సీఎం రేవంత్‌రెడ్డిని మూడుసార్లు, సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని రెండుసార్లు కలిసి విన్నవించినట్టు గుర్తు చేశారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం సమక్షంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సన్నాహక సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో 2,964 బూత్‌లలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారన్నారు. మల్కాజిగిరి కార్యకర్తలు తనను భుజాలపై మోసి ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించారని గుర్తుచేసుకున్నారు. తన బలం, బలగం పార్టీ శ్రేణులే అని నొక్కి చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి నాయకునికీ, కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందనీ, పార్టీ, ప్రభుత్వంలో వారికి సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదని హామీనిచ్చారు. రాష్ట్రమంతా తుఫాను వచ్చినట్టు కాంగ్రెస్ గెలిచినా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. అందుకే ఈసారి కచ్చితంగా ఆ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలనీ, అప్పుడే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కంటోన్మెంట్‌లోనూ పార్టీ అభ్యర్థిని గెలించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆ పార్లమెంట్ స్థానంలో చేసే ప్రచారం రాష్ట్రమంతటా అనుసరించేలా ఉండాలని నొక్కి చెప్పారు. ప్రతిరోజూ ఉదయం ఏడుగంటలకే నాయకులు బస్తీ బాట పట్టాలన్నారు. బలమైన నాయకత్వం ఉందనీ, సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు, మరో ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకోవాలనీ, పోలింగ్ బూతుల వారీగా పనివిభజన చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కంటోన్మెంట్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. 2019 మల్కాజిగిరి పార్లమెంట్‌లో తాను గెలవటం నుంచే కేసీఆర్ పతనం ప్రారంభమైందన్నారు. వందరోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ 10లక్షలకు పెంపు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసుకుంటున్నామని వివరించారు. మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు. కేంద్రంతో సఖ్యతతో ఉండి మల్కాజిగిరిలో స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని గుర్తుచేశారు. మల్కాజిగిరికి మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య తీరాలన్నా కాంగ్రెస్ ను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సీఎం రేసులో లేను

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న కథనాలపై మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. కొంత మంది వ్యక్తులు, కొన్ని మీడియా సంస్థలు తనపై పని గట్టుకుని ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ధరణి ద్వారా జరిగిన అక్రమాలన్నింటినీ ఆధారాలతో సహా బయట పెట్టి శ్వేత పత్రం విడుదల చేస్తామని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌లో ప్రజలకవసరమున్న మాడ్యూల్స్‌ను ఉంచి, ఇబ్బంది కలిగించే అంశాలను తొలగిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసి, అవినీతిని అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఒకే చోట పనిచేసే వారిని ఎన్నికల అనంతరం బదిలీ చేస్తామని వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని పొంగులేటి పేర్కొన్నారు. "రాష్ట్రంలో సాగు, తాగు, నీరు అందక పోవడానికి పూర్తి బాధ్యత గత సర్కార్‌దే....జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటి ఫొటోలు, వీడియోలు పెట్టి కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాయి.... మా ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్‌లో... రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత వారిపై ఉంది... కాని చేయాల్సిన పనులు చేయకుండా బాధ్యత విస్మరించి మాపై రాళ్ళేయడం తగదు.... కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందే.... ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిపై విచారణ కొనసాగుతోంది... ఆ ప్రాజెక్ట్ మూడు పిల్లర్ల డ్యామేజీతో ఆగదు... మొత్తం బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉంది. కాళేశ్వరంలో నీటిని నిల్వ చేయాలంటూ కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారని" మంత్రి ఆరోపించారు.

బీఆర్ఎస్‌పై మేం కక్షపూరితంగా కేసులు పెడుతున్నామంటూ కొంత మంది మాట్లాడుతున్నారు... అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులపై మాత్రమే మేం స్పందిస్తున్నామని తెలిపారు. తామెవరిని టార్గెట్ చేసి కేసులు పెట్టడంలేదని పేర్కొన్నారు. అదే సందర్భంలో అవినీతికి పాల్పడిన వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవినీతి సొమ్ము ఏ రూపంలో, ఎక్కడ ఉన్నా కక్కిస్తామని హెచ్చరించారు. ఐదెకరాల రైతులందరికి రైతు బంధు త్వరలో అందిస్తామని చెప్పారు. కొన్ని విభాగాల సిబ్బందికి జీతాల చెల్లింపుల్లో కొంత ఆలస్యమైన మాట వాస్తవమేననీ, అయితే ఆ సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అయినందునే తమకు ఎంఐఎం మద్దతు తెలపుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 14 సీట్లల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మూడు సీట్లలో మాత్రం కొంత పోటీ ఉంటుందని చెప్పారు. తమకు ప్రధాన పోటీ బీజేపీతోనేనని పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు ఒకట్రెండు సీట్లు వస్తే ఎక్కువని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వాన్ని పడగొడుతామని బీఆర్ఎస్ నేతలు పదే పదే చేస్తున్న ప్రకటనల పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము గేట్లెత్తలేదనీ, నిజంగా గేట్లెత్తితే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని హెచ్చరించారు. తామెవరిని రమ్మని అడగకున్నా వారే వస్తామంటూ అడుగుతున్నారని గుర్తు చేశారు.



పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు., ఆయా రాష్ట్రాల అధికారులతో కలసి పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

పోలీస్ శాఖ పరిధిలో 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులున్నాయని సీఎస్ తెలిపారు. ఇప్పటివరకు పోలీస్ శాఖ ద్వారా రూ.పది కోట్లు స్వాధీన పర్చుకోవడంతోపాటు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. రవాణా శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని తెలిపారు. రవాణా శాఖ బృందాలు జరిపిన తనిఖీల్లో రూ. 34.31 లక్షలను స్వాధీనం చేసుకున్నారని అన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 16 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం తోపాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వీటితోపాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు, వివిధ వస్తువులను పంచేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా పెట్టినట్టు తెలిపారు.

ఎక్సైజ్ శాఖ ద్వారా 21 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవకాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఎస్ తెలిపారు. మద్యం అక్రమ రావాణా కు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి వాటి నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు రూ. 50 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీన పరుచుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని డిస్టిలరీలపై ప్రత్యేక నిఘా ఉంచామనీ, సీసీటీవీలను ఏర్పాటు చేసి డిస్టిలరీస్ ద్వారా మద్యం సరఫరాను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో పోలీస్ శాఖకు చెందిన పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం నుంచి కూడా మద్యం రవాణాపై సీసీటీవీల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించినట్టు తెలిపారు. అటవీ శాఖ ద్వారా కూడా 65 చెక్ పోస్టులు ఏర్పాటు చేయగా.... ఇందులో 18 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులునున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ని పటిష్టంగా అమలుచేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శాంతి కుమారి చెప్పారు.సమీక్షా సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ దొబ్రియల్, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్, రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ టీ.కె. శ్రీదేవి, ఎక్సయిజ్ శాఖ కమీషనర్ శ్రీధర్, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లికి బిగుస్తున్న ఉచ్చు..?

(మొదటిపేజీ తరువాయి)

ప్రమేయం బహిర్గతమవుతుందోనన్న భయాందోళన బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉంది.

బీఆర్ఎస్‌లో స్తబ్ధత

రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు బీఆర్ఎస్‌కు ప్రతికూలంగా మారాయి. ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడంతో ఆ పార్టీలో స్తబ్ధత నెలకొంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీలోనే మకాం వేశారు. దీంతో పార్టీ నేతలు మౌనంగా వుండిపోయారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలోనూ అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటుండటంతో ఏ కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న భయాందోళన పార్టీ శ్రేణుల్లో వుంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య వున్న రాజకీయ వైరుధ్యం నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను ఇరికిస్తారేమోనన్న ఆందోళనలో వున్నట్టు కనిపిస్తుంది.

ఐపీఎల్‌లో నేడు
చెన్నై x బెంగళూర్
వేదిక : చెన్నై
సమయం : రా॥ 8.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



ఐపీఎల్ పండగొచ్చె!

అతిపెద్ద వేసవి వినోదం, అభిమానులు ఏడాది పాటు ఎదురుచూసే పరుగుల పండుగ వచ్చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ క్రికెట్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించేందుకు సిద్ధమైంది. పది జట్లు పోటీపడే పాపులర్ గ్లోబల్ టీ20 లీగ్ ఐపీఎల్ నేటి నుంచి ఆరంభం కానుంది. చెన్నై చెపాక్ స్టేడియంలో సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ ఆరంభ మ్యాచ్‌లో ఢీకొట్టనున్నారు.

10 జట్లు, 74 మ్యాచులు, ఓ టైటిల్. పొట్టి ఫార్మాట్‌లో టీ20 ప్రపంచకప్ మేనియాను మించిపోతున్న ఐపీఎల్ టైటిల్‌ను అందుకునేందుకు ఈ సీజన్‌లో సైతం పది జట్లు పోటీపడుతున్నాయి. మరోసారి ఐపీఎల్ విజేతగా నిలిచేందుకు ఆరు జట్లు సిద్ధమవుతుండగా... కనీసం ఒక్కసారైనా ఆ టైటిల్‌ను ముద్దాడాలని నాలుగు జట్లు తపన పడుతున్నాయి.

● నేటి నుంచి ఐపీఎల్ 17 షురూ ● ఆరంభ మ్యాచ్‌లో చెన్నై, బెంగళూర్ ఢీ

నవతెలంగాణ-చెన్నై

ధనాధన్‌కు వేళాయే. పరుగుల పండుగ వచ్చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ నేటి నుంచి ఆరంభం. చెన్నైలోని ఎం.ఏ చిదంబరం స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ సీజన్ తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఆరంభ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ఆరంభం కానుండగా.. మిగతా మ్యాచులు 7.30 గంటలకే షురూ అవుతాయి. ఐపీఎల్ సీజన్‌కు ఆరంభ వేడుకలు ఆది నుంచి ప్రత్యేకం. ఈ సీజన్‌కు సైతం బీసీసీఐ ఆరంభ వేడుకలను ఘనంగా ప్రణాళిక చేసింది. దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ బాణీలు, బాలీవుడ్ నటులు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ నృత్య ప్రదర్శన ఆరంభ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలువనుంది. ప్రముఖ బాలీవుడు గాయకులు, దక్షిణాది గాయకులు నేడు చెపాక్‌లో ఆటపాటలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.



ఐపీఎల్ 2024 ట్రోఫీతో పది జట్ల కెప్టెన్లు

కప్పు కల తీరేనా?

ఐసీసీ ప్రపంచకప్ సాధించాలని ప్రతి క్రికెటర్ కలలు కంటాడు. ఇప్పుడు ఆ స్థాయిలో ప్రతి క్రికెటర్ ఐపీఎల్ టైటిల్ అందుకోవాలని స్వప్నిస్తున్నాడు. భారత క్రికెట్ కింగ్ విరాట్ కోహ్లి సైతం ఈ జాబితాలోనే ఉన్నాడు. 16 సీజన్లుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న విరాట్ కోహ్లి ఇప్పటివరకు ఒక్క టైటిల్ అందుకోలేదు. 16 ఏండ్ల ఐపీఎల్ చరిత్రలో నాలుగు జట్లు ఇప్పటివరకు టైటిల్‌ను తాకలేదు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్‌జెయింట్స్ తొలి కప్పు వేటలో ఉన్నాయి. ఇందులో లక్నో సూపర్‌జెయింట్స్ మాత్రమే రెండు సీజన్ల నుంచి ఐపీఎల్‌లో పోటీపడుతుండగా.. మిగతా మూడు జట్లు ఐపీఎల్ ఆరంభం నుంచి టైటిల్ కోసం పోరాడుతున్నాయి. నాయకత్వ బాధ్యతల నుంచి విరాట్ కోహ్లి తప్పుకున్నా.. ఆ జట్టు టైటిల్ ఆశల భారం అతడే మోస్తున్నాడు. ఈ ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఆర్సీబీ మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆ స్ఫూర్తితో కోహ్లి అండ్ కో సైతం టైటిల్ సాధిస్తారనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తుంది. ఇక పలుమార్లు గ్రూప్ దశలో అగ్రజట్టుగా నిలిచినా టైటిల్‌కు ఆమడ దూరంలో నిలిచిన జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. నాయకత్వంతో పాటు జట్టు పేరులో మార్పు చేసినా.. కప్పు మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. అసమాన పునరాగమనం చేస్తున్న రిషబ్ పంత్.. ఈ ప్రయాణంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు తొలి టైటిల్ అందిస్తాడనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, రిషబ్ పంత్ అభిమానుల దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. పంజాబ్ కింగ్ కథ ఓ వ్యథ. చీఫ్ కోచ్ నుంచి కెప్టెన్సీ బాధ్యతల వరకు ఆ జట్టు చేయని ప్రయోగం లేదు. ఆఖరుకు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ నుంచి పంజాబ్ కింగ్స్‌గా పేరు మార్చుకున్నారు. అయినా, ఎటువంటి ఫలితం లేదు. ప్రీతీ జింటా జట్టు ఈసారైనా టైటిల్ కొడుతుందేమో చూడాలి. కొత్త జట్టు లక్నో సూపర్‌జెయింట్స్ రెండు సీజన్లలో ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. కెఎల్ రాహుల్, గౌతం గంభీర్ ద్వయం సూపర్ జెయింట్స్‌ను లీగ్‌లో ఆకర్షణీయ జట్టుగా నిలిపారు. ఈ సీజన్‌లో గౌతం గంభీర్ దూరమయ్యాడు. గతంలో పుణె సూపర్ జెయింట్స్ జట్టుతో టైటిల్ వేటలో ఆఖరు అడుగులో బోల్తాపడిన యాజమాన్యం ఇప్పుడు లక్నో సూపర్‌జెయింట్స్‌తోనైనా ఆ కల తీర్చుకుంటారేమో చూడాలి.

మరోసారి కొట్టాలని..!

ఐపీఎల్‌లో ఓ కప్పు నెగ్గినా చాలు అనుకునే జట్లు ఓ వైపు ఉండగా.. వరుసగా టైటిళ్లు సాధిస్తూ వెళ్తున్న జట్లు మరోవైపు ఉన్నాయి. ఐపీఎల్ టైటిల్ వేటలో అత్యంత విజయవంతమైన జట్లలో చెన్నై సూపర్‌కింగ్స్, ముంబయి ఇండియన్స్ ముందువరుసలో ఉంటాయి. చెన్నై సూపర్‌కింగ్స్ 14 సీజన్లలో ఏకంగా ఐదు టైటిళ్లు సాధించగా, ముంబయి ఇండియన్స్ 16 సీజన్లలో ఐదు ట్రోఫీలు సొంతం చేసుకుంది. చెన్నై సూపర్‌కింగ్స్ ఎం.ఎస్ ధోని నాయకత్వంలో ఐదు ట్రోఫీలు నెగ్గగా.. ముంబయి ఇండియన్స్ రోహిత్ శర్మ సారథ్యంలో ఆ ఘనత సాధించింది. ఐపీఎల్ 17లో ఎం.ఎస్ ధోని, రోహిత్ శర్మలు నాయకత్వ బాధ్యతలకు దూరమైనా.. ఆ రెండు జట్లు టైటిల్ వేటకు చేరువగానే ఉన్నాయి. ఈ సీజన్ టైటిల్ రేసులో చెన్నై సూపర్‌కింగ్స్, ముంబయి ఇండియన్స్ సహజంగానే హాట్ ఫేవరేట్లుగా ఉన్నాయి. కోల్‌కత నైట్‌రైడర్స్ ఐపీఎల్‌లో రెండు టైటిళ్లు సాధించింది. గౌతం గంభీర్ సారథ్యంలో నైట్‌రైడర్స్ చాంపియన్‌గా నిలిచింది. ఇటీవల యువ నాయకత్వంతో ప్రయోగం చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో గౌతం గంభీర్‌ను నైట్‌రైడర్స్ చీఫ్ మెంటార్‌గా తీసుకుంది. రెండు ట్రోఫీలు అందించిన సారథి ఇప్పుడు తెరవెనుక రథ సారథ్య బాధ్యతలు తీసుకున్నాడు. దీంతో కోల్‌కత నైట్‌రైడర్స్ శిబిరం మరోసారి టైటిల్‌పై కన్నేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ మాజీ చాంపియన్లు. ఐపీఎల్ ట్రోఫీ సాధించినా.. ఈ రెండు జట్లు ఎన్నడూ ఓ సీజన్‌ను టైటిల్ ఫేవరేట్‌గా మొదలు పెట్టలేదు. అందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. ఈ సీజన్ అందుకు మినహాయింపు కాదు. సంజు శాంసన్ సారథ్యంలో రాయల్స్ గత రెండు సీజన్లుగా ఆకట్టుకునే ప్రదర్శన చేస్తుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష విజయాలు సాధించిన పాట్ కమిన్స్‌కు కెప్టెన్సీ అప్పగించిన సన్‌రైజర్స్.. ఈ సీజన్‌లో మళ్లీ కప్పు కొట్టాలని తపిస్తోంది. ఎస్ఏ20 లీగ్‌లో వరుసగా రెండు సీజన్లుగా చాంపియన్‌గా నిలిచిన సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ.. ఐపీఎల్‌లోనూ ఆ గెలుపు మంత్ర అమలు చేయాలని చూస్తోంది. గుజరాత్ టైటాన్స్ తొలి రెండు సీజన్లలోనే తడాఖా చూపించింది. హార్దిక్ పాండ్య సారథ్యంలో టైటాన్స్ అంచనాలను మించి రాణించింది. అరంగేట్ర సీజన్లోనే చాంపియన్‌గా నిలిచి, రెండో సీజన్లో రన్నరప్‌గా నిలిచింది. ఈ సీజన్‌కు హార్దిక్ పాండ్య నాయకత్వ సేవలు దూరమయ్యాయి. తెరవెనుక యంత్రాంగం కొనసాగుతుండగా.. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వచ్చాడు. ఈ సీజన్లో టైటాన్స్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది.

ఈగల్స్ వేట 23 నుంచి!

నేడు చెపాక్‌లో చెన్నై, బెంగళూర్ మ్యాచ్‌తో ఐపీఎల్ 17వ సీజన్ టైటిల్ వేట షురూ కానుండగా.. ఆరెంజ్ ఆర్మీ మరుసటి రోజు తన టైటిల్ వేటను మొదలెట్టనుంది. ఈగల్స్ ఐపీఎల్‌లో తొలి మ్యాచ్‌ను శనివారం ఆడనుంది. కోల్‌కత ఈడెన్ గార్డెన్ వేదికగా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. సొంత గడ్డపై ఈనెల 27న ముంబయి ఇండియన్స్‌తో తలపడనుంది. హైదరాబాద్ వేదికగా జరిగే ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ టికెట్లు ఇప్పటికే అమ్ముడయ్యాయి. తొలి దశ షెడ్యూల్‌లోనే ఏప్రిల్ 5న చెన్నై సూపర్‌కింగ్స్‌తో సన్‌రైజర్స్ ఉప్పల్ వేదికగా తలపడనుంది. తొలి నాలుగు మ్యాచుల్లో వరుసగా కోల్‌కత నైట్‌రైడర్స్, ముంబయి ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ వంటి అగ్రజట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఢీకొట్టనుంది.



ఫ్లాగ్‌బేరర్ శరత్ కమల్

● చెఫ్‌డీ మిషన్‌గా మేరీకోమ్
● భారత ఒలింపిక్ సంఘం వెల్లడి

న్యూఢిల్లీ : 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు అచంట శరత్ కమల్ వ్యవహరించనున్నాడు. పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకల్లో భారత అథ్లెట్ల బృందాన్ని శరత్ కమల్ ఫ్లాగ్‌బేరర్‌గా ముందుండి నడిపించనున్నాడు. 41 ఏండ్ల అచంట శరత్ కమల్ 'భారత జట్టు ఐక్యత, స్ఫూర్తికి పారిస్ వేదికగా ప్రతీకగా నిలుస్తాడని' భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఓ ప్రకటనలో తెలిపింది. దిగ్గజ మహిళా బాక్సర్, ఆరు సార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్ పారిస్ ఒలింపిక్స్ చెఫ్‌డీ మిషన్‌గా బాధ్యతలు తీసుకోనుంది.



ఆమెకు శివ కేశవన్ డిప్యూటీగా ఉండనున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో కీలక షూటర్ల బృందానికి గగన్ నారంగ్ పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోనున్నాడు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

సారథ్యానికి సెలవు

● కెప్టెన్సీ వదిలేసిన ఎం.ఎస్ ధోని
● సూపర్‌కింగ్స్ కొత్త కెప్టెన్ రుతురాజ్



చెన్నై : ' ఈ సీజన్‌లో కొత్త పాత్ర కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'... ఐపీఎల్ ఆరంభానికి ఓ పది రోజుల ముంగిట మహేంద్ర సింగ్ ధోని సోషల్ మీడియా పోస్ట్ ఇది. అభిమానుల కోసం మరో సీజన్ ఆడేందుకు మోకాలి గాయానికి శస్త్రచికిత్స సైతం చేయించుకున్న మహి.. ఐపీఎల్ 17లో కచ్చితంగా ఆడుతాడని తెలుసు. అయినా, సూపర్‌కింగ్స్ శిబిరంలో ఇంకా సరికొత్త బాధ్యత ఏమైఉంటందని అభిమానుల్లో విపరీత చర్చ నడిచింది. ఈ సస్పెన్స్‌కు సూపర్‌కింగ్స్ యాజమాన్యం గురువారం తెరదించింది. ఎం.ఎస్ ధోని నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నట్టు తెలిపింది. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ చెన్నై సూపర్‌కింగ్స్ కొత్త కెప్టెన్ అని ప్రకటించింది. 42 ఏండ్ల ధోని..



ఐపీఎల్ 16లోనూ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. రవీంద్ర జడేజాకు నాయకత్వ బాధ్యతలు అప్పగించగా.. అతడు ఆశించిన ఫలితాలు రాబట్టలేదు. దీంతో సీజన్ మధ్యలోనే కెప్టెన్సీ వదిలేసి ఫ్రాంచైజీ నుంచి వెళ్లిపోయాడు. ఐపీఎల్17 ముంగిట మళ్లీ ధోని కెప్టెన్సీ వదులుకోగా.. రుతురాజ్ గైక్వాడ్‌కు నాయకత్వ పగ్గాలు దక్కాయి. ఎం.ఎస్ ధోని సూపర్‌కింగ్స్‌ను 212 ఐపీఎల్ మ్యాచ్‌లో కెప్టెన్‌గా నడిపించగా.. 128 విజయాలు సాధించి, 82 పరాజయాలు చవిచూశాడు.

వెండితెరపై ఇళయరాజా జీవితం




ధనుష్, ఇళయరాజా

మాస్ట్రోగా ప్రేక్షకులను తన సంగీత స్వర సాగరంలో ముంచెత్తిన ఇళయరాజా అభిమానులు ఎంతో సంబరపడుతున్నారు. అందుకు కారణం చాలా రోజుల నుంచి ఆయన బయోపిక్ ఎప్పుడు ప్రారంభమవుతుందా! అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు మ్యాస్ట్రో బయోపిక్ 'ఇళయరాజా' పేరుతో బుధవారం చెన్నైలో ఆరంభమైంది. ఈ వేడుకకు హీరో కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను విడుదల చేశారు. 'కెప్టెన్ మిల్లర్' సినిమాతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ ఈ బయోపిక్‌ను డైరెక్ట్ చేస్తున్నారు.
కనెక్ట్ మీడియా, పి.కె.ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యురీ మూవీస్ బ్యానర్స్‌పై శ్రీరామ్ భక్తిశరణ్, సి.కె.పద్మకుమార్, వరుణ్ మాథుర్, ఇలం పరితి గజేంద్రన్, సౌరభ్ మిశ్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ, 'చిన్నప్పటి నుంచి నేను మాస్ట్రో ఇళయరాజా అందించిన అద్భుతమైన మెలోడి పాటలను విని మైమరచిపోయేవాడిని. ఇప్పుడు ఆయన బయోపిక్ చేస్తుండటం చూస్తుంటే కల నిజమైనట్లు అనిపిస్తుంది. నా జీవితంలో మరచిపోలేని క్షణాలవి. మనం మనసులో బలంగా కోరుకుంటే అవి నిజమవుతాయని అంటుంటాం. జీవితం అనేది అసాధారణమైన విషయం ఎన్నో మరుపరాని క్షణాలు, అనుభవాలతో అల్లిన వస్త్రం లాంటిది. మనం హృదయపూర్వకంగా బలంగా ఏదైనా కావాలని కోరుకున్నప్పుడు అవి నిజమవుతాయి. చాలా మంది ప్రశాంతమైన నిద్ర కోసం ఆయన పాటలతో సాంత్వన పొందుతుంటారు. అయితే నేను మాత్రం ఆయన అసాధారణ జీవితాన్ని వెండితెరపై చిత్రించాలనే కలల్లో మునిగిపోయాను. నా కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇళయరాజా సంగీతం నన్ను నటుడిగా మెరుగుపరుచుకోవటానికి ఎంతగానో ఉపయోగపడింది. ఏదైనా అసాధారణ పాత్రలో నేను నటించాల్సి వచ్చినప్పుడు ఇళయరాజాగారి పాటలను ఇయర్ ఫోన్స్ పెట్టుకుని వింటాను. అవి నాలోని నటనను పరిపూర్ణంగా ఆవిష్కరించేలా చేస్తాయి. ఈ సినిమాలో ఆయన పాత్రను పోషించే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ ఓ గొప్ప బాధ్యతను స్వీకరించారు' అని తెలిపారు.
'డైరెక్టర్ అరుణ్ మాదేశ్వరన్ ఈ సినిమాను డైరెక్ట్ చేయటం అనేది ఆయనకు గొప్ప బాధ్యతను ఇవ్వటంతో పాటు ఒత్తిడిని కూడా ఇస్తుంది. ఈ సినిమాకు పదికిపైగా వ్యాఖ్యాలు కూడా ఉంటాయి. కాబట్టి దర్శకుడు సంగీత ప్రపంచానికి గర్వ కారణమైన ఇళయరాజా బయోపిక్‌ని తనదైన కోణంలో తెరకెక్కించాలని కోరుకుంటున్నాను' అని కమల్ హాసన్ అన్నారు.

నవచిత్రం

విశ్వంభర కీలక షెడ్యూల్ పూర్తి



కీరవాణి, త్రిష, చిరంజీవి

చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను చిత్ర బృందం పూర్తి చేసుకుంది. చిరంజీవి, త్రిష కృష్ణన్ తదితరులు షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని టాకీ పార్ట్స్, పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించారు. చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా మొత్తం బృందంతో పాటు త్రిష కృష్ణన్ దిగిన కొన్ని ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్‌ను యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది.

సరికొత్త అనుభూతినిచ్చే సినిమా



మల్లిక్ రామ్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' వస్తోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈనెల 29న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించారు.

సిద్ధు, నేను ఒకేసారి సినీ ప్రయాణం మొదలుపెట్టాం. మేమిద్దరం కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. 'నరుడా డోనరుడా', 'అద్భుతం' అలాగే మధ్యలో పెళ్లి గోల అనే వెబ్ సిరీస్ కూడా చేశాను. అది చాలా పెద్ద హిట్ అయింది. డీజే టిల్లు, అద్భుతం సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలిసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్ మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను.

- సిద్ధు ఒక రచయితగా, నటుడిగా ఎంతవరకు ఇన్వాల్వ్ అవ్వాలో.. అంతవరకే ఇన్వాల్వ్ అవుతాడు. దర్శకుడికి ఇవ్వాల్సిన స్వేచ్ఛను దర్శకుడికి ఇస్తాడు. ఎలా చేస్తే బాగుంటుంది అనేది ఇద్దరం చర్చించుకొని చేశాం. డీజే టిల్లు నచ్చినవారిని టిల్లు స్క్వేర్ ఏమాత్రం నిరాశ పరచదు.


- డీజే టిల్లు, టిల్లు స్క్వేర్‌కి వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ అలా ఉండదు. ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లు స్క్వేర్ మీకొక కొత్త అనుభూతిని ఇస్తుంది.

- అనుపమ గొప్ప నటి. ఈ సినిమాలో లిల్లీ పాత్ర ఛాలెంజింగ్ రోల్. ఆ పాత్ర కోసం ఎందరో పేర్లను పరిశీలించాం. కానీ అనుపమనే పర్ఫెక్ట్ ఛాయిస్ అనిపించింది. అనుపమని బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో లిల్లీ పాత్రను రాసుకోలేదు. లిల్లీ పాత్ర తీరే అలా ఉంటుంది. ఆ పాత్రకి ఆమె న్యాయం చేయగలదని నమ్మాం. ఆమె ఆ పాత్రకి నూటికి నూరు శాతం న్యాయం చేసింది. భవిష్యత్‌లో టిల్లు-3 వచ్చే అవకాశముంది.

ఈ సినిమాలో కొందరి స్వభావం ఎలా ఉంటుందో చూపించాం. కానీ ఇలా ఉండకండి, మారండి అనే సందేశాలు మాత్రం ఇవ్వలేదు.

సితార సంస్థ గురించి చెప్పాలంటే బడ్జెట్ విషయం ఎప్పుడూ మాట్లాడరు. కంటెంట్ గురించి, క్వాలిటీ గురించే ఎక్కువ మాట్లాడతారు. యువ ప్రతిభను ప్రోత్సహించడంలో ముందుంటారు.

10 రోజులు కరెంట్ లేకపోతే?



త్రిగుణ్

హీరో త్రిగుణ్ నటించిన తాజా చిత్రం 'లైన్ మ్యాన్'. ఈ చిత్రంతో ఆయన కన్నడ సినీ ఇండస్ట్రీలోనూ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వటానికి సిద్ధమయ్యారు. వి. రఘుశాస్త్రి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా కన్నడ, తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతుండటం విశేషం. పర్పుల్ రాక్ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి ప్రచూర.పి, కాద్రి మణికాంత్, జ్యోతి రఘుశాస్త్రి, భళా స్టూడియో సహ నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. ఈనెల 22న ఈ చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో త్రిగుణ్ సినిమా గురించి మాట్లాడుతూ,'ఇది ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటూనే మంచి మెసేజ్‌ను కూడా ఇస్తుంది. అది కూడా మన ప్రకృతికి సంబంధించిన విషయం కావటంతో నాకు కనెక్ట్ అయ్యింది. అందుకే నేను ఈ కథను సెలక్ట్ చేసుకున్నాను. ఈ సినిమా ఓ ప్రత్యేకమైన చిత్రంగా నాకు ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయనటువంటి కథ కూడా. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓ గంటపాటు కరెంట్ పోతే మనమెంత బాధపడతామో తెలుసు. అలాంటిది ఓ గ్రామంలో పదిరోజుల పాటు కరెంట్ లేకుండా పోతే అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయనేది సినిమా. అయితే అన్నిరోజుల పాటు గ్రామంలో కరెంట్‌ను లైన్ మ్యాన్ ఎందుకు తీసేశాడనేది సినిమా. చిన్న హార్ట్ టచింగ్ మూమెంట్ ఉంటుంది. డైరెక్టర్ రఘుశాస్త్రిగారు మంచి రైటర్. ఆయన సినిమాను చక్కగా తెరకెక్కించారు. మనం మన పల్లెటూర్లో ఉన్నట్లే నేచురల్‌గా మాట్లాడుతున్నట్లే అనిపిస్తుంది. కామెడీ, చిన్న లవ్ పాయింట్‌తో పాటు హార్ట్ టచింగ్ మెసేజ్ కూడా ఈ చిత్రంలో ఉంటుంది' అని తెలిపారు.



రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్

ఇలాంటి క్లైమాక్స్ రాలేదు

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్.వి.ఎస్. స్టూడియోస్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బర దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 19న సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చిత్ర సమర్పకురాలు గౌరీ నాయుడు మాట్లాడుతూ, 'రక్షిత్, కోమలీ, నిర్మాతలు అభిలాష్, అహితేజ సహా సపోర్ట్ చేసిన అందరికీ థ్యాంక్స్' అని అన్నారు. 'రక్షిత్ అట్లూరి, కోమలి చక్కగా నటించారు. సాంగ్స్, టీజర్ అందరికీ నచ్చాయి. అలాగే సినిమాను కూడా పెద్ద హిట్ చేస్తారని నమ్ముతున్నాను' అని నిర్మాత అభిలాష్ రెడ్డి అన్నారు.
దర్శకుడు సాయి మోహన్ ఉబ్బర మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు విడుదలైన టీజర్, మూడు పాటలకు ప్రేక్షకుల నుంచి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా టైటిల్, పాటలు ఎంత సాఫ్ట్‌గా అనిపిస్తున్నాయో సినిమా అంత హార్డ్ హిట్టింగ్‌గా ఉంటుంది. మూవీ చూసిన తర్వాత ఓ ఆలోచనతో ఆడియెన్స్ బయటకు వస్తారు' అని తెలిపారు.
'అందరూ ఇచ్చిన సపోర్ట్‌తో మార్కెట్‌లో మా సినిమాకు ఓ మార్క్ వచ్చింది. ఇలాంటి క్లైమాక్స్‌తో సినిమా ఇప్పటి వరకు రాలేదని నేను చెప్పగలను' అని నిర్మాత అహితేజ బెల్లంకొండ అన్నారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ, సినిమా ఫస్ట్ కాపీ చూసుకుని కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సినిమా చాలా బ్రహ్మాండంగా వచ్చింది' అని చెప్పారు.

తలకోన రిలీజ్‌కి రెడీ

అక్షర క్రియేషన్ పతాకంపై నగేష్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్ రెడ్డి (చేవెళ్ల) నిర్మాతగా అప్సర రాణి ప్రధాన పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తలకోన'. ఈ చిత్రం ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రి రిలీజ్ వేడుక నిర్వహించారు.
నిర్మాత శ్రీదర్ రెడ్డి మాట్లాడుతూ, 'మా హీరోయిన్ అప్సర రాణీ ఇప్పటి వరకు చేయని వెరైటీ సబెక్ట్ ఇది.అవుట్ అండ్ అవుట్ యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ కథాంశం మొత్తం ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఉండబోతోంది. అలాగే అదే అడవిలో ఇంకో కోణం కూడా ఉంటుందని చూపించాం' అని అన్నారు.



దేవర శ్రీధర్‌రెడ్డి, అప్సర రాణి, నగేష్ నారదాసి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

క్యూ ఆర్ కోడ్ ద్వారా రైలు టిక్కెట్ల కొనుగోలు సౌకర్యం

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయాణీకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే యూటీఎస్(జనరల్ బుకింగ్) కౌంటర్లలో క్యూఆర్ కోడ్ సదుపాయంతో సాధారణ టికెట్ల కొనుగోలుకు శ్రీకారం చుట్టిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గురువారం ప్రకటించారు. జనరల్ కౌంటర్లలో టికెట్లను కొనుగోలు చేసేందుకు డిజిటల్ చెల్లింపుల ఎంపికను ప్రవేశపెట్టినందుకు కమర్షియల్, టెక్నికల్ స్టాఫ్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. రైల్వే వినియోగదారులందరూ సాధారణ టిక్కెట్లను కొనుగోలు చేయటానికి క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విధానం పారదర్శకతకు, ఖచ్చితత్వానికి మైలు రాయిగా నిలుస్తుందని తెలిపారు. నగదు చెల్లింపులనుండి ప్రయాణీకులకు ఉపశమనం కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. తొలిదశలో భాగంగా దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోనున్న 14 స్టేషన్లలోని 31 కౌంటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు.

అడవి సంపదను కాపాడిందే కేసీఆర్

- కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దశాబ్దాల పాటు ధ్వంసమైన అడవులను కంటికి రెప్పలా కాపాడిన దార్శనికుడు మాజీ సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీట్ చేశారు. 'సమైక్య రాష్ట్రంలో.. ఆగమైన అడవిసంపద చుట్టూ..అందమైన పచ్చని పందిరి అల్లిన.. ప్రకృతి ప్రేమికుడు కేసీఆర్' అని తెలిపారు. తెలంగాణలో మహోద్యమంలా సాగిన ఆనాటి హరితహారం... 230 కోట్ల మొక్కలు నాటాలన్న సంకల్పం ప్రపంచ చరిత్రలోనే... మూడో అతిపెద్ద మానవ ప్రయత్నమని గుర్తుచేశారు. సుమారు 15 వేల నర్సరీల పెంపకం మహాయజ్ఞంలో సరికొత్త అధ్యాయంగా పేర్కొన్నారు. ఎనిమిది శాతం పెరిగిన గ్రీన్ కవర్ దేశ చరిత్ర లోనే అంతకు ముందెప్పుడు లేదని చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే... ప్రజల బతుకు చిత్రాన్ని మార్చడమే కాదు.. చిక్కశల్యమైన అడవులను..సకల జీవరాశులను సంరక్షించడమని తెలిపారు. అందుకే బీఆర్ఎస్ పదేండ్ల ప్రస్థానం పుడమి తల్లికి వెలకట్టలేని ఆభరణం ... నాడు ప్రతి పల్లె పచ్చదనంతో మురిసింది. ప్రతి పట్నం హరిత శోభతో వెల్లివిరిసిందని కేటీఆర్ తెలిపారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను తలదన్నేలా..నిర్మించిన..గ్రీన్ వాల్ ఆఫ్ తెలంగాణ సాక్షిగా.. ప్రకృతి ప్రేమికులందరికీ... ఆయన ప్రపంచ అటవీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

టెన్త్ ప్రశ్నాపత్రం లీకేజీ అవాస్తవం

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీపై వివిధ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో ఈనెల 19న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ వచ్చిన ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. 20న పది ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందంటూ జరిగిన ప్రచారం కూడా అవాస్తవమని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై విచారణ చేశారనీ, అందులో ఎలాంటి తప్పిదాలు జరిగినట్టు తేలలేదని తెలిపారు. రాష్ట్రంలో పది పరీక్షలు సజావుగా జరుగుతున్నాయనీ, తగు భద్రతా ఏర్పాట్లు కూడా చేశామని ఆమె పేర్కొన్నారు.

మూడో రోజు 99.71 శాతం హాజరు

పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా గురువారం మూడోరోజు థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్) పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు తెలిపారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 4,94,706 మంది దరఖాస్తు చేస్తే, 4,93,273 (99.71 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 1,433 (0.29 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 843 మంది దరఖాస్తు చేసుకుంటే, 556 (65.95 శాతం) పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 287 (34.05 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మూడోరోజు ఒక విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసును నమోదు చేశామని వివరించారు. వికారాబాద్ జిల్లాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు తూనికలు కొలతల శాఖాధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : తూనికలు, కొలతల శాఖకు చెందిన ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీజీ సి.వి ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. తూనికలు, కొలతల శాఖ రంగారెడ్డి విభాగం ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, సాంకేతిక నిపుణుడు మల్లేశ్‌లు రూ.10వేలు లంచం తీసుకుంటూ వారి కార్యాలయంలో ఏసీబీకి పట్టుబడ్డారు. ఎలక్ట్రానిక్ తూకంలో బయటపడ్డ వ్యత్యాసానికి సంబంధించి ఒక వ్యాపారిపై కేసు నమోదు చేయకుండా ఉండటానికిగానూ వీరు లంచాన్ని డిమాండ్ చేసి తీసుకున్నారు. వీరి దగ్గరి నుంచి లంచం సొమ్మును స్వాధీనపర్చుకొని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. అనంతరం ఇద్దరు నిందితులను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై నిబద్ధతతో ఉన్నాం

- ఎంపీ ఎన్నికల అనంతరం కార్యాచరణ వేగవంతం చేస్తాం : డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ వెబ్‌సైట్ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిచ్చే విషయంలో తమ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కార్యాచరణను వేగవంతం చేస్తామని భరోసా నిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలోని తన ఇంటిలో డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్)



వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం మంత్రి డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి, ఇతర ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన పదేండ్ల కాలంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు అంశం ఒక కలగానే మిగిలిపోయిందని రవి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల కలిసి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలివ్వాలని కోరిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సీఎం కూడా సానుకూలంగా స్పందించారని వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల చిరకాల కోరికైన సొంతింటి కలను సాకారం చేసే విశాల హృదయం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇప్పటివరకు జర్నలి స్టులకు ఇండ్లస్థలాలిచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వ మేననీ, అతి త్వరలోనే అందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డీజేహెచ్ఎస్ ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు గంగాపురం ప్రతాప్‌రెడ్డి, కొత్తకాపు విక్రమ్‌రెడ్డి, స్వామిరెడ్డి, సభ్యులు శ్రావణి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రష్యా అధ్యక్ష ఎన్నికలలో పుతిన్ చారిత్రాత్మక విజయం

మాస్కో : రాష్యా అధ్యక్ష ఎన్నికలలో వ్లాడీమీర్ పుతిన్ చారిత్రాత్మక విజయం సాధించాడని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ సోమవారంనాడు అధికారికంగా ప్రకటించి, ఫలితాలను వెల్లడించింది. పుతిన్ 87.28% రికార్డు స్థాయిలో ఓట్లనుసాధించి, ఐదవసారి అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చాడు. పుతిన్ అభ్యర్థిత్వాన్ని 75 మిలియన్లకు పైగా ఓటర్లు బలపరిచారు. 2024 అధ్యక్ష ఎన్నికలో పుతిన్ ప్రత్యర్థులైన కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థి నికోలాయ్ ఖరిటోనోవ్, న్యూ పీపుల్స్ పార్టీకి చెందిన వ్లాడిస్లావ్ దావన్‌కోవ్, లిబరల్ డెమొక్రాట్‌లకు చెందిన లియోనిడ్ స్లట్స్కీ వరుసగా 4.31%, 3.85%, 3.20% ఓట్లు సాధించారు. వ్లాడీమీర్ పుతిన్ మొదటిసారిగా 2000 సంవత్సరంలోఅధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 2008 వరకు వరుసగా రెండు, నాలుగు సంవత్సరాల పదవీకాలం పనిచేశాడు. 2008-2012 వరకు రష్యా అధ్యక్షుడిగా ఉన్న డిమిత్రి మెద్వెదేవ్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి అయ్యాడు. మెద్వెదేవ్ పదవిలో ఉన్న సమయంలో అధ్యక్ష పదవీ కాలాన్ని ఆరు సంవత్సరాలకు పొడిగించారు. మెద్వెదేవ్ స్థానంలో పుతిన్ 2012లో మరోసారి దేశాధినేత అయ్యాడు. 2018లో తిరిగి ఎన్నికయ్యారు. 2020లో ప్రధాన రాజ్యాంగ సంస్కరణలో భాగంగా రష్యా తన ఎన్నికల నిబంధనలను సవరించింది. పుతిన్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నిక అవటానికి అడ్డంకిగా వున్న మునుపటి పదవీకాలాలను రద్దు చేసి, అతను తిరిగి ఈ సంవత్సరం పోటీ చేయడానికి వీలు కల్పించింది.ఈ ఏడాది ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఓటింగ్ శాతం నమోదైంది. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ డేటా ప్రకారం, 2018 ఎన్నికలలోని ఓటింగ్ 67.47% మించి 74%కి చేరుకుంది. చెచెన్ రిపబ్లిక్, కెమెరోవో ప్రాంతం, రిపబ్లిక్ ఆఫ్ టైవాలో అత్యధికంగా 90% కంటే ఎక్కువ ఓటింగ్ నమోదైంది. రష్యా కొత్త ప్రాంతాలైన దొనేత్సక్, లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్లలో, అలాగే ఖేర్సన్, జాపోరోజీ ప్రాంతాలలో కూడా అధ్యక్ష ఎన్నికలు మొదటిసారిగా నిర్వహించబడ్డాయి.



ప్రపంచం

ఉక్రెయిన్‌లో పాశ్చాత్య దళాలు

- పోరాడుతున్నాయనేది ఒక బహిరంగ రహస్యం - పోలాండ్

ఉక్రెయిన్‌లో పాశ్చాత్య దళాలు పోరాడుతున్నాయనే విషయం ఇప్పుడు బహిరంగ రహస్యం అని పోలిష్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ సికోర్స్కీ జర్మన్ ప్రెస్ ఏజెన్సీ డీపీఏకి చెప్పాడు. ఉక్రెయిన్‌లో నాటో దళాలను మోహరించడమనేది అనూహ్యమైనది కాదు. అటువంటి ఆలోచనను తోసిపుచ్చనందుకు ఫ్రెంచ్ అధ్యక్షుడుఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను అభినందిస్తున్నట్లు రాడోస్లావ్ సికోర్స్కీ చెప్పాడు. బుధవారం డీపీఏ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, సికోర్స్కీ ఇలా పేర్కొన్నాడు, మీ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ చెప్పినట్లు, ఉక్రెయిన్‌లో ప్రధాన దేశాల నుండిఇప్పటికే కొంతమంది సైనికులు ఉన్నారు. గత నెలలో ఒక ప్రెస్ మీటింగ్ సందర్భంగా, స్కోల్జ్ ఉక్రెయిన్‌కు టారస్ క్రూయిజ్ క్షిపణుల పంపిణీని తిరస్కరించడాన్ని సమర్థించాడు.తమ సైనికులను ఉక్రెయిన్ పంపి అక్కడ జరుగుతున్న యుద్ధంలో



జర్మనీ పాల్గొనదని ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ చెప్పాడు. బ్రిటిష్, ఫ్రెంచ్ సైనికులు చేస్తున్న లక్ష్య నియంత్రణ, దానితో పాటు లక్ష్య నిర్వహణలను జర్మనీ చేయజాలదు అని ఛాన్సలర్ ఆ సమయంలో విలేకరులతో అన్నాడు. జర్మన్ చాన్సలర్ చెప్పిన మాటలుఉక్రెయిన్‌లో పాశ్చాత్య సైనికుల ఉనికిని ధ్రువీకరిస్తున్నట్లు విస్తతంగా మీడియా వ్యాఖ్యానించింది. స్కోల్జ్ అలావెల్లడించటం సమస్య కాదా అని డీపీఏ అడిగినప్పుడు, సికోర్స్కీ ఇలా ప్రతిస్పందించాడు. పోలిష్‌లో, అందరికీ తెలిసిన రహస్యాన్ని వివరించే టాజెమ్నికా పోలిస్జినెల అనే వ్యక్తీకరణ మాకు ఉంది. చారిత్రక కారణాలను చూపుతూ వార్సా ఉక్రెయిన్‌కు సైనికులను పంపదని సికోర్స్కీ పునరుద్ఘాటించాడు. అయితే, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఉక్రెయిన్‌కు సైన్యాన్ని పంపటం అనే ఎంపికను కొట్టివేయకపోవటాన్ని పోలిష్ దౌత్యవేత్త స్వాగతించాడు.

"ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి అమెరికా నేతత్వంలోని నాటో సైనిక కూటమి నుండి సైనికులను పంపే అవకాశాన్ని తాను మినహాయించలేను" అని ఫిబ్రవరి చివరలో మాక్రాన్ చెప్పాడు. ఈ ప్రకటనకు వ్యతిరేకంగా నాటో సభ్య దేశాల నాయకుల నుండి తిరస్కరణలు వెల్లువెత్తాయి. ఉక్రెయిన్‌లో తమతమ దేశాల సైనిక దళాలను మోహరించే ప్రసక్తే లేదని వివిధ దేశాల అధినేతలు ప్రకటించారు. అయినప్పటికీ ఉక్రెయిన్‌కు మద్దతునిచ్చే విషయంలో పారిస్ ఎటువంటి పరిమితులను గుర్తించదని మక్రాన్ ప్రకటించాడు. "రష్యాను జయించటానికి మునుపటి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని, ఇప్పుడు అటువంటి ప్రయత్నాలవల్ల సంభవించే పర్యవసానాలుఅత్యంత విషాదకరంగా ఉంటాయి" అని రష్యా ఫెడరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నాడు.

హయ్యర్ పెన్షన్ కోసం డిమాండ్ నోటీసులందుకున్న వారి ఇబ్బందులను పరిష్కరించాలి

- ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పీఎఫ్, హయ్యర్ పెన్షన్ డిమాండు నోటీసు అందుకున్న కార్మికుల, ఉద్యోగుల ఖాతాలో వున్న డబ్బులను ఈపీఎఫ్ కు బదిలీ చేసే విషయంలో వస్తున్న ఇబ్బందులను తొలగించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మెన్, ఎండీకి వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులు తమ కుటుంబ అవసరాల కోసం కరోనా సమయంలో ప్రత్యేకంగా క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) నుండి లోన్లు, మెంబర్ షిప్ సీజింగ్ వంటివి పెట్టుకున్నా డబ్బులు రాని స్థితిలో, భవిష్యనిధి (పీఎఫ్) సంస్థ నుంచి ఉపసంహరణ చేయకతప్పని స్థితిలోకి నెట్టబడ్డారని తెలిపారు. హయ్యర్ పెన్షన్ కోసం చెల్లించాల్సిన డిమాండు నోటీసులు అందుకున్న వారు డిమాండు నోటీసులో వచ్చిన మొత్తం కార్మికుని పీఎఫ్ అకౌంటులో నిల్వలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్మికుని పీఎఫ్ అకౌంటులో యజమాని వాటాలో సరిపోయినంత నిల్వ వుంటేనే పీఎఫ్ ట్రస్టు చెల్లిస్తుందనీ, లేనిపక్షంలో కార్మికుడే ఆ డబ్బును జమ చేయాల్సుం టుందని అంటున్నారనీ,. దీనివల్ల కార్మికుడు తప్పని పరిస్థితిలో ప్రయివేటు అప్పులకు వెళ్తున్నారని తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ, టీఎస్‌ఆర్టీసీ కార్మికులు ఒకే ఉమ్మడి ఖాతాలో ఈపీఎఫ్ఓలో వున్నారనీ, ఏపీఎస్‌ఆర్టీసీలో ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్న కార్మికులకు వారి ఖాతాల్లో వున్న మొత్తానికి తోడు ఎంత చెల్లించాల్సి వుంటుందో అంత ఏపీఎస్ ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్ ఖాతాలో జమ చేయించుకుని, మొత్తం డబ్బును ఈపీఎఫ్ఓకు పీఎఫ్ ట్రస్ట్ ద్వారానే బదిలీ చేస్తున్నారని తెలిపారు.టీఎస్‌ఆర్టీసీలో కూడా ఆ విధంగా బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బిజినెస్

తప్పుడు ప్రచారాన్ని అంగీకరించిన రాందేవ్ బాబా

- సుప్రీంకోర్టుకు క్షమాపణలు
- మళ్లీ ఆ విధంగా చేయమని హామీ
- పతాంజలి ఆయుర్వేద్ సిఇఒ బాలకృష్ణ అఫిడవిట్

న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్ వ్యాపారి, యోగా గురు రాందేవ్ బాబాకు చెందిన పతాంజలి ఆయుర్వేద సంస్థ జారీ చేసిన తప్పుడు ప్రకటనలపై క్షమాపణలు చెప్పింది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేసినందుకుగాను క్షమాపణలు కోరుతూ గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో ఇంతకాలం జారీ చేసిన తప్పుడు ప్రచారాన్ని రాందేవ్ బాబా అంగీకరించినట్లయ్యింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల జారీపై రాందేవ్ బాబా తదుపరి విచారణకు స్వయంగా హాజరు కావాలని మంగళవారం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాము జారీ చేసిన షోకాజ్ కంటెప్ట్ పిటిషన్‌కు వివరణ ఇవ్వడానికి వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయమూర్తులు హిమాకోహ్లీ, అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. డ్రగ్స్ అండ్ రెమెడిక్స్ యాక్ట్ 1954లోని 3,4 సెక్షన్లను రాందేవ్ బాబాతో పాటు పతంజలి ఆయుర్వేద్ సిఇఒ ఆచార్య బాలకృష్ణ ఉల్లంఘించినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించడంతో అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ 2022లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారిస్తున్న అత్యున్నత న్యాయస్థానం అసత్య ప్రచారాలను వెంటనే నిలిపేయాలంటూ పతాంజలి గ్రూపును గతంలోనే సుప్రీంకోర్టు ఆదేశించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరపున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అయితే ఆ హామీలను సంస్థ విస్మరించింది. దీనిపై కోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో తాజాగా పతంజలి సంస్థ తప్పును ఒప్పుకుంటూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. న్యాయవ్యవస్థ పట్ల అత్యంత గౌరవం ఉందని సంస్థ డైరెక్టర్ బాలకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో ఆ తరహా ప్రకటనలు జారీ చేయకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. కోర్టు నోటీసులకు బదులు చెప్పకుండా ఉన్నందుకు క్షమాపణ కోరుతున్నామని తెలిపారు.



థామ్సన్ నుంచి బిఎల్‌డిసి ఎయిర్ కూలర్లు

హైదరాబాద్ : యూరోపియన్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థామ్సన్ భారత మార్కెట్లోకి బిఎల్‌డిసి టెక్నాలజీతో ఎయిర్ కూలర్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. నోయిడాలో రూ.75 కోట్లతో తయారీ యూనిట్‌ను నెలకొల్పినట్లు పేర్కొంది. కొత్త కూల్ ప్రో అండ్ హెవీ డ్యూటీ సిరీస్ ఎయిర్ కూలర్‌లు మార్చి 23 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. వీటి ధరల శ్రేణీ రూ.3,999 నుంచి రూ.14,999గా నిర్ణయించింది.

టి-హబ్‌తో వెంచర్‌బ్లిక్ భాగస్వామ్యం

హైదరాబాద్ : భారతీయ ఆరోగ్య సంరక్షణ ఆవిష్కర్తల అంతర్జాతీయాకరణకు మద్దతును అందించడానికి టిహబ్‌తో వెంచర్‌బ్లిక్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. గురువారం టిహబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వెంచర్‌బ్లిక్ దక్షిణాసియా ఆపరేషన్స్ హెడ్ కైలాష్ జియల్దాసని, సిఇఒ క్రిస్‌లీ, టిహబ్ సిఇఒ ఆంథోనీ అనీష్ పాల్గొన్నారు. ఈ ఒప్పందంతో భారత స్టార్టప్‌లు విస్తరించడానికి మార్గనిర్దేశం చేయనున్నట్లు వెంచర్‌బ్లిక్ పేర్కొంది. ప్రపంచంలోని మొట్టమొదటి హెల్త్‌కేర్ భాగస్వామ్య వేదిక, 'డిస్కవరీ'ని ప్రారంభించాలని ప్రణాళికలు రూపొందించామని కైలాష్ జియాల్దాసాని పేర్కొన్నారు. భారతీయ పారిశ్రామికవేత్తల్లో వైద్య పరికరాల సాంకేతికత సామర్థ్యం పెంచాలని నిర్దేశించుకున్నామన్నారు.

బంగారం కొనలేరు..!

రూ.69 వేలు పైనే..

న్యూఢిల్లీ : బంగారం ధర పరుగులు పెడుతోంది. సామాన్యులు పసిడిని కొనలేని స్థాయికి ఎగిసింది. పది గ్రాముల బంగారం రూ.69వేల చేరువలో నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారానికి డిమాండ్ పెరగడంతో దేశీయంగాను ధరలు ఎగిసిపడుతున్నాయి. గుడ్‌రిటర్న్స్ ప్రకారం.. గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,090 పెరిగి రూ.67,570కి చేరింది. దీనికి 3 శాతం జిఎస్‌టి కలిపితే రూ.69వేలు దాటుతోంది. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,000 పెరిగి రూ.61,950 వద్ద ముగిసింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల అపరంజి ధర రూ.67,420గా, 22 క్యారెట్ల ధర రూ.61,800గా పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 2208 డాలర్ల వద్ద, వెండి ధర 25.51 డాలర్ల వద్ద నమోదవుతోంది. వడ్డీ రేట్లలో ఈ ఏడాది మూడు సార్లు కోత ఉంటుందని ఫెడ్ సంకేతాలు ఇవ్వడంతో డాలర్ డిమాండ్ తగ్గి.. బంగారానికి డిమాండ్ పెరిగిందని బులియన్ నిపుణులు పేర్కొంటున్నారు.



ఎఫ్ఎల్‌ఒ కొత్త చైర్‌పర్సన్‌గా ప్రియా గజ్దర్



హైదరాబాద్ : ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఒ) నూతన చైర్‌పర్సన్‌గా ప్రియా గజ్దర్, వైఎఫ్ఎల్ఒ చైర్‌పర్సన్‌గా రిది జైన్ నియమితులయారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఎఫ్ఎల్ఒ వార్షిక సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఎఫ్ఎల్ఒ చీఫ్‌గా ఉన్న రితు షా పదవీ కాలం 2023-24తో ముగిసింది. కొత్త కమిటీ 2024-25 వరకు కొనసాగనుంది. రిది జైన్ 19వ వైఎఫ్ఒగా బాధ్యతలను స్వీకరించారు.

తెలుగు రాష్ట్రాల్లో మరో 10 అవుట్‌లెట్‌ల ఏర్పాటు

- హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్ : బ్యాంకింగ్ సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాల్లో వివిఎల్ఇ సహకారంతో దేశంలో బ్యాంకింగ్ సదుపాయాలు లేని గ్రామీణ కేంద్రాల్లో (యుఆర్‌సిఎస్) మరో 60 బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేసినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. ఇవి బిజినెస్ కరస్పాండెంట్ (బిసి)లతో నడుస్తాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 10 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొంది. తాజా విస్తరణతో దేశ వ్యాప్తంగా గ్రామీణ కేంద్రాల నెట్‌వర్క్ 5,020 అవుట్‌లెట్‌లకు విస్తరించినట్లయ్యిందని వెల్లడించింది.

అయోధ్యలో సిటీ యూనియన్ బ్యాంక్ 800వ శాఖ ఏర్పాటు

హైదరాబాద్ : సిటీ యూనియన్ బ్యాంక్ తన 800 శాఖను ఆయోధ్యలో ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఇది తమ సంస్థకు ఓ గొప్ప మైలురాయి అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు సొసైటీలో తమ బ్యాంక్ 120వ ఏళ్లను పూర్తి చేసుకుంటుందని తెలిపింది. ఈ కొత్త శాఖ ప్రారంభోత్సవంలో సిటీ యూనియన్ బ్యాంక్ చైర్మన్ ఎం నారాయణన్, పారిశ్రామికవేత్త వినయ్ మనుచా, బ్యాంక్ మాజీ చైర్మన్ ఎన్ కమకోడి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



కియా కార్లు 3 శాతం ప్రియం

న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ కియా ఇండియా వాహన ధరలను పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. వచ్చే ఏప్రిల్ 1 నుంచి తమ కార్ల ధరలను 3 శాతం వరకు హెచ్చించనున్నట్లు వెల్లడించింది. నిర్వహణ వ్యయాలు, ముడి సరకుల ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని కియా ఇండియా నేషనల్ హెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ హర్దీప్‌సింగ్ బ్రార్ పేర్కొన్నారు. వినియోగదారులకు ప్రీమియం, సాంకేతికంగా అధునాతన ఉత్పత్తులను అందించడానికి కంపెనీ కృషి చేస్తుందన్నారు. ఈ ఏడాదిలో కార్ల ధరల్ని పెంచడం ఇదే తొలిసారి అన్నారు.

స్మార్ట్ వాచ్‌తోనూ చెల్లింపులు

- నాయిస్‌తో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ : నాయిస్, మాస్టర్‌కార్డ్‌తో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇది మాస్టర్ కార్డ్ సహకారంతో పని చేసే స్మార్ట్ వాచ్ కాంటాక్ట్‌లెస్ ఎన్ఎఫ్‌సి చెల్లింపులకు అవకాశం కల్పిస్తుంది.

వినియోగదారులు తమ స్మార్ట్ వాచ్‌ను కేవలం రూ.2,999కి ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్ నుంచి ఆర్డర్ చేయవచ్చని పేర్కొంది. ఈ స్మార్ట్ వాచ్‌లను నాయిస్ అభివద్ధి చేయగా తాము వినియోగానికి తీసుకువచ్చామని ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సిఇఒ గణేష్ అనంత నారాయణన్ తెలిపారు. ఎన్ఎఫ్‌సి చిప్ ఉన్న స్మార్ట్ వాచ్‌లతో రిటైల్ అవుట్‌లెట్‌లు, పిఒఎస్ టెర్మినల్స్, అనేక ఇతర టచ్‌పాయింట్‌లలో కాంటాక్ట్‌లెస్ చెల్లింపులకు సజావుగా మద్దతునిచ్చేలా రూపొందించామన్నారు.

హైదరాబాద్‌లో సీడ్ హెల్త్ ల్యాబ్ ఏర్పాటు


- సిన్జెంటా వెజిటబుల్ సీడ్స్ వెల్లడి

హైదరాబాద్ : భారత్‌లో అత్యాధునిక సీడ్ హెల్త్ ల్యాబ్‌ను హైదరాబాద్ పరిసరాల్లో ప్రారంభించినట్లు సిన్జెంటా వెజిటబుల్ సీడ్స్ వెల్లడించింది. మేడ్చల్ మండలం నూతంకల్‌లో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. గురువారం దీన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు లాంచనంగా ప్రారంభించారు. కీలకమైన ప్రపంచ విత్తన ఎగుమతిదారుగా నిలువాలనే భారత లక్ష్యానికి అనుగునంగా ఈ పెట్టుబడి మద్దతు ఇస్తుందని సిన్జెంటా వెజిటబుల్ సీడ్స్ గ్లోబల్ హెడ్ ఎరిక్ పోస్మా పేర్కొన్నారు. సాగుదారులకు అత్యధిక నాణ్యత గల కూరగాయల విత్తన ఉత్పత్తులను అందించాలని తమ సంస్థ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తమ సంస్థ 124 దేశాలకు విత్తనాలను సరఫరా చేస్తుందన్నారు.



నిజామాబాద్ డీసీసీబీపై నెగ్గిన అవిశ్వాసం

- అందని చైర్మెన్ రాజీనామా పత్రం
- ఇన్‌చార్జి చైర్మెన్‌గా కుంట రమేష్‌రెడ్డి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్‌డీసీసీబీ అవిశ్వాసం నెగ్గింది. కానీ గత చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి రాజీనామా పత్రం మాత్రం అధికారులకు అందలేదు. రాజీనామా పత్రం నేరుగా అందించినప్పుడే రాజీనామా చెల్లుతుందని (డీసీవో) జిల్లా సహకార సంఘాల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. నిజామాబాద్ డీసీసీబీపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్టు ఈ నెల 5న డైరెక్టర్లు అధికారులకు నోటీసు అందజేశారు. అదేవిధంగా ఆ నోటీసులను డీసీసీబీలో ఉన్న డైరెక్టర్లందరికీ అధికారులు అందించారు. ఈ నెల 21న అవిశ్వాస తీర్మానం ఉంటుందని తెలియజేశారు. కాగా.. గురువారం అవిశ్వాస తీర్మాన సమావేశానికి మొత్తం 21 మంది డైరెక్టర్లలో 17 మంది హాజరయ్యారు. అందులో 16 మంది డైరెక్టర్లు కుంట రమేష్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ చేతులెత్తారు. కానీ బుస్సాపూర్ సొసైటీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్‌రెడ్డి మాత్రం మద్దతు పలకకుండా ఉండిపోయారు. అనంతరం డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మెన్‌గా కుంట రమేష్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈనెల 26 వరకు ఇన్‌చార్జి చైర్మెన్‌గానే రమేష్‌రెడ్డి బాధ్యతలు నిర్వహించనున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, షబ్బీర్ అలీకి కుంట రమేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పోచారం భాస్కర్‌రెడ్డిపై అసంతృప్తి వల్లే అవిశ్వాసం ఏర్పాటు చేశామని, పాలకవర్గం సలహాలు, సూచనల మేరకు బ్యాంక్‌ను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.